ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఖమ్మం

fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-2-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 22 పేజీలు: 8+16 వెల: 8.00



12 రాష్ట్రాల్లో 32 బోగస్ యూనివర్సిటీలు! 2

పరువునష్టం కేసులో రాహుల్ గాంధీకి బెయిలు 5


## కాంగ్రెస్ పార్టీ భారత్ ఆత్మ

## ఎవ్వరూ రూపుమాపలేరు



శనివారం అనంతగిరిలో డిసిసి అధ్యక్షుల శిక్షణ శిబిరంలో పాల్గొన్న సీఎం రేవంత్, షర్మిల, మహేష్ కుమార్

### 'గాంధీ'లపై బురదజల్లుతున్న బిజెపి

### క్రమశిక్షణ గల డిసిసి అధ్యక్షులకు సముచిత స్థానం

### మారుమూల గ్రామాలకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోండి

### తెలుగురాష్ట్రాల పార్టీ శిక్షణ శిబిరం ప్రారంభించిన సిఎం రేవంత్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీని రూపుమాపడం బీజేపీకి సాధ్యం కాదని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. భారతదేశపు ఆత్మనే కాంగ్రెస్ పార్టీయని, దాన్ని దెబ్బతీయాలని కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. డీసీసీ అధ్యక్షులు క్రమశిక్షణతో ముందుకు సాగి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరి హరిత రిసార్టులో రెండు తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు 10 రోజుల పాటు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం మాట్లాడుతూ దేశం కోసం మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణాలు అర్పించారని కొనియాడారు. 40 ఏళ్లపాటు బ్రిటీషర్లతో పోరాడిన గాంధీజీపై ఏనాడూ లాఠీలు ఝులిపించలేదని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత హత్య చేశారని అన్నారు. ఇందిర, రాజీవ్ మరణాంతరం సోనియాగాంధీ పార్టీ కోసమే తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. పధానమంత్రి పదవి పొందే అవకాశాలు ఉన్నా రాహుల్‌గాంధీ త్యాగంచేశారని అన్నారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసి ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. 23ఏండ్ల క్రితమే వైయస్‌రాజశేఖరరెడ్డి కూడా పాదయాత్ర ద్వారా ప్రజాసమస్యలు గుర్తించి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పరిష్కరించారని తెలిపారు. ఇప్పటికీ ఆ పథకాలే ప్రజలకు మేలు చేస్తున్నాయని కొనియాడారు. ఏపీలో

>>2



శనివారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన బ్రెజిల్ అధ్యక్షుడు డిసిల్వా

## భారత్- బ్రెజిల్ మధ్య వాణిజ్య లక్ష్యం 20 బిలియన్ డాలర్లు

### ఎఐ, డిజిటల్ టెక్నాలజి, స్టార్టప్‌లో వ్యూహాత్మక భాగస్వామ్యం

### బ్రెజిల్ అధ్యక్షుడు లులా డిసిల్వాతో ప్రధాని చర్చలు

### గ్లోబల్ సౌత్ బలోపేతం: మోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** భారతదేశం- బ్రెజిల్ సంబంధాలలో కొత్త అధ్యాయం మొదలైంది. భారత్ - బ్రెజిల్ మధ్య కీలక వాణిజ్య ఒప్పందం కుదిరింది. రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలకు కొత్త ఊపునిచ్చే కీలక అంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డసిల్వా మధ్య ద్వైపాక్షిక చర్చలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. భారత పర్యటనలో ఉన్న బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్‌ఇనాసియో లులా ద సిల్వాతో ప్రధాని మోడీశనివారం ఢిల్లీలో హైదరాబాద్ హౌస్‌లో సమావేశమయ్యారు. ఇరువురి నేతల మధ్య కీలక ద్వైపాక్షిక

>>2

## 15 శాతానికి సుంకాలు పెంచిన ట్రంప్




### అమెరికా సుప్రీం' తీర్పును లెక్కచేయనన్న అధ్యక్షుడు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** ట్రంప్ విధించిన వాణిజ్య సుంకాలు చెల్లవని సాక్షాత్తూ అమెరికా సర్వోన్నత న్యాయస్థానంఆదేశించినా ట్రంప్ మాత్రం అప్పటికప్పుడు పెంచిన పది శాతం సుంకాలను హటాత్తుగా 15శాతానికి పెంచారు. సుప్రీం కోర్టు ఉత్తర్వులు వెలువడిన ఒక్కరోజులోనే ట్రంప్ మరో కొత్త కార్యనిర్వాహక ఉత్తర్వును తెచ్చి సుంకాలను పదిశాతానికిపెంచామన్నారు. 150 రోజులు అంటే ఐదునెలలపాటు ఈ సుంకాలు అమలులో ఉంటాయని, తక్షణమే అమలుకు వస్తాయనికూడా ట్రంప్ తన సోషల్‌మీడియా ట్రూత్‌లో

>>2

## తెలంగాణపై వివక్ష లేదు..



### అభివృద్ధిలో కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేయాలి

### జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సులో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి21:** అభివృద్ధి కార్యక్రమాల్లో ఎలాంటి రాజకీయాలకు తావు ఉండదని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. కేంద్రం,రాష్ట్రం కలిసి పని చేయాలని తెలంగాణతో ఎటువంటి వివక్ష ఉండదు అని హామీ ఇచ్చారు. రాష్ట్ర కేంద్ర సహకారం భారత పురోగతికి అవసరమని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లో జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సు, 25వ కేంద్రస్థాయి సమన్వయ కమిటీ(సివ్‌సిసి) సమావేశంలో ఆయన

>>2

## ఎఐ డిక్లరేషన్‌కు 88 దేశాల మద్దతు




### స్థానిక ఆవిష్కరణలకు మరింత ప్రోత్సాహం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అంతర్జాతీయ సహకారానికి సంబంధించి భారత్ ప్రతిపాదించిన న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు అనూహ్య మద్దతు లభించింది. న్యూఢిల్లీ వేదికగా జరిగిన మెగా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్‌ను ఆమోదించారు. భారత్‌తో సహా 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు దీనికి మద్దతు తెలపడం ప్రపంచఏకాభిప్రాయానికి నిదర్శనంగా నిలిచింది. ఆర్థికవృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై ఈ డిక్లరేషన్ ఒక స్పష్టమైన

>>2

## త్వరలో సమగ్ర ఎన్‌ఆర్‌ఐ పాలసీ




శనివారం నిర్మల్ కలెక్టరేట్‌లో సమావేశమైన ఎన్‌ఆర్‌ఐ అడ్వైజరీ కమిటీ

### గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి చర్యలు

### ఎన్‌ఆర్‌ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్ బిఎం వినోద్ కుమార్

**నిర్మల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి చర్యలు తిసుకుంటున్నట్లు ఎన్‌ఆర్‌ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్ బి ఎం వినోద్ కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఎన్‌ఆర్‌ఐ అడ్వైజరీ కమిటీ, గల్ఫ్ ఎన్‌ఆర్‌ఐ పాలసీ రూపకల్పనకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ఎన్‌ఆర్‌ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్ వినోద్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రం నుంచి వివిధ గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికుల సంక్షేమం కొరకు ప్రభుత్వం సమగ్ర ఎన్‌ఆర్‌ఐ పాలసీని రూపొందించేందుకు కృషి చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగానే కమిటీ, నిర్మల్ జిల్లాలో పర్యటించిందని తెలిపారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికులకు ఏ విధమైన పాలసీలు రూపొందించాలన్న విషయంపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా తెలుసుకునేందుకు గల్ఫ్ వలస కార్మికులు, వారి కుటుంబాలతో వివరాలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు అధికంగా ఉన్నాయని, గల్ఫ్ దేశాలకు వెళ్లే కార్మికులకు ఆయా దేశాల చట్టాలు, కార్మిక చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. లైసెన్సులు కలిగిన ఏజెన్సీల ద్వారానే కార్మికులు విదేశాలకు వెళ్లేలా చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున టామ్ కామ్ ద్వారా కార్మికులకు విదేశాలలో ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని, దీనిపై గ్రామీణ స్థాయిలో విస్తృత అవగాహన అవసరమని అభిప్రాయపడ్డారు. గల్ఫ్ దేశాలలో సమస్యల్లో చిక్కుకున్న కార్మికులకు సహాయ సహకారాలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. జిల్లాలో వినూత్నంగా గల్ఫ్ కార్మికుల కొరకు ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ సమావేశంలో భాగంగా, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో గల్ఫ్ కార్మికుల సహాయార్థం హెల్ప్ లైన్ నంబరు 9398421883 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ గల్ఫ్ దేశాలలో చిక్కుకున్న పలువురు కార్మికులను కలెక్టర్ చొరవతో సురక్షితంగా స్వదేశానికి రప్పించగలిగినట్టు వివరించారు. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు, సంబంధించిన వివిధ శాఖలు సమన్వయంతో పని చేస్తూ కృషి చేస్తున్నాయని తెలిపారు.

ఎన్‌ఆర్‌ఐ అడ్వైజరి కమిటీ బృందాన్ని, అధికారులని పలువురు శాలువాలతో సన్మానించారు. ఈ సమావేశంలో ఎన్‌ఆర్‌ఐ అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీమ్ రెడ్డి, సభ్యులు చెన్నమనేని శ్రీనివాసరావు, సింగిరెడ్డి నరేష్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉద్రిక్తత

శనివారం కామారెడ్డిలో కాంగ్రెస్ మాజీ సర్పంచ్ కారును ధ్వంసం చేస్తున్న బిజెపి కార్యకర్తలను అదుపు చేస్తున్న పోలీసులు





మార్కెట్ రాబడులతో లైఫ్ కవర్ బెనిఫిట్స్‌ని పొందండి

నాన్-పార్, లింక్డ్, లైఫ్, ఇండివిజువల్, సేవింగ్స్ ప్లాన్

- ₹2,500/- అతితక్కువ నెలవారీ ప్రీమియంతో ప్రారంభించండి
- రెండు ఫండ్స్ నుంచి ఎంచుకోవచ్చు: నిఫ్టీ 50 (ఫ్లెక్సీ స్మార్ట్ గ్రోత్ ఫండ్) లేదా నిఫ్టీ 100 (ఫ్లెక్సీ గ్రోత్ ఫండ్) యొక్క ఎంపికచేసిన స్టాక్స్‌లో 100% వరకు పెట్టుబడిపెట్టడం జరుగుతుంది
- గ్యారంటీడ్ అడిషన్‌లతో*

*నియమ నిబంధనలు వర్తిస్తాయి

LIC లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా LIFE INSURANCE CORPORATION OF INDIA
ప్రతి క్షణం మీకు తోడుగా

LIC/P/2024-25/22/TEL

వివరాల కొరకు, మీ ఏజెంట్‌ని/సమీపంలో ఉన్న ఎల్ఐసి బ్రాంచిని సంప్రదించండి లేదా 56767474కి మీ నగరం పేరు ఎస్ఎంఎస్ చేయండి

డౌన్‌లోడ్ చేసుకోండి ఎల్ఐసి మొబైల్ యాప్ LIC digital | సందర్శించండి: licindia.in | కాల్ సెంటర్ సర్వీసు (022) 6827 6827 | మా వాట్సాప్ నం. 8976862090 'Hi' చెప్పండి | మమ్మల్ని ఫాలో అవ్వండి: LIC India Forever | IRDAI Regn No.: 512

నకిలీ ఫోన్ కాల్స్ మరియు కాల్పనిక/కపట ప్రతిపాదనలకు లొంగకుండా జాగ్రత్తపడండి. ఐఆర్‌డిఎఐ లేదా దాని అధికారులు బీమా పాలసీలు విక్రయించడం, బోనస్ ప్రకటించడం లేదా ప్రీమియంలు పెట్టుబడిపెట్టడం. మొత్తాలను రిఫండ్ చేయడం లాంటి పనులు వేటినీ చేయరు. ఇలాంటి ఫోన్ కాల్స్‌ని అందుకునే ప్రజలను పోలీసులకు ఫిర్యాదు చేయవలసిందిగా కోరడమైనది. నష్టాంశాలు, నియమ నిబంధనలపై మరిన్ని వివరాల కొరకు, దయచేసి పాలసీని విక్రయించడానికి ముందు అమ్మకాల బ్రోచర్‌ని జాగ్రత్తగా చదవండి.

మారుతుండే లింక్డ్ ఇన్సూరెన్స్ ప్రొడక్ట్‌లు సంప్రదాయ బీమా ప్రొడక్ట్‌ల కంటే భిన్నంగా ఉంటాయి మరియు నష్టాంశాలకు లోబడి ఉంటాయి.
లింక్డ్ ఇన్సూరెన్స్ పాలసీల్లో చెల్లించిన ప్రీమియం కింద అందించబడే యాన్యుటీ, క్యాపిటల్ మార్కెట్‌లతో మరియు బహిరంగంగా లభిస్తున్న ఇండెక్స్‌తో ముడిపడివున్న పెట్టుబడి రిస్కులకు లోబడి ఉంటుంది. ఫండ్ పనితీరు మరియు క్యాపిటల్ మార్కెట్‌లతో మరియు బహిరంగంగా లభిస్తున్న ఇండెక్స్‌ని ప్రభావితం చేస్తున్న అంశాలపై ఆధారపడి యూనిట్‌ల ఎన్ఎవిలు పెరగవచ్చు లేదా తగ్గవచ్చు మరియు ఇన్షూర్డ్ (అతను/ఆమె) తన నిర్ణయాలకు తానే బాధ్యత వహించవలసి ఉంటుంది.
లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనేది జీవిత బీమా కంపెనీ పేరు మాత్రమే మరియు ఇండెక్స్ ప్లస్ అనేది లింక్డ్ ఇన్సూరెన్స్ కాంట్రాక్టు పేరు మాత్రమే మరియు కాంట్రాక్టు నాణ్యతను, దాని వృద్ధి అవకాశాలను లేదా రాబడులను ఏ విధంగానూ సూచించడం లేదు.
ఈ కాంట్రాక్టు కింద అందించబడుతున్నవివిధ ఫండ్‌లు ఆయా ఫండ్‌ల పేర్లు మాత్రమే మరియు ఈ ప్లాన్‌ల నాణ్యతను, వాటి వృద్ధి అవకాశాలను మరియు రాబడులను ఏ విధంగానూ సూచించడం లేదు.



శనివారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయిన బ్రెజిల్ అధ్యక్షుడు డిసిల్వా

## భారత్- బ్రెజిల్ మధ్య వాణిజ్య లక్ష్యం 20 బిలియన్ డాలర్లు

>> చర్చలు జరిగాయి. భవిష్యత్ కోసం డిజిటల్ పార్ట్నర్‌షిప్, రేర్‌ఎర్త్ అండ్ క్రిటికల్ మినరల్స్, స్టీల్ సరఫరా గొలుసులో మైనింగ్ రంగాల్లో పరస్పర సహకారానికి సంబంధించి మూడు ఒప్పందాలపై వారిద్దరు సంతకాలు చేశారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్త విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

అధ్యక్షుడు లూలా, ఆయన ప్రతినిధి బృందాన్ని భారతదేశానికి స్వాగతిస్తూ, ప్రధానమంత్రి మోడీ మాట్లాడుతూ, "అధ్యక్షులు లూలా, ఆయన బృందాన్ని భారతదేశానికి స్వాగతించడానికి సంతోషిస్తున్నా. భారత్– బ్రెజిల్ సంబంధాలు చాలాకాలంగా ఆయన దార్శనికత, స్ఫూర్తి దాయక నాయకత్వం ద్వారా ప్రయోజనం పొందాయి" అని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇద్దరు నాయకులు అనేకసార్లు సమావేశమయ్యారు. ప్రతిసారీ బ్రెజిల్ అధ్యక్షులు లూలాకు భారత దేశం పట్ల ఉన్న లోతైన స్నేహం, నమ్మకం స్పష్టంగా అనుభూతి చెందిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. అధ్యక్షులు లూలా పర్యటన చారిత్రాత్మక ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు శక్తినిచ్చింది. రెండుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని ప్రధాని మోడీ అన్నారు.

లాటిన్ అమెరికాలో భారతదేశానికి బ్రెజిల్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. రాబోయే ఐదు సంవత్సరాలలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 20 బిలియన్ డాలర్లకు మించి తీసుకెళ్లడానికి రెండు దేశాలు కట్టుబడి ఉన్నాయి. "మా వాణిజ్యం కేవలం ఒక సంఖ్య కాదు, ఇది పరస్పర విశ్వాసానికి ప్రతిబింబం. అధ్యక్షులు లూలాతో పాటు వచ్చిన పెద్ద వ్యాపార ప్రతినిధి బృందం ఈ నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది" అని ప్రధాని మోడీ అన్నారు.

అంతర్జాతీయ వేదికపై భారత్, బ్రెజిల్ దేశాలు కలిసి పనిచేస్తే 'గ్లోబల్ సౌత్' స్వరం మరింత బలోపేతం అవుతుందని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు.

**భద్రతామండలిలో భారత్‌కు ప్రాతినిధ్యం కల్పించాలి: బ్రెజిల్ అధ్యక్షుడు**

ఐక్యరాజ్యసమితిలో, ముఖ్యంగా యుఎన్ భద్రతా మండలి (యుఎన్ఎస్‌సి)లో తక్షణ సంస్కరణలకు శ్రీకారం చుట్టాలని బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా పిలుపునిచ్చారు, భారత్, బ్రెజిల్ రెండింటినీ శాశ్వత భద్రతా మండలి సభ్యులుగా అవకాశం కల్పించాలని కోరారు. "20 సంవత్సరాలకు పైగా, బ్రెజిల్, భారతదేశం, జపాన్, జర్మనీలు బి4 అనే సమూహాన్ని ఏర్పాటు చేశాయి, ఇక్కడ తాము యుఎన్ భద్రతా మండలి పెరుగుదలను సమర్థిస్తున్నాము, ఇది ఇప్పటివరకు జరగలేదు, కానీ యుఎన్‌కు మరింత ప్రాతినిధ్యం అవసరం కాబట్టి ఖచ్చితంగా త్వరలో జరుగుతుంది. నేడు ప్రపంచ వ్యాప్తంగా మనం చూస్తున్న సంఘర్షణలలో జోక్యం చేసుకోవడానికి యుఎన్‌కు శక్తి, బలం ఉండాలి. దీన్ని చేయని సంస్థ మనుగడ సాగించదు" అని బ్రెజిల్ అధ్యక్షుడు పేర్కొన్నారు. "కాబట్టి, ప్రపంచవ్యాప్తంగా మరిన్ని దేశాలతోపాటు బ్రెజిల్, భారతదేశం శాశ్వత భద్రతా మండలిలో సభ్యులుగా ఉండటంతో యుఎన్ మరింత ప్రాతినిధ్యం వహించడానికి తాము పోరాడుతూనే ఉంటాము, శాశ్వత, శాశ్వతం కాని సభ్యుల వర్గాలను పెంచడం అనేది అనేక సవాళ్ల మధ్య ప్రపంచ పాలనకు చట్టబద్ధత, సామర్థ్యాన్ని అందించడానికి ఒక ముఖ్యమైన షరతు" అని ఆయన జోడించారు.

## సుంకాలు పెంచిన ట్రంప్

>> ప్రకటించారు. వీటిపై చర్చ కొనసాగుతున్న తరుణంలోనే ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలపైనా 15శాతానికి సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ మరోప్రకటన చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సోషల్‌మీడియా ట్రూత్ వేదికగా ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు కూడా చేసారు. ముందురోజు విడుదలయిన ట్యారిఫ్ వ్యతిరేక ఉత్తర్వులను పూర్తిగా సమగ్రంగా సమీక్షించామని, ఇలాంటి హాస్యాస్పద, పేలవంగా రాసి జారీచేసిన అమెరికా వ్యతిరేక నిర్ణయాన్ని ఆమోదించలేమని, ఎన్నో నెలల సుదీర్ఘ తర్జనబర్జనల తర్వాత విధించిన సుంకాలపై అమెరికా సుప్రీంకోర్టు వ్యతిరేక తీర్పు ఇచ్చిందని అన్నారు. అమెరికా అధ్యక్షుడుగా తక్షణమే ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలపైనా పదిశాతం సుంకాలు అమలుచేస్తున్నామని ప్రకటిస్తూ న్యాయబద్ధంగా ఈ నిర్ణయాన్ని సమీక్షించిన తర్వాత 15శాతం సుంకాలు వసూలుకు నిర్ణయించినట్లుప్రకటించారు. కొన్ని నెలలపాటు అమలు తర్వాత ఈసుంకాలపై పునఃసమీక్ష జరుగుతుందని మాగాకు అనుగుణంగా అమెరికానుమరింత సమున్నతంగా తీర్చిదిద్దేందుకు పునఃసమీక్ష కూడా అవసరమని అన్నారు.

## 12 రాష్ట్రాల్లో 32 బోగస్ యూనివర్సిటీలు!

### జాబితా విడుదలచేసిన వర్సిటీ గ్రాంట్స్ కమిషన్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** దేశంలోని 12 రాష్ట్రాల్లో మొత్తం 32 బోగస్ యూనివర్సిటీలున్నట్లు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) ప్రకటించింది. ఈ వర్సిటీలపై విద్యార్థులు, తల్లితండ్రులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఈ వర్సిటీలను యుజిసి చట్టంపరిధిలో గుర్తింపు ఇవ్వలేదని, డిగ్రీలు ప్రధానంచేసేందుకు వీటికి ఎటువంటి అర్హతలు లేవని వెల్లడించింది. వీటినుంచి ఎలాంటి డిగ్రీలు పొందినా వారిని అనర్హులుగానే పరిగణించడం జరుగుతుందని, ఇతర అధికార ప్రయోజనాలకుకానీ, ఉపాధికోసం కానీ ఈ డిగ్రీలు చెల్లుబాటు కావని హెచ్చరించింది. ఈరాష్ట్రాల్లో ఢిల్లీ అగ్రగామిగా ఉంది. మొత్తం 12 నకిలీ వర్సిటీలున్నాయి. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌లో నాలుగు, ఆంధ్రప్రదేశ్‌లో రెండు, కర్ణాటకలో రెండు, కేరళలో రెండు, మహారాష్ట్ర, పుదుచ్చేరి, పశ్చిమబెంగాల్‌లలోరెండేసి చొప్పున ఉన్నాయి. అరుణాచల్‌ప్రదేశ్, హర్యానా, జార్ఖండ్, రాజస్థాన్‌లలో ఒక్కొక్కటిచొప్పున బోగస్ యూనివర్సిటీలున్నట్లుయూజిసి వెల్లడించింది. వెబ్‌సైట్‌లోనే ఈ వర్సిటీల పూర్తి వివరాలు వెల్లడించినట్లు తెలిపింది. విద్యార్థులు, తల్లితండ్రులను మభ్యపెట్టేవిధంగా గొప్పగొప్ప పేర్లతో ఇవి ఉన్నాయని వివరించింది. పార్లమెంటు, రాష్ట్ర చట్టాల ద్వారా ఏర్పడినవి మాత్రమేవర్సిటీలుగా చెల్లుబాటవుతాయని, అవిమాత్రమే డిగ్రీలు, సర్టిఫికేట్లు ఇచ్చేందుకు అర్హత ఉందని వివరించింది. ఆంధ్రప్రదేశ్‌లో క్రిస్ట్‌న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ, బైబిల్‌ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా, అరుణాచల్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్‌మెడిసిన్, హర్యానాలో మజిక్ అండ్ ఆర్ట్ వర్సిటీ, జార్ఖండ్‌లో దక్ష వర్సిటీ, కర్ణాటకలో సర్వభారతీయ శిక్షా పీఠ్, గ్లోబల్ హ్యూమన్ పీస్ వర్సిటీలున్నాయి. కేరళలో కూడా ఇంటర్నేషనల్ ఇస్లామిక్ యూనివర్సిటీ ఆఫ్ ప్రోఫెటిక్‌మెడిసిన్, సెయింట్ జాన్స్ వర్సిటీలు బోగస్‌గా నిలిచాయి.

## ఎఐ డిక్లరేషన్‌కు 88 దేశాల మద్దతు

>> మార్గాన్ని నిర్దేశిస్తోంది. సర్వజన హితాయ, సర్వజన సుఖాయ అనే భారతీయ తాత్విక సూత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఏఐ ద్వారా లభించే ప్రయోజనాలు ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలనే ఆశయాన్ని ఇది పునరుద్ఘాటించింది. వసుధైవ కుటుంబకం అనే భావనతో, అన్ని దేశాలు తమ పౌరుల ప్రయోజనాల కోసం ఏఐని అభివృద్ధి చేసి, వినియోగించుకునేలా వనరులను అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రాముఖ్యతను ఈ తీర్మానం నొక్కి చెప్పింది. అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, అన్ని భాగస్వామ్య పక్షాలను కలుపుకొనిపోవడం, దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం, విశ్వసనీయమైన ఫ్రేమ్‌వర్క్‌ల ద్వారా ఏఐ పురోగతిని ప్రోత్సహించడం వంటి అంశాలకు ఇందులో ప్రాధాన్యత ఇచ్చారు. ఈ డిక్లరేషన్ ఏడు కీలక స్తంభాల ఆధారంగా రూపొందింది. ఏఐ వనరుల ప్రజాస్వామ్యీకరణ ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు సురక్షితమైన, విశ్వసనీయమైన ఏఐ శాస్త్రీయ ప్రగతికి ఏఐ సామాజిక సాధికారతకు ఏఐ లభ్యత మానవ వనరుల అభివృద్ధి స్థిరమైన, సమర్థవంతమైన, వినూత్నమైన ఏఐ వ్యవస్థలు ఏఐని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలంటే పటిష్టమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, అందరికీ అందుబాటులో ఉండే అర్థవంతమైన కనెక్టివిటీ అత్యంత అవసరమని ఈ డిక్లరేషన్ స్పష్టం చేసింది. ఓపెన్ సోర్స్, ఇంధన సామర్థ్యం గల ఏఐ మౌలిక సదుపాయాల అవసరాన్ని కూడా ఇది హైలైట్ చేసింది. చార్టర్ ఫర్ ది డెమొక్రాటిక్ డిఫ్యూజన్ ఆఫ్ ఏఐ అనే స్వచ్ఛంద, నిర్బంధం లేని ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇది జాతీయ చట్టాలను గౌరవిస్తూనే, ఏఐ వనరులను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి, స్థానిక ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి దోహదపడుతుంది. శాస్త్రీయ పరిశోధన, అభివృద్ధి, పాలన, ప్రభుత్వ సేవల వంటి రంగాల్లో ఏఐ పాత్రను విస్తరించాలని డిక్లరేషన్ పిలుపునిచ్చింది. సురక్షితమైన, నమ్మకమైన ఏఐ వ్యవస్థలను నిర్మించడం ద్వారానే ప్రజల్లో విశ్వాసం పెరిగి, దాని పూర్తి ప్రయోజనాలను పొందగలమని పేర్కొంది. ఈ సమ్మిట్ ద్వారా ఏర్పడిన ఏకాభిప్రాయం, భవిష్యత్తులో ఏఐని మానవాళి ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవడానికి అవసరమైన అంతర్జాతీయ సహకారానికి మార్గం సుగమం చేస్తుందని సభ్య దేశాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

## వారం - వర్జ్యం

22-02-2026, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శతభిషం కార్తె
పంచమి ఉ.11.09
అశ్వని సా.5.53
వర్జ్యం : రా.2.57-4.27
దు.సా.4.36-6.13
శుభసమయం:ఉ.6.30-7.30,సా.6.00-7.00
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** సమాధానం లేని, పరిష్కారం కాని విషయాలలో నిబ్బరతతో వ్యవహరించి ప్రతిష్ఠను కాపాడుకుంటారు.

**వృషభం:** ముక్కుసూటితనం కన్నా లౌక్యంగా వ్యవహరించడం వలన గొప్ప గొప్ప కార్య క్రమాలను సులువుగా సాధించవచ్చని గుర్తిస్తారు.

**మిథునం:** ఆర్థికంగా చెప్పుకోదగి ఒడిదుడుకులు ఉండవు. చాలా మందికి మీ నుండి మౌనమే సమాధానం అవుతుంది.

**కర్కాటకం:** మంచితనంతో సమయస్ఫూర్తితో అభివృద్ధికి అవసరమై వనరులు సమర్థవంతంగా సమకూర్చుకుంటారు.

**సింహం:** సమాజంలో ఉన్నత స్థానాలలోని వారితో మిత్రత్వము ఏర్పడుతుంది. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

**కన్య:** జీవితాశయాన్ని సాధించుకోవాలన్న దృఢసంకల్పంతో అడుగులు ముందుకు వేస్తారు. ప్రతిష్ఠ పెరుగుతుంది.

**తుల :** ఉద్యోగపరంగా స్థానచలనానికి చేసే ప్రయత్నాలు సానుకూలపడతాయి. కీళ్ల నొప్పులు బాధిస్తాయి.

**వృశ్చికం:** మీ పేరు మీద చేసే వ్యాపారాలు మధ్యస్థంగా ఉంటాయి. ఋణభారాన్ని దించుకోగలుగుతారు. శ్రమ అధికం.

**ధనుస్సు:** సోదర, సోదరీ వర్గంతో కలిసి ఇష్టాగోష్టి సాగిస్తారు. స్త్రీలతో విభేదాలు రాకుండా జాగ్రత్త, వాహనసౌఖ్యం.

**మకరం:** అసత్యమైన ఆరోపణలు నిందలు వైరి వర్గం కుట్రలను మొండి ధైర్యంతో ఎదుర్కొంటారు. ఆరోగ్య సమస్యలు అధిగమిస్తారు.

**కుంభం:** కరస్పాండెన్స్‌లో స్వయంకృతాపరాధాలు చోటుచేసుకున్నప్పటికీ చెప్పుకోదగిన ఇబ్బందులేవీ ఏర్పడవు.

**మీనం:** బాధ్యతలను సకాలంలో పూర్తి చేయగలుగుతారు. ఉపయుక్తమైనటువంటి చర్యలను మిత్రగణంతో సాగిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ప్రతీకార రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారా?

### కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండింటినీ ఓడించగల ఏకైక పార్టీ బీజేపీ అయితే, ఇలాంటి ప్రతీకార రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారా? అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. కామారెడ్డి బిజెపి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట్ రమణ రెడ్డి క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇది మీ ప్రజా పాలనా? ఇప్పుడు వాదనలకు రాళ్లు, దాడులతో సమాధానం ఇస్తున్నారా? ఎమ్మెల్యే కార్యాలయమే సురక్షితం కాకపోతే, తెలంగాణలో సామాన్యుడి పరిస్థితి ఏమిటి? ముఖ్యమంత్రి అయిన హోంమంత్రి ఏం చేస్తున్నారు? నిఘా బృందాలు ఏం ట్రాక్ చేస్తున్నాయి? ఎన్నికైన ప్రతినిధికి రక్షణ లభించకపోతే, ఎవరు చేస్తారు? శాంతిభద్రతలు అనుకూలంగా ఉండవు. ఏ ప్రభుత్వానికైనా ఇది ప్రథమ కర్తవ్యం. రాజకీయ హింసను కాపాడటం ఆపాలన్నారు.

## తెలంగాణపై వివక్ష లేదు..


>> పాల్గొని మాట్లాడారు. దేశ అభివృద్ధి కోసం రాజకీయాలు పక్కన పెట్టి తెలంగాణ ప్రభుత్వం కలిసి వస్తుందని, అందుకు తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా లక్‌పతి దీదీ కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్థికంగా బలపరుస్తున్నామని శివరాజ్‌సింగ్ తెలిపారు. ఇప్పటికే కోట్లాది మహిళలు సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్‌ల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో భాగస్వాములయ్యారని, తదుపరి లక్ష్యం మరింత విస్తరణేనని చెప్పారు. బ్యాంకర్లు కేవలం రుణదాతలుగా కాకుండా భాగస్వాములుగా మారాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ఏలాంటి రాజకీయాలకు తావు ఉండదని స్పష్టం చేశారు. మహిళల అభివృద్ధి విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేయాలని మంత్రి సీతక్క ప్రసంగించడం అభినందనీయమన్నారు. ఢిల్లీ, హైదరాబాద్ కలిసి పని చేయాలని, తెలంగాణతో ఎటువంటి వివక్ష ఉండదు అని హామీ ఇచ్చారు. రాష్ట్ర కేంద్ర సహకారం భారత పురోగతికి అవసరమని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి కోసం రాజకీయాలు పక్కనపెట్టి తెలంగాణ ప్రభుత్వం కలిసి వస్తుందని, అందుకు తెలంగాణ సీఎంకు, మంత్రి సీతక్కను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రి సీతక్క ప్రసంగాన్ని ప్రశంసిస్తూ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మహిళా సాధికారత సీతక్క స్వరంలో ప్రతిధ్వనించిందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక పరిపుష్టి దిశలో భారత ప్రభుత్వం అమలు చేస్తున్న స్కీంను వివరించారు.

ఈ సమావేశం రాష్ట్ర, కేంద్ర సమన్వయానికి నూతన దిశను చూపించిందని, మహిళా ఆధారిత అభివృద్ధి మోడల్‌తో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని సదస్సులో పలువురు అభిప్రాయపడ్డారు. మంత్రి సీతక్క నాయకత్వంలో మహిళా సాధికారతను మరింత వేగవంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కాగా, వేదికపై కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి సీతక్క పలు వినతిపత్రాలను సమర్పించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తైన నేపథ్యంలో, 15వ ఆర్థిక సంఘం నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అలాగే మహిళా స్వయం సహాయక సంఘాలు స్థాపిస్తున్న సోలార్ ప్లాంట్లకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీల గడువును రాబోయే ఆర్థిక సంవత్సరాల వరకు పొడిగించాలని కోరారు. ఈ అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం, తెలంగాణ చేనేత కార్మికులు నేసిన శాలువాలతో కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులను మంత్రి సీతక్క సత్కరించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు రూపొందించిన గిఫ్ట్ ప్యాకులను వారికి అందజేశారు. మహిళా సంఘాల నైపుణ్యాన్ని ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు అభినందించారు.

## నేడు సిఎం రేవంత్‌రెడ్డి రెడ్యాల.. దేవాదుల పర్యటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి21:** మహబూబాబాద్ మండలం రెడ్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వెన్నం శ్రీకాంత్ రెడ్డి, బిగ్ టివి చైర్మన్ వెన్నం విజయ్ కాంత్ రెడ్డి సోదరుల తండ్రి రాఘవేందర్ రెడ్డి ఇటీవల మరణించగా..., వెన్నం సోదరులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదివారం రెడ్యాల గ్రామానికి వెళ్ళనున్నారు.


మధ్యాహ్నం 1.30 గంటలకు బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 2.15 గంటలకు రెడ్యాల చేరుకుంటారు. దివంగత వెన్నం రాఘవేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, మధ్యాహ్నం 3 గంటలకు రెడ్యాల నుంచి బయలుదేరుతారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 3.30కు దేవాదుల ప్రాజెక్టుకు చేరుకుంటారు.దేవాదుల ప్రాజెక్టును సందర్శించి, అక్కడే ఇంజనీర్లతో సమీక్ష నిర్వహిస్తారు.



అనంతగిరిలో శనివారం ప్రారంభమైన కాంగ్రెస్ పార్టీ శిక్షణ శిబిరంలో పాల్గొన్న డిసిసి అధ్యక్షులు

## కాంగ్రెస్ పార్టీ భారత్ ఆత్మ

>> వైయస్ షర్మిల కూడా పాదయాత్ర చేసి ప్రజాసమస్యలు తెలుసుకోవడం అభినందనీయమని అన్నారు. డీసీసీ అధ్యక్షులు తండాల్లో, గిరిజన గూడేల్లో, మారుమూల గ్రామాలకు వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. తెలంగాణలో అధికారంలో ఉన్నందున వారి సమస్యలు పరిష్కారానికి పెద్దన్న పాత్ర పోషించాలని సీఎం తెలిపారు. డీసీసీ అధ్యక్షులు జిల్లాలకు అధిపతులమనే భావన ఉండరాదన్నారు. ఇది అధికారం కాదు..బాధ్యత అన్నారు. కుటుంబానికి ఉండే బాధ్యత వారికి ఉందని, అన్ని వర్గాలు అభిప్రాయాలు సేకరించాలని ఆయన తెలిపారు. 140 ఏళ్ల కాంగ్రెస్ చరిత్రలో ప్రజాస్వామ్య స్ఫూర్తి కొనసాగుతున్నదని గుర్తు చేశారు. పార్టీలో భిన్నాభిప్రాయాలను తీసుకోవడం మన సంప్రదాయమన్నారు. అలాంటి వారిని పార్టీ నుంచి బహిష్కరించాలనే దురుద్దేశ్యం ఉండవద్దని హితవు పలికారు. తాను పార్టీ పగ్గాలు చేపట్టినపుడు కాంగ్రెస్ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉందని గ్రహించామన్నారు. ప్రతి నేతను కలిసి వచ్చి పార్టీ బలోపేతం చేయడమే కాకుండా అధికారంలోకి వచ్చామని రేవంత్‌రెడ్డి వివరించారు. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు మానుకోవాలని అన్నారు. ఐదారు మంది పోట్లాడం వల్ల లక్షలాది మంది కార్యకర్తలు నష్టపోతారని గుర్తు చేశారు. డిజిటల్ సభ్యత్వం ద్వారా కాంగ్రెస్ పార్టీ బలోపేతంగా ఉందన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు 42 లక్షల డిజిటల్ సభ్యత్వాలు వచ్చాయని, ఇది కేవలం 60 రోజుల్లోనే ఇది సాధ్యమైందని తెలిపారు. ప్రస్తుతం పార్టీలో సమన్వయం నెలకొందన్నారు. బాగా పనిచేసిన డీసీసీలకు ఎమ్మెల్యే టిక్కెట్లు కూడా వచ్చాయని తెలిపారు.క్రమశిక్షణతో ముందుకు సాగిన వారికి హైకమాండ్ గుర్తింపు ఇస్తుందన్నారు. మెరిట్ కోటాలో డీసీసీలు వచ్చాయని, పదవిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. 2023లో అధికారం చేపట్టినపుడు కాంగ్రెస్ మెజార్టీ 2 శాతమే ఉండగా ఎంపీ ఎన్నికల్లో 4 శాతానికి పెరిగిందన్నారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో మిగతా పార్టీల కంటే 12 శాతం అధికంగా సాధించామని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. డీసీసీ అధ్యక్షులు పైరవీలకు దూరంగా ఉంటే గౌరవం ఉంటుందని హితవు పలికారు. క్రమశిక్షణతో కొనసాగినందున కేవలం 20 ఏళ్లలోనే ఎంతో సాధించానని రేవంత్‌రెడ్డి చెప్పారు. 2006లో జడ్పీటీసీగా గెలుపొందగా, 2007లో ఎమ్మెల్సీగా, 2009, 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించానని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ కుల గణన చేసి వందేళ్ల సమస్య పరిష్కరించామని సీఎం అన్నారు. మాదిగల ఉపకులాల వర్గీకరణ చేయడం, 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం ఒక చరిత్రాత్మకమని గుర్తు చేశారు. కేవలం సంక్షేమమే కాకుండా సామాజిక రుగ్మతలను పరిష్కరించామని రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ శిబిరంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఏపీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల, సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్చార్జ్ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌కు వినతి పత్రం అందజేస్తున్న మంత్రి పొంగులేటి

## ఈ యేడాది 3 లక్షల ఇళ్లు మంజూరు చేయండి

### గత పన్నెండేళ్లుగా గ్రామీణప్రాంతాల్లో ఒక్క ఇల్లు మంజూరు చేయలేదు..

### కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సమావేశమైన మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి21:** తెలంగాణ ప్రాంత ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా 2014-23 వరకు దాదాపు పది సంవత్సరాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పేదల ఇండ్ల నిర్మాణం జరగలేదు.దీంతో ఇండ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీ ఎత్తున డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన ఇండ్లను మంజూరు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేదల సంక్షేమాన్ని విస్మరించిన ఆనాటి ప్రభుత్వం పది సంవత్సరాలల్లో కేంద్రం నుండి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాలకు ఇండ్లు మంజురు చేయాలని గడిచిన రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాం. కానీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రావడం లేదు. కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా గ్రామీణ ప్రాంతాలకు 3 లక్షల ఇండ్లు మంజురు చేయాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గృహ నిర్మాణానికి సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. పది సంవత్సరాలలో సంవత్సరానికి కనీసం పదివేల ఇండ్లను కూడా నిర్మించలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. 2023 తరువాత మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం పిఎంఏవై-జి 2.0 లో రాష్ట్రం అధికారికంగా చేరింది.2024 ఆగస్టులో కేంద్ర మంత్రివర్గం పిఎంఏవై-జి 2.0కు ఆమోదం తెలిపి, ఆవాస్+2018 సర్వే నవీకరణ తర్వాత సాచురేషన్ పద్ధతిలో గృహాల మంజూరు చేయాలని నిర్ణయించినప్పటికీ, పాత డేటా ఆధారంగా 202425 మరియు 2025-26 సంవత్సరాలకు ఇతర రాష్ట్రాలకు 1.19 కోట్ల గృహాలను కేటాయించింది. తెలంగాణ రాష్ట్రం పిఎం జివై 1.0 లో భాగస్వామ్యం కాకపోవడంతో 2018 పెండింగ్ డాటా లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ విస్తృత సర్వే నిర్వహించి అర్హులైన లబ్ధిదారుల డేటాబేస్‌ను సిద్ధం చేసుకుంది. అయినప్పటికీ, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఆవాస్+2024 మొబైల్ యాప్ ద్వారా మరోసారి సర్వే నిర్వహించి మొత్తం 11.57 లక్షల అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించడం జరిగింది.తెలంగాణ రాష్ట్రంలో గత 12 ఏళ్లలో ఏర్పడిన పెండింగ్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలోని పరిస్థితులను అర్థం చేసుకొని ఈ ఆర్థిక సంవత్సరములో 3 లక్షలు, వచ్చే ఏడాది మరో 2 లక్షల ఇండ్లను మజూరు చేయాలని మంత్రి పొంగులేటి... కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేశారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో కేంద్రం సానుకూలంగా స్పందింస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## నేడు టిజి సెట్-2026 పరీక్ష

### రాష్ట్ర వ్యాప్తంగా 492 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

### 10 నిమిషాలు గ్రేస్ పీరియడ్‌తో అనుమతి: సెట్ చీఫ్ కన్వీనర్ కృష్ణ ఆదిత్య

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 21:** తెలంగాణ రాష్ట్రంలోని గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలతోపాటు 6 నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్లను భర్తీ చేయడానికి నిర్వహించే టిజి కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజి సెట్)-2026 నేడు(ఆదివారం) జరగనుంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 492 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు టిజి సెట్-2026 చీఫ్ కన్వీనర్, ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ఈ ఏడాది టిజి సెట్‌కి 1.812,061 దరఖాస్తులు వచ్చాయి. గతేడాది కంటే ఈ ఏడాది దరఖాస్తులు ఎక్కువ వచ్చాయి. టిజి సెట్-2026 ద్వారా టిజిఎస్‌ఆర్‌డబ్ల్యూఆర్, టిజిటిడబ్ల్యూఆర్, ఎంజెపిటిబిసిడబ్ల్యూఆర్, టిఆర్‌ఈఐ సొసైటీల్లో 5వ తరగతితోపాటు ఆయా సొసైటీల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ కృష్ణ ఆదిత్య శుభాకాంక్షలు తెలిపారు. నేడు ఉదయం 11 గంటల నుంచఇ మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నారు. పరీక్ష ప్రా రంభమైన 10 నిమిషాల తర్వాత వచ్చే వారిని అనుమతించబోమని చీఫ్ కన్వీనర్ తెలిపారు. టిజి సెట్-2026 ప్రవేశ పరీక్ష రాసే 1,82,061 మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సెట్ చీఫ్ కన్వీనర్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి ఎస్. కృష్ణ ఆదిత్య హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థులు గురుకుల విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం టిజి సెట్-2026 పరీక్ష రాయడం ఆనందదాయకం, గర్వకారణమని పేర్కొన్నారు. గురుకుల సంస్థలు అందిస్తున్న నాణ్యమైన, విలువల ఆధారిత విద్యపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను పరీక్షకు ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 492 పరీక్షా కేంద్రాల్లో సమగ్ర ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.విద్యార్థులు ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ప్రశాంతంగా పరీక్ష రాయాలని, తమ ప్రతిభను పూర్తి స్థాయిలో ప్రదర్శించాలని చీఫ్ కన్వీనర్ ఆకాంక్షించారు.

## కలెక్టరేట్‌లో రైతు మృతిపై నివేదిక పంపించండి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆదేశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** సిద్దిపేట కలెక్టరేట్‌లో రామకృష్ణయ్య (55) అనే రైతు మృతి ఘటనపై నివేదిక పంపించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆదేశించింది. న్యాయవాది, సామాజికవేత్త కారుపోతుల రేవంత్ గౌడ్ కలెక్టరేట్‌లో రైతు మృతి చెందిన ఘటనపై పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కెనాల్ నిర్మాణంలో భాగంగా రామకృష్ణయ్య (55) అనే రైతు తన రెండు ఎకరాలు భూమిని ప్రభుత్వం తీసుకుంది. దానికి సంబంధించిన రూ.29 లక్షల భూ పరిహారం కోసం గత సంవత్సరం సిద్దిపేట కలెక్టరేట్‌కు వెళ్లి అధికారులు సరిగా స్పందించకపోవడంతో కలెక్టరేట్‌లో అధికారుల కోసం రోజుల తరబడి తిరుగుతూ, వేచి చూస్తూ ఆగస్టు 21న కలెక్టర్‌లోనే గుండె పోటుతో ప్రాణాలు విడిచిన సంగతి పిటీషన్‌లో పేర్కొన్నారు. రైతు మృతి ఘటనపై పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని పిటీషన్ దాఖలు చేశారు. దీంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా భూపరిహారం కోసం రోజుల తరబడి ఎదురుచూస్తున్న మిగతా రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా పరిహారం త్వరితగతిన అందించాలని కోరారు. అలాగే ప్రభుత్వ కార్యాలయంలో బాధితులపై నిరక్ష్యంగా వ్యవహరించకుండా వారి వయసు రీత్యా వారికి తగిన గౌరవం ఇవ్వాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన జాతీయ మానవ హక్కుల కమిషన్ రైతు మృతి ఘటనపై తక్షణమే విచారణ చేపట్టిబాధ్యులపై తీసుకున్న చర్యలు, బాధిత కుటుంబానికి అందిన నష్టపరిహారం, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి నివేదికను నాలుగు వారాల్లోపు కమిషన్ కు సమర్పించాలని చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేసింది.



భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసిన హైడ్రా

### కొండాపూర్‌లో ఏడు ఎకరాలను

# కాపాడిన హైడ్రా

### రూ. 1,400 కోట్ల విలువైన భూమి చుట్టూ ఫెన్సింగ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** కొండాపూర్‌లో 7 ఎకరాల మేర ఉన్న పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను హైడ్రా శనివారం కాపాడింది. వీటి విలువ రూ. 1,400ల కోట్ల వరకూ ఉంటుందని అంచనా. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ విలేజ్‌లోని సర్వే నంబరు 78 నుంచి 93 లో రాజరాజేశ్వరి నగర్ కాలనీ పేరుతో 2059 ప్లాట్లతో 1993లో గ్రామపంచాయతీ లే ఔట్ వేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 5 ఎకరాలు కేటాయించారు. అలాగే పాఠశాలకు దాదాపు ఎకరా స్థలం,పార్కుల కోసం ఎకరాకు పైగా కేటాయించారు. పాఠశాలకు కేటాయించిన స్థలంలో 1,000 గజాల మేర అపార్టుమెంట్‌ను నిర్మించేశారు. కమ్యూనిటీహాల్ కోసం 2,181 గజాలను కేటాయించారు. ఇలా కేటాయించిన భూములు ఆక్రమణలకు గురౌతున్నాయని వెంటనే కాపాడి రాజరాజేశ్వరినగర్‌లో నివాసం ఉంటున్న 5 వేల కుటుంబాలకు ఉపయోగపడేలా చూడాలని హైడ్రా ప్రజావాణిలో కాలనీ సంక్షేమ సంఘం కోరింది. ఈ భూముల ఆక్రమణల వెనుక బడాబాబులున్నారని ఫిర్యాదు చేసింది. పలు షోరూంలతో పాటు.. కిరాణా జనరల్ స్టోర్‌లు వచ్చాయని.. రహదారులు కూడా ఆక్రమణలకు గురౌతున్నాయని ఫిర్యాదులో పేర్కొంది. యూఎల్సీ భూములలోని లేఔట్లో ప్లాట్లు ఎల్‌ఆర్‌ఎస్ అయ్యాయి. పార్కులు, ప్రజావసరాల స్థలాలు ఎల్‌ఆర్‌ఎస్ అవ్వకుండా ఆక్రమణదారుల సొంతం ఎలా అవుతాయని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. అవి పార్కులాగాను ప్రజావసరాల స్థలాలగానే ఉపయోగపడాలని కోరారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులతో హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. లే ఔట్ ప్రకారం పార్కుతో పాటు ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలుగా నిర్ధారించుకుంది. పార్కుస్థలంలో ఇప్పటికే వెయ్యి గజాల మేర అపార్టు మెంట్ రాగా.. కమ్యూనిటీ స్థలంలో పైవేటు షాపులు, షెడ్డులు వేసినట్టు గుర్తించింది. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు.. అక్కడి నివాసితులకే చెందాలనే ఉద్దేశంతో ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేసింది. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలుగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. దీంతో రాజరాజేశ్వరి నగర్ నివాసితులు హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్య హైడ్రాతో పరిష్కారం అయ్యిందని సంతోషం వ్యక్తం చేశారు.

# మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి

### మహిళా, శిశు సంక్షేమ మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి అని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రి ధనసరి అనసూయ అన్నారు. మహిళలను ఆర్థికంగా స్థితిమంతులుగా చేయడానికి ఇందిరా మహిళా శక్తి పథకాన్ని విజయవంతంగా అమలుపరుస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో శనివారం మహిళా సాధికారతలో తెలంగాణ సాధించిన ఆర్థిక ప్రగతిని ఆవిష్కరించిన తదుపరి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందన్నారు.

ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేసేందుకు ఎన్నో రంగాల్లో మహిళలను ప్రోత్స హిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోన 46.68 లక్షల మహిళలు 4.37 లక్షల స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదుగుతున్నారని చెప్పారు. మహిళల ఆర్థిక ప్రగతి ద్వారానే సమాజం ఆర్థికంగా పురోగమిస్తుంది అన్న అంబేద్కర్ ఆలోచన విధానాన్ని అనుసరిస్తున్నామని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సంఘాలకూ రూ.1,121 కోట్లు వడ్డీలను మాఫీ చేసినట్లు వెల్లడించారు. ఈ రెండేళ్లలో మహిళా సంఘాలకు రూ.35,435 కోట్ల బ్యాంకింగ్ రుణాల మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయక సభ్యులకు లోన్ బీమా ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయడం, ఆర్థిక వ్యాపారాల్లో ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సమ్మక్క సారలమ్మ జాతరలో ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళా సంఘాలకు రూ. 3.5 కోట్లు లాభాలు వచ్చాయని చెప్పారు. మహిళా స్వయం సహాయక బృందాలకు స్థిరమైన ఆదాయం కల్పించేందుకు ఆర్టీసీ అద్దె బస్సులు, పెట్రోల్ బంకులు సోలార్ ప్లాంట్లు మహిళా సంఘాల చే ఏర్పాటు చేయిస్తున్నామన తెలియచేశారు.

# భార్యను గదిలో బంధించి ప్రియురాలితో భర్త పరార్

### రామంతాపూర్‌లో కిడ్నాప్ డ్రామా.. ఒడిశాలో ప్రత్యక్షం

**హైదరాబాద్ (ఉప్పల్), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** భార్య, కుమార్తెను గదిలో బంధించి ఒక వ్యక్తి ప్రియురాలితో కలిసి పరారైన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన రావూరి పూర్ణచంద్రరావు (34) లక్ష్మీదుర్గ(30) భార్యభర్తలు. వీరికి 9 సంవత్సరాలు ఉన్న ఒక కుమార్తె ఉంది. అయితే రావూరి పూర్ణచందర్ రావు మాదాపూర్ సమీపంలోని రేస్ పబ్‌లో పర్చేజింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గత గురువారం రాత్రి సుమారు ఒంటి గంట సమయంలో ఫోన్ రావడంతో ఇంటి తలుపులు గడియ పెట్టి అప్పటికే బయట వేచి ఉన్న ముగ్గురు వ్యక్తులతో కలిసి పరారైనట్లు పోలీసులు తెలిపారు. కొద్ది సేపటి తర్వాత భార్య లక్ష్మి దుర్గ కేకలు వేయగా ఇంటి తలుపులు గడియ పెట్టి ఉండడంతో స్థానికులు గమనించి తీశారు. తన భర్తను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారని మరుసటి రోజు ఆమె పోలీసులకు పిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేయగా అప్పటికే ఇంటి వద్ద బైక్ పై ఒక వ్యక్తితో పాటు ఇద్దరు మహిళలు వేచి ఉన్నారని తెలిపారు. వీరితో కలిసి పూర్ణచందర్‌రావు జూబ్లీహిల్స్‌కు వెళ్లి అక్కడ ఒక రోజు ఉండి మరుసటి రోజు పబ్‌లో పనిచేసే ఒడిస్సా యువతితో కలిసి పరారైనట్లు తెలిపారు. అతని ఆచూకీ తీయగా ఒడిస్సాలో ఉన్నట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు. ఒడిస్సా యువతి పెళ్లి చేసుకోవాలని వత్తిడి తీసుకుని రావడంతో భార్య, పిల్లలను వదిలి వెళ్లిపోయాడని పోలీసులు తెలిపారు. అతని రెండు ఫోన్లు ఇంటి వద్దే ఉండడంతో కిడ్నాప్ చేసి ఉంటారని బందువులు మొదట అనుమానం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి సురేష్ నాయక్, భర్షా, సోనాలితో కలిసి పూర్ణచందర్‌రావు ఇంటి నుంచి వెళ్లినట్లు కెమెరాలలో రికార్డు అయినట్లు పోలీసులు తెలిపారు. జూబ్లీహిల్స్‌లో ఒక ఇంట్లో డ్రస్‌లు మార్చుకుని ఒడిస్సాకు వెళ్లిపోతున్నట్లు చెప్పారని ఎస్ఐ రాజకుమారి తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రావూరి పూర్ణచందర్‌రావు (ఫైల్)

# ప్రకృతి వ్యవసాయ దేశంగా భారత్

### సాగు విధానంలో విప్లవాత్మక మార్పులు రావాలి

### ఆ పంటలు ఎంతో ఆరోగ్యకరం: మాజీ ఎంపి, 'వార్త' సిఎండి గిరీష్‌సంఘీ

### హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న అగ్రిషో-2026ను సందర్శించిన పలువురు నేతలు

**హైదరాబాద్ (ముషీరాబాద్), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మన భారత దేశం మొత్తం ప్రకృతి వ్యవసాయ దేశంగా మారిపోవాలని మాజీ రాజ్యసభ సభ్యుడు, 'వార్త' సిఎండి గిరీష్‌సంఘీ ఆకాంక్షించారు. శనివారం ఎన్టీఆర్ స్టేడియంలో అగ్రిషో పేరుతో కొనసాగుతున్న వ్యవసాయ ఎగ్జిబిషన్‌ను గిరీష్‌సంఘీతోపాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, హర్యానా మాజీగవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిసహా పలువురు నేతలు సందర్శించారు.

అగ్రిషోలో ఏర్పాటుచేసిన 320 స్టాల్స్‌ను వారు ఎంతో ఆసక్తిగా పరిశీలించి, స్టాల్ నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో గిరీష్‌సంఘీ మాట్లాడుతూ రైతుబడి అనే యూట్యూబ్ ఛానల్ ద్వారా వ్యవసాయ విడియోలను ప్రసారంచేసే రాజేందర్‌రెడ్డి ఇంత పెద్దఎత్తున వ్యవసాయరంగ ప్రదర్శనను ఏర్పాటు చేయటం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఇటువంటి ప్రదర్శనలు నేటి రైతులకు, వ్యవసాయరంగ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని, భవిష్యత్తులో ఇటువంటి ప్రదర్శనలు ఇంకా పెద్దఎత్తున చేయాలని, దానికి అవసరమైన సహాయం చేసేందుకు తాను కూడా సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఇటీవల రాయపూర్ పర్య టించినప్పుడు అక్కడ వ్యవసాయ ప్రదర్శనలో ప్రకృతి ఆధారిత మొక్కలను లైవ్‌లో చూపించారని, అదేవిధంగా రాజేందర్‌రెడ్డి కూడా లైవ్ ప్రదర్శన చేసేందుకు కావాలంటే, సంఘీనగర్‌లోని తమ వ్యవసాయ క్షేత్రం అన్ని వసతులతో, ఎటువంటి అద్దె లేకుండా, ఉచితంగా ఇస్తానని స్పష్టం చేశారు. తమ తాతల నాటి నుంచి వేయి గోవుల ద్వారా లిక్విడ్ ఎరువు తయారుచేసి, గోఆధారిత వ్యవ సాయాన్ని చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలు ఆరోగ్య కరంగా ఉండటమే కాకుండా, ఎంతో రుచిగా ఉంటాయని, ఈ పంటల ద్వారా పండించే కాయల సైజు, రుచి, నాణ్యత ఎంతో బాగుంటుందని అన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం చేయవలసిన పనిని, రాజేందర్‌రెడ్డి చేస్తున్నాడని, వ్యవస్థలు ఎవరూ చేయలేని సాహసాన్ని రాజేందర్‌రెడ్డి తన రైతుబడి ద్వారా చేయటం ఎంతో అభినందనీయమని కొనియాడారు. సాగు రంగానికి, వ్యవసాయానికి ఎంతో ఉపయోగపడే ఇలాంటి ఎగ్జిబిషన్లు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రైతుకు కావల్సిన భద్రత గతంలో కేసీఆర్ అందించారని, కానీ నేడు రైతులకు భద్రత కరవయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రదర్శనలోనే కొందరు రైతులు తమ బాధలను తెలియచేశారని, రైతలుకు యూరియా అందటం లేదని, రైతుబంధు ఇవ్వటంలేదని, రైతులకు కరెంటు 12 గంటలే ఇస్తున్నారని వీటన్నిటిపైనా రాబోయే అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడి, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ అన్నదాతలకు ఆధునిక సాగు పద్ధ తులపై అవగాహన కల్పించటం, వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వచ్చిన సాంకేతిక యంత్రాలను వారి దరికి చేర్చటం అత్యంత అవసరమైన అంశమని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, ఆధునిక యంత్రాలతో సాగు చేస్తే వ్యవసాయం మరింత లాభసాటిగా మారు తుందని, ఇటువంటి ప్రదర్శనలు అన్నదాతలకు దిశానిర్దేశం చేసి, వ్యవ సాయ రంగాన్ని మరింత సుస్థిరంగా, లాభదాయకంగా తీర్చిదిద్దటంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



శనివారం హైదరాబాద్‌లోని అగ్రిషో -2026లో మాజీ రాజ్యసభ సభ్యుడు, 'వార్త' సిఎండి గిరీష్‌సంఘీకి మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి జ్ఞాపికను బహూకరిస్తున్న దృశ్యం.

# ట్రేడ్ డీల్స్‌తో భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్

### రాయదుర్గం ఎఫ్‌డిడిఐ స్నాతకోత్సవంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో అభి వృద్ధి చెందిన దేశాలతో చేసుకుంటున్న వాణి జ్య ఒప్పందాలతో భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్త మార్కెట్ లభిస్తుందని, భారతీయ ఉత్ప త్తులను పోటీతత్వంతో తయారు చేస్తున్నా యని కేంద్ర గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. రాయదుర్గంలోని లిడ్‌క్యాప్ నైలెక్స్ క్యాంపస్‌లో జరిగిన ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇనిస్టి ట్యూట్(ఎఫ్‌డిడిఐ) 5వ స్నాతకోత్సవాలకు కిషన్‌రెడ్డి శనివారం ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఫుట్‌వేర్ రంగంలో సాంకేతికత మెరుగుదల కోసం ప్రభుత్వం 1700కోట్ల రూపాయల నిధులు కేటాయించిందని, మేక్ ఇన్ ఇండియా కింద దేశీయ తయారీని మరింత బలోపేతం చేసేందుకు పిఎల్ఐ పథకాన్ని పరిశీలిస్తుందన్నారు. ఉత్తమ నైపూణ్యం, ఆవిష్క రణలు, ప్రపంచ వ్యాప్త వన్ పోటీతత్వంతో భారతీయ ఫుట్‌వేర్, తోలు, ఫ్యాషన్, రీటైల్ పర్యా వరణ వ్యవస్థను బలోపేతం చేసే జాతీయ ఆస్తి ఎఫ్‌డిడిఐ అని అన్నారు. నేడు ప్రపంచం లో భారతీయ ఫుట్‌వేర్ మార్కెట్ 26నుంచి 30 బిలియన్లతో రెండో అతి పెద్ద మార్కెట్‌ను కలిగి ఉందన్నారు. ఈ రంగం లో దాదాపు 4.5 మిలి యన్ల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నా యని తెలిపారు. భారతీ య ఫుట్‌వేర్ రంగం మన ఎంఎస్ఎంఈ, చేతి వృత్తుల బలాన్ని ప్రతి బింబిస్తుందని పేర్కొన్నారు. సామర్థ్యాన్ని పెంచుతూ ఆవిష్కరణలకు ప్రోత్సా హం అందించే విధంగా సింగిల్ విండో ఫ్లాట్‌ఫాం అయిన ఎఫ్‌డిడిఐ సర్వీసు కాంపెండియంను ఆవిష్కరించినందుకు ఎఫ్‌డిడిఐని అభినం దించారు. నేడు దేశం అన్ని రంగాల్లో అభివ ృద్ధి పథంలో దూసుకు వెళ్తుందని తెలిపారు. తాజాగా జరిగిన ఏఐ గ్లోబల్ సమ్మిట్‌లో 20కంటే ఎక్కువ దేశాధినేతలు, 100కంటే ఎక్కువ దేశాల ప్రతినిధులు పాల్గొ న్నారని, భారత్‌ను విశ్వసనీయ, బాధ్యతా యుతమైన సాంకేతిక నాయకుడిగా ప్రపంచం గుర్తిస్తుందన్నారు. భారతదేశం ఇకపై సాంకేతికతను స్వీకరించడమే కాకుండా దాని భవిష్యత్తును మారుస్తుందని తెలిపారు. సాంకేతికతను, ఏఐని యువత బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో లిడ్‌క్యాప్ ప్రతినిధులతో పాటు లెథర్ ఇండస్ట్రీ అధికారులు, ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# నాంపల్లి అగ్నిప్రమాదంలో 1,100 ఫైళ్లు దగ్ధం!

### వాటి డేటా రికవరీ అసాధ్యమని తేల్చిన నిపుణులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన నాంపల్లిలోని ఫోరెన్సిక్ లాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదం కీలక మలుపు తిరి గింది. ఈ ప్రమాదంలో 1,100 ఫైళ్ల కాలిపోయినట్లు నాగ్‌పూర్‌లోని సెంట్రల్ ఫోరెన్సిక్ లాబ్ (సిఎఫ్ఎస్ఎల్) బృందం గుర్తించింది. ఈ ఫైల్స్ లోని డేటా రికవరీ చేయడం కష్టమని నిపుణులు నిర్ధారించినట్లు తెలిసింది. దీంతో ఈ కేసుల విచారణ ఇబ్బందికరంగా మారే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే దీనిపై పోలీసు శాఖ ఇంకా అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. రాష్ట్ర ఎఫ్ఎస్ఎల్‌లో ఈ నెల 7న సంభవించిన అగ్నిప్రమాదం రాజకీయంగా దుమారం రేపడం తెలిసిందే. ఓటుకు నోటు కేసుతోపాటు ఫోన్ ట్యాపింగ్ ఫైల్స్ ఈ ప్రమాదంలో కాలిపోయా యని ప్రచారం జరగడం విదితమే. ఆఖరుకు ఇదంతా అవాస్తమని, ఈ రెండు కేసులకు సంబంధించిన అన్ని ఆధారాలు భద్రంగా ఉన్నాయని, ఎఫ్ఎస్ఎల్‌లో మంటల కారణంగా కాలిపోయిన ఫైల్స్‌లోని సమాచారాన్ని తిరిగి పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు డిజిపి శివధర్‌రెడ్డి, ఎఫ్ఎ స్ఎల్ డైరెక్టర్ శిఖాగోయల్ మీడియాకు వెల్లడించాక వివాదం కొంత సద్దుమణిగింది. రెండంతస్తుల్లోని ఎఫ్ఎస్ఎల్ భవనం దశాబ్దాల కాలంనాటిది. సరైన పర్యవేక్షణ కరువవడం, ఫైర్ సేఫ్టీ ఉపకరణాలు లేకపోవడం వంటి కార ణాల వల్ల అగ్నిప్రమాదం సంభవించిందని పోలీసుల ప్రాథమిక విచా రణలో తేలింది. అయితే థర్డ్‌పార్టీ విచారణలో భాగంగా నాగ్‌పూర్‌లోని సిఎఫ్ఎస్ఎల్‌తోపాటు పుణేలోని ఫైర్‌సేఫ్టీ అకాడమి నిపుణులు సొంతంగా వి చారణ చేబట్టారు. ఈ రెండు విభాగాల అధికారులు ప్రమాదం జరిగిన మూడు రోజుల తరువాత ఎఫ్ఎస్ఎల్ మొదటి అంతస్తును పరిశీలించి కాలిపోయిన రికార్డులను వారు పరిశీలించారు. సిఎఫ్ఎస్ఎల్ నిపుణులు భిన్న కోణాల్లో విచారణ చేశాక ఎఫ్ఎస్‌లోని మొదటి అంతస్తులో 1,100 ఫైల్స్ కాలిపోయినట్లు నిర్ధారణకు వచ్చారు. డేటా రికవరీ చేయడం కష్టమని వారు నిర్ధారణకు వచ్చారని తెలిసింది.

**కేసుల విచారణపై ప్రభావం**

ఇదిలా ఉండగా ఎఫ్ఎస్ఎల్‌లో కాలిపోయిన ఫైల్స్‌లో 1100కు సంబం ధించిన డేటా రికవరీ కష్టమని తేలడంతో వీటికి సంబంధించిన కేసుల విచారణ ఇబ్బందికరంగా మారే అవకాశముంద ని తెలిసింది. హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, కాల్పులు, ఫోర్జరీ వంటి కేసుల్లో రక్తం, వెం డ్రుకలు, వేలిముద్రలు, ఆయుధాలు, బుల్లెట్లు, డాక్యుమెంట్లకు సంబంధించి నిజనిర్ధారణ ఎఫ్ఎస్ఎల్‌లోని సైంటిస్టులు నిర్ధారిస్తారు. దీంతో పాటు మాదకద్రవ్యాలు, విషప్రయోగం వంటి కేసుల్లోనూ ఎఫ్ఎస ఎల్ సైంటిస్టుల నిర్ధారణ కారణంగానే దోషులకు శిక్షలు పడతాయి. ఆయా కేసులకు సంబంధించి అనేక వస్తువులను పరీక్షల నిమిత్తం ఎఫ్ఎస్ఎల్‌కు పంపుతారు.

# యువజన కాంగ్రెస్ నిరసనకారులకు బెయిల్ నిరాకరణ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:** ఢిల్లీలోని భారత్ మండపంలో కృత్రిమ మేధపై సదస్సు జరుగుతున్న సదస్సులో నిరసన తెలిపిన యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు పాలియాలా హౌస్ కోర్టు బెయిల్ నిరాకరించింది. వారికి 14 రోజులు రిమాండ్‌ప్రకటించింది. అర్థనగ్న ప్రదర్శనలుచేసిన యూత్ కాంగ్రెస్ నేతలు కార్యకర్తలను భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. క్యూఆర్ కోడెడ్ పాసులను ఉపయోగించి ఏఐ సదస్సు ప్రాంగణంలోకి ప్రవేశించిన సుమారు 10 మంది యువజన కాంగ్రెస్ కార్యకర్తలు హాల్ నంబర్ 5 లోకి వచ్చిన తర్వాత ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. శనివారం పాటియాలా హౌజ్ కోర్టులో ఈ ఘటనపై వాదనలు జరిగాయి. నలుగురు నిందితుల బెయిల్‌ను కోర్టు తిరస్కరించింది. అరెస్టు అయిన వారిలో యూత్ కాంగ్రెస్ సభ్యులు కృష్ణ హరి, కుందర్ యాదవ్, అజయ్ ఉన్నారు. నలుగురిని అయిదు రోజుల పోలీసు కస్టడీలోకి పంపారు. ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ ఓ కుట్ర ప్రకారం నిరసన చేపట్టినట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. దేశ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ యువతను వాడుకుంటున్నట్లు పేర్కొన్నారు.ఇంత కన్నా సిగ్గుమాలిన చర్య ఏమైనా ఉంటుందా అని ప్రశ్నించారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టడం ఎప్పుడు ఆపేస్తారని మంత్రి రిజిజు ప్రశ్నించారు. ఏఐ సమ్మిట్‌లో జరిగిన ఘటనను యావత్ దేశం ఖండిస్తున్నదన్నారు. యువతను రెచ్చగొట్టి కాంగ్రెస్ పార్టీ నేరానికి పాల్పడినట్లు ఆరోపించారు.

# భక్తుల ఇంటికే భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాలు

### రూ.151 చెల్లిస్తే తలంబ్రాలు పొందే సదవకాశం

### 23 నుంచి బుకింగ్స్ ప్రారంభం

### పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** 'శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో జరగబోయే శ్రీ సీతారామచంద్రుల కల్యాణోత్సవ తలం బ్రాలను భక్తులకు అందజేయాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) యాజమాన్యం నిర్ణయించింది. శ్రీరామనవమి సందర్భంగా మార్చి 27న జరిగే వేడుకలను దృష్టిలో ఉంచుకుని, వివిధ కారణాల వల్ల భద్రాచలంకు వెళ్లలేని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల భక్తుల కోసం టీజీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. గత ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా తెలంగాణ దేవాదాయ శాఖ సహకారంతో రాములవారి కల్యాణ తలంబ్రాలను భక్తుల ఇళ్ల వద్దకు చేరవేసే పవిత్ర కార్యానికి శ్రీకారం చుట్టింది. ఎంతో విశిష్టత కలిగిన ఈ తలంబ్రాల ప్యాకెట్లు పొందాలనుకునే భక్తులు టీజీఎస్‌ఆర్‌టీసీ అధికారిక వెబ్ సైట్లో లాగిన్ అయి ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చు.

ఇందుకోసం ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాల్లో రూ.151 చెల్లించి.. వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. శ్రీ సీతారామచంద్రుల కల్యాణోత్సవం అనంతరం ఈ తలంబ్రాలను భక్తులకు టీఎస్‌ఆర్టీసీ హోం డెలివరీ చేస్తుంది. హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో శనివారం భద్రాద్రి శ్రీసీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్ పోస్టర్‌ను ఆర్‌టీసీ ఎండీ వై.నాగిరెడ్డి ఆవిష్కరించారు. నియమ నిష్టలతో ధాన్యాన్ని గోటితో ఒలిచి తీసిన కోటి బియ్యం గింజలను తలంబ్రాలుగా రాములోరి కల్యాణంలో ఉపయోగిస్తున్నారని, విశిష్టమైన ఈ తలంబ్రాలను భక్తుల ఇంటికి చేర్చాలని మూడేళ్ళ క్రితమే టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయిం చిందని నాగిరెడ్డి గుర్తు చేశారు.

ఈ ప్రయత్నానికి భక్తుల నుంచి మంచి స్పందన వచ్చిందని, సంస్థపై ఉన్న విశ్వాసంతో భక్తులు భారీ సంఖ్యలో తలంబ్రాలను బుక్ చేసుకుంటున్నారు. 2022లో దాదాపు 89 వేల మంది భక్తులకు తలంబ్రాలను బుక్ చేసుకోగా.. గత మూడేళ్ళలో లక్షలాది మంది భక్తులకు తలంబ్రాలను సంస్థ అందజేసిందని నాగిరెడ్డి తెలిపారు. భద్రాద్రిలో మార్చి 27న అంగరంగ వైభవంగా జరిగే శ్రీరామ నవమి వేడుకలకు వెళ్లలేని భక్తులు ఈ సేవల్ని వినియోగించు కోవాలని సూచించారు.

రాష్ట్రంలోని అన్ని టీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్లలో తలంబ్రాలను బుక్ చేసుకోవచ్చని చెప్పారు. సంస్థ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు కూడా భక్తుల వద్ద నేరుగా ఆర్డర్లను స్వీకరిస్తారని నాగిరెడ్డి తెలిపారు. తలంబ్రాల సేవను పొందాలనుకునే భక్తులు ఆర్టీసీ కాల్ సెంటర్ ఫోన్ నంబర్లు 040-23450033, 040-69440069లలో సం ప్రదించాలని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టీజీఎస్‌ఆర్టీసీ సీటీఎం (మార్కెటింగ్ అండ్ కమర్షియల్) శ్రీధర్, లాజిస్టిక్ ఎటిఎం రాజన్, భాను పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం

ఫారం-6

జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)

నాగర్‌కర్నూల్ జిల్లా

**ప్రాథమిక ప్రకటన**

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ప్రకారము

No. G2/180/2026 తేది: 09.02.2026

Gaz. No. 42/2026

నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.3.30 గుంటలు భూమి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం క్రింద ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరీ కెనాల్-55 (Minor-MR-3) నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కావున ఎ.3.30 గుం॥ భూమి డిస్ట్రిబ్యూటరీ కెనాల్-55 (Minor-MR-3) నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకుగాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము : సిర్సవాడ | మండలం : తాడూరు | జిల్లా : నాగర్‌కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./ ఎస్. డి. నెం. | పట్టా/ ఇనాం etc. | భూవర్గీకరణ మెట్ట/ తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.గుంటలు | పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏదైనా హక్కులు ఉంటే | హద్దులు తూ | ద | ప | ఉ | చెట్లు | | నిర్మాణం | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 70 | పట్టా | మెట్ట | 0.24½ | [illegible] | VB | 69 | 71 | 50 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 69 | పట్టా | మెట్ట | 0.12 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 68 | పట్టా | మెట్ట | 0.21 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 76 | పట్టా | మెట్ట | 0.12 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | లేవు | లేవు | లేవు | లేవు |
| 5 | 75 | పట్టా | మెట్ట | 0.10 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | లేవు | లేవు | లేవు | లేవు |
| 6 | 78 | పట్టా | మెట్ట | 0.21 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | లేవు | లేవు | లేవు | లేవు |
| 7 | 79 | పట్టా | మెట్ట | 0.20 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | లేవు | లేవు | లేవు | లేవు |
| 8 | 80 | పట్టా | మెట్ట | 0.28 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | లేవు | లేవు | లేవు | లేవు |
| | | | మొత్తం | 3.30 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టరు, నాగర్‌కర్నూల్ గారు, ప్రత్యేక ఉపకలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్, మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ G.O.Ms.No.51, తేది: 25.07.2017 ద్వారా భూసేకరణ, నష్టపరిహారము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము, 2013లోని అధ్యాయము-II మరియు అధ్యాయము-III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

సం/-. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్-I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ | సం/- అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూల్ | సం/-. జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO.NO:1206/LA/PP/Advt/Pub/2025-26

ముప్పై రెండుకాలమ్స్‌తో ఉన్న పహాణీని రద్దు చేశారు. భూ యజమాని పేరుతో ఒకే ఒక కాలమ్ ఏర్పాటుచేశారు. ఈక్రమంలో సాగు చేస్తూ ఉండి యజమానులై ఉన్నప్పటికీ పట్టాలు రానివారి గుర్తింపునకుఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ ఇబ్బందులను తొలగిస్తూ భూభారతిలో 11 కాలమ్స్‌తో పహాణీ పునరుద్ధరించారు. భూ యజమాని, తండ్రి పేరు, యాజమాన్యం రకం (పట్టా/ప్రభుత్వ భూమి/దేవాదాయ/వక్ఫ్ తదితర), భూమి రకం (మాగాణి/తరి), సంక్రమించిన విధానం (వారసత్వం/కొనుగోలు), కాస్తు కాలమ్ (సాగుదారుడు, పట్టాదారుడు) లాంటి వివరాలు తెలిసేలా ఏర్పాటు చేస్తారు. ధరణిలో భూమి ఖాతా, సర్వే సంఖ్యతోపాటు పాసుపుస్తకంపై బార్ కోడ్ ఏర్పాటు చేశారు. ఫోన్ నంబరుకు వచ్చే సంక్షిప్త సందేశం,ఆధార్ నంబరు ఆధారంగా లావాదేవీలు నిర్వహించేవారు. వీటితోపాటు భూభారతి చట్టంలో ప్రత్యేకంగా ప్రతి ఖాతాకు తాత్కాలిక, శాశ్వత పద్ధతుల్లో భూధార్ సంఖ్య కేటాయిస్తారు. అక్షాంశాలు, రేఖాంశాలతో సర్వే పూర్తయిన అనంతరం శాశ్వత భూధార్ కేటాయిస్తారు. భూమి ఖాతా, సర్వే సంఖ్య, బార్ కోడ్ కొనసాగిస్తారు. ఆధార్ నంబరు, ఫోన్ నంబరుకు వచ్చే సంక్షిప్త సందేశం ఆధారంగా తాత్కాలిక భూదార్ కేటాయిస్తారు. ఆర్వోఆర్ చట్టం 2020 ద్వారా ఈ చట్టంలో ఎలాంటి అవకాశం లేదు. ప్రతి భూమికి సంబంధించిన సర్వేతో పాటు హద్దులతో భూమి పటానికి సంబంధించి ఒక పటానికి సైతం తయారు చేసుకోవడానికి అవకాశం లేదు. భూభారతి చట్టంలో భూమి లావాదేవీ సందర్భంగా భూ దస్త్రాలతో పాటు భూమి సర్వే, సబ్‌డివిజన్ పటం జోడించడం తప్పనిసరి కావడంతో ఇది రైతులకు చాలా మేలు చేయనున్నది. దీంతో భూముల సర్వే కూడా ఈ విధానంలో పూర్తవుతుంది. రెండేసి, తప్పుడు రిజిస్ట్రేషన్లకు చెల్లుచీటీ పడుతుంది.

# ధరణి లోపాలను సవరిస్తూ భూభారతి

**నెలవెట్ల సతీష్ కుమార్ రెడ్డి**

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ధరణి కొత్త చట్టం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. చట్టంలో రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన లావాదేవీలు క్షణాల్లో జరిగేవి. అయితే ధరణి చట్టంలో కొన్ని లోపాలు కూడా ఉండడంతో రైతులకు ఇబ్బందులు తప్పలేదు. గత బీఆర్ఎస్ 2020లో తీసుకొచ్చిన ధరణి వల్ల మేలు ఎంత జరిగిందో కొంత కీడు కూడా జరిగింది అన్నది వాస్తవం. ధరణితో కొందరి రైతులు నానా బాధలు, అవస్థలు పడ్డమాట వాస్తవం. ధరణి వల్ల ఏర్పడిన సమస్యలకు పరిష్కారం చూపిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్ఓఆర్ 2024(భూ భారతి)పేరుతో ఒక నూతన చట్టం తీసుకొని వచ్చింది. భూ భారతి పోర్టల్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల వ్యవసాయ భూముల నిర్వహణకు కోసం భూవివాదాలు లేని తెలంగాణ లక్ష్యంగా, ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం, హైదరాబాదులోని శిల్పకళా వేదికలో 14 ఏప్రిల్ 2025న డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా తెలంగాణ భూపరిపాలనలోని ధరణి స్థానంలో కొత్త ఆర్.ఓ .ఆర్ చట్టం భూ భారతి పోర్టల్ 2025ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఎలా సాయం పొందాలో తెలియని సామాన్య రైతులకు కూడా ఉచిత న్యాయసహాయాన్ని ప్రభుత్వమే అందించేలా ఈ కొత్త ఆర్వోఆర్2024 చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొని వచ్చింది. ఈ చట్టంలో ఎసైన్డ్ భూములకు పాసుపుస్తకాలు, ఇనాం భూములకు హక్కులు, పార్ట్‌బీలో చేర్చిన భూముల సమస్యల పరిష్కారానికి దారిచూపింది. ఈ ఆర్వోఆర్2020 (ధరణి), ఆర్వోఆర్2024(భూ భారతి) చట్టాల మధ్య ఉన్న సారూప్యతలు, వ్యత్యాసాలు, కొత్తగా పొందుపర్చిన సెక్షన్లు, రద్దయిన వాటి గురించి తెలుసుకుందాం. పట్టా భూముల సమస్యలకు పరిష్కారం చూపిస్తూ, పార్ట్‌బీ భూముల వివాదాలకు స్వస్తి పలికింది. ఇందులో ముఖ్యంగా వారసత్వ బదిలీ సమస్యలకు పరిష్కారం దొరకడంతో పాటు ఎసైన్డ్ భూములకు పట్టాలు జారీ చేసే అవకాశం ఏర్పడింది. సాదా బైనామా దరఖాస్తులకు పరిష్కారంతో పాటు, శాశ్వత ల్యాండ్ ట్రిబ్యునళ్లతో పాటు భూ ఖాతాలకు రక్షణ ప్రతి భూమికి సర్వే, భూమి పటం సేవలు అందుబాటులోకి రానున్నాయి. వీటితోపాటు కొత్త పాసుపుస్తకాలు జారీకి కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. 2017 సెప్టెంబరు ముందు వరకు పట్టా ఉండి.. భూదస్త్రాల ప్రక్షాళన, ఆ తర్వాత వచ్చిన ఆర్వోఆర్ చట్టం 2020 కొత్త పాసుపుస్తకం రాని.. కనీసం ధరణిలో పేరు, భూమి వివరాలు కూడా లేని రైతులకు ఈ కొత్త చట్టంతో జిల్లా స్థాయిలోనే పాసుపుస్తకం అందే అవకాశం




ఏర్పడింది. అధికారులు చేసిన తప్పుల కారణంగా ఇప్పటి వరకు పాసు పుస్తకాలు రాని రైతులకు కూడా ఈ కొత్త చట్టంతో జిల్లాస్థాయిలోనే ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది. ఆర్వోఆర్ - 2020ధరణితో ఈ చట్టం ద్వారా ధరణి పోర్టల్ అమలులోకి తీసుకొని వచ్చారు. దీనివల్ల ఏక కాలంలో రిజిస్ట్రేషన్‌మ్యుటేషన్, వారసత్వ బదిలీ, బహుమతి,మార్టిగేజ్, నాలా, భాగ పంపిణీ సేవలు అందించేవారు.కానీ, అభ్యంతరాలకు అవకాశం కల్పించలేదు.ధరణి పోర్టల్ పేరును భూభారతిగా మార్చారు. వారసత్వ బదిలీ మినహా అన్ని లావాదేవీల్లో ఏకకాల రిజిస్ట్రేషన్‌మ్యుటేషన్ సేవలు యథాతథంగా ఉంటాయి. మ్యుటేషన్‌పై అభ్యంతరాలుంటే ఆప్పీళ్ళు చేసుకునే అవకాశం ఈ కొత్త చట్టంలో ఉంది. ధరణిలో ఉన్న భూములకు సంబంధించి మాత్రమే లావాదేవీలు జరిపేందుకు అర్హత ఉండేది. ఆభూములకు మాత్రమే పాసుపుస్తకాలుజారీ చేసేవారు. 2017-18లో చేపట్టిన దస్త్రాల ప్రక్షాళనతో స్పష్టత వచ్చిన భూముల సమాచారాన్ని మాత్రమే పాత ధరణిలోకి నిక్షిప్తం చేశారు. సమస్యలకు పరిష్కారం కోసం ఎలాంటి వ్యవస్థ ఏర్పాటు చేయలేదు. భూ భారతి పోర్టల్లో సమాచారం ఉన్న భూముల లావాదేవీలకు అనుమతి ఇస్తారు. సాగులో ఉండీ హక్కులురాని దాదాపు 8 లక్షల ఎకరాలకు చెందిన రైతులకు హక్కులు కల్పిస్తారు. ఆర్వోఆర్1971 కింద పాసుపుస్తకాలు ఉన్నవారికి కొత్త చట్టంలో హక్కులు జారీచేస్తారు. సర్వే నంబర్ల లో తప్పులు, ఖాతాల్లో తేడాలు,రికార్డులకు భిన్నంగా సాగు వేరేచోట ఉండటం తదితర సమస్యలు ఉన్నప్పటికీ వాస్తవ సాగుదారుల పేరిట హక్కులు కల్పించనున్నారు. భూ దస్త్రాల ప్రక్షాళన సందర్భంగా హక్కుల్లో వివాదాలు ఉన్న భూములను పార్ట్‌బీ కింద పక్కన పెట్టారు. కాలక్రమంలో విచారణ జరిపి పరిష్కారం కల్పించాలని నిర్దేశించినప్పటికీ చట్టంలో ఆ మేరకు అధికారాలు కల్పించకపోవడంతో సమస్యలు పరిష్కారానికి ఎలాంటి అవకాశంలేదు. తెలంగాణలో పార్ట్‌బీ కింద 18లక్షల ఎకరాల భూములు ఉన్నట్లు అధికారిక లెక్కల ద్వారా తెలుస్తున్నది. చిన్న చిన్న వివాదాలు, హద్దుల సమస్యలు, మ్యుటేషన్‌పై ఫిర్యాదులు, సర్వేలోపాలు లాంటి వాటిపై క్షేత్రస్థాయిలో అధికారులు విచారణ జరుపుతారు.దీని కోసం 3రకాల పరిష్కార మార్గాలను కల్పించారు. సులభతరంగా ఉన్న సమస్యలను తహసీల్దారు స్థాయిలో, మధ్యస్తంగా ఉన్నవి ఆర్డీవో, తీవ్రస్థాయివి కలెక్టర్ స్థాయిలో పరిష్కరించేలా సెక్షన్లు ఏర్పాటు చేశారు. 23 రకాల భూ యాజమాన్యాలకు సంబంధించి పరిష్కారాలు చూపుతారు. అభ్యంతరాలు తలెత్తితే అప్పీలు చేసుకునే అవకాశం ఉంది. వారసత్వ బదిలీకి కుటుంబ సభ్యుల ఉమ్మడి అంగీకార పత్రం,సభ్యుల హాజరు తప్పనిసరి చేసినా అధికారులకు నోటీసుల జారీచేసే అధికారం కల్పించలేదు. దీంతోస్లాటు నమోదు చేసుకుంటేచాలు వారసత్వ బదిలీ సులభంగా పూర్తయ్యేది. ఈ క్రమంలో ఇతర కుటుంబ సభ్యుల నుంచి అభ్యంతరాలు, ఫిర్యాదులు ఎక్కువగా వచ్చేవి. దీంతో ఈచట్టంలో వారసత్వ బదిలీ విషయంలో కుటుంబ సభ్యులకు తహసీల్దారు నోటీసుజారీ చేసి, విచారణ జరిపి మ్యుటేషన్ ఉత్తర్వు జారీ చేస్తారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే అప్పీలు చేసుకోవచ్చు. ధరణిలో క్షేత్ర స్థాయి విచారణ లేకపోవడంతో ఎసైన్డ్, లావణి భూములకు స్పష్టత ఉన్నదని భావించిన చోట మాత్రమే పాసుపుస్తకాలు జారీ చేసేవారు. ఇంత వేలాది మంది రైతులకు అసైన్డ్ భూములకు సంబంధించి అప్పీలు చేసుకోవడానికి ఇబ్బందులు తప్పలేదు కొత్త చట్టంలో లావణి ఎసైన్డ్ తదితర భూములు 24 లక్షల ఎకరాలు ఉన్నట్లు ప్రభుత్వ అంచనా. వీటికి గతంలో పాసుపుస్తకాలు జారీ కాలేదని గుర్తించారు. తాజాచట్టంలో రైతులు దరఖాస్తు చేసుకోకున్నా, పట్టా పాసుపుస్తకాలు జారీ చేసేవారు.వివాదాలు ఉంటే విచారణ జరిపి పాసుపుస్తకం ఇస్తారు. ధరణిలో యజమాని పేరునమాత్రమే రికార్డు కొనసాగుతుంది. సాదాబైనామాల క్రమబద్ధీకరణకు చట్టంలో ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పలేదు. భూభారతి చట్టంలోఒక భూమిని ఇద్దరు అన్నదమ్ములు సాగు చేస్తున్నారను కుంటే భూమి ఒకరి పేరుపై ఉన్నప్పటికీ ఇద్దరూ సాగులో ఉండటాన్ని నిర్ధారించే విధానం పాత చట్టంలో లేదు. ఇలాంటి సందర్భాల్లో న్యాయపరమైన సమస్యలు ఏర్పడుతుండటాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త చట్టంలో కాస్తు కాలమ్ ఏర్పాటు చేశారు. సాదాబైనామాలతో కొనుగోలు చేసిన 9.35 లక్షల ఎకరాల భూములను ప్రస్తుతం సాగులో ఉన్న అర్హులైన రైతుల పేరుతో క్రమబద్ధీకరించేందుకు మార్గం సుగమం అవుతుంది. ఆర్వోఆర్ - 2020ధరణిలో తప్పులు చేసినా, రికార్డులు దిద్దినట్లు తేలినా తహసీల్దారుపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారు.పాసుపుస్తకాల రద్దుఅధికారం జిల్లా కలెక్టర్‌కు అప్పగించారు.అప్పీలుకు అవకాశంలేదు. కొత్త ఆర్వో ఆర్ -2024 భూ భారతిలో క్రిమినల్, శాఖాపరమైన చర్యలు పాతచట్టంలోలానే యథాతథంగా కొనసాగుతాయి. పాసుపుస్తకాల రద్దుఅధికారం ఆర్డీవోకు అప్పగించారు.చర్యలపై అప్పీళ్లకు కూడా అవకాశం కల్పించారు. ఆర్వోఆర్-2020 ధరణితోతహసీల్దారు, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ స్థాయుల్లో ఉన్న రెవెన్యూ కోర్టులను రద్దుచేశారు.ఈకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి కలెక్టర్ల ఆధ్వర్యంలో తాత్కాలిక ల్యాండ్ ట్రిబ్యునళ్లు ఏర్పాటుచేశారు. వాటి బాధ్యతలు పూర్తి కాగానే ట్రిబ్యునళ్ల కాలపరిమితి ముగిసింది. దీంతో భూమి వివాదాలకు సంబంధించి అప్పీలు చేసుకోవడానికి ఇబ్బందులు తప్పలేదు. ●

# నట్టింట 'ఉచిత' పంట!

తమిళనాడు

**ఎ.వి.వి ప్రసాద్**

ఎన్నికలు సమీపిస్తుండటంతో తమిళనాట ధన వర్షం కురుస్తోంది. ఓటర్ల నట్టింట 'ఉచిత' పంట పండుతోంది. అధికారంలో ఉన్న పార్టీ కావచ్చు, రావాలను కొంటున్న పార్టీలు కావొచ్చు.. ఈ ఉచిత పంటను యధాశక్తి పండిస్తున్నాయి. మహిళల అక్కౌంట్లలోకి వేలకు వేలు జమ చేస్తున్నాయి. ఇందుకోసం పార్టీ సిద్ధాంతాలకు కూడా తిలోదకాలిస్తున్నాయి. అధికార డిఎంకె పార్టీకి మొదటి నుంచి కొన్ని స్పష్టమైన సిద్ధాంతాలున్నాయి. అలాగే విపక్ష అన్నాడిఎంకెకు కూడా. ఈ రెండు ప్రధాన పార్టీలు పూర్తిగా ద్రవిడ సిద్ధాంతాల నుంచి ఆవిర్భవించినవే. డిఎంకె పార్టీ అన్నాదురై కాలం నుంచి, తర్వాత కరుణానిధి హయాంలో కొన్ని దశాబ్దాల పాటు కేవలం సిద్ధాంత ప్రాతిపదికపైనే ప్రజల ఆదరణ పొందుతూ వచ్చింది. డిఎంకె ఏ ద్రావిడ ఉద్యమం జరిపినా, ఏ భాషోద్యమం జరిపినా దాని వెనుక సిద్ధాంత బలం, ప్రజాబలం ఉండేవి. తరం మారేసరికి అక్కడా ' నీరు పల్లమెరుగు' విధానమే కనిపిస్తోంది. మొదటి సారి ముఖ్యమంత్రి అయిన స్టాలిన్‌కు మరోసారి ఆ సింహాసనం అధిష్ఠించాలనే కోరిక ఉండడంలో తప్పు లేదు కానీ ఆయన 'ఉచిత' విధానమే అనుచితంగా ఉన్నదని సుప్రీంకోర్టు కూడా మొట్టికాయలు వేసింది. ఓటు బ్యాంకు రాజకీయమే అన్నిచోట్లా రాజ్యమేలుతున్నట్లు తమిళనాట కూడా విశ్వరూపం ప్రదర్శిస్తోంది. వారం రోజుల క్రితం ముఖ్యమంత్రి స్టాలిన్ ఓ ప్రకటన చేస్తూ మహిళల అక్కౌంట్లలోకి ఐదు వేల రూపాయల ధనవర్షం కురిపించారు. మొత్తం 1.31 కోట్ల మంది మహిళల అక్కౌంట్లలో డబ్బు జమ అయిందట. అంతేగాక ప్రస్తుతం నెలకు వెయ్యి రూపాయల చొప్పున ఇస్తున్న ఉచిత డబ్బుతిరిగి అధికారంలోకి వస్తే రెండు వేలకు పెంచుతామనే హామీ కూడా ఇచ్చారు. ఐదువేలు ఫిబ్రవరి నెలకేగాక ఎన్నికలయ్యే వరకు అంటే మార్చి, ఏప్రిల్ నెలల్లో కూడా ఇస్తారట.ఈఉచిత పంట మరింత భేషుగ్గా ఉందంటున్నారు. మహిళల ఓట్లు గంపగుత్తగా ఆకర్షించడానికి ఇంతకంటే మార్గం ఇంకేముంటుంది! ఒక్క మహిళపై ధనవర్షం కురిపిస్తే ఆ ఇంటినుంచి నాలుగైదు ఓట్లు 'ఉచితంగా' లభిస్తాయనేది దీని వెనుక గల చిదంబర రహస్యమైతే కావొచ్చు. ఈరహస్యం అన్ని పార్టీలకు బాగా తెలిసిపోతోంది. గ్యాస్ సిలిండర్లు, కుట్టు మిషన్లు, టీవీలు, ప్రెషర్ కుక్కర్లు పంచి పెట్టడం కంటె డబ్బు అక్కౌంట్లలోకి వేయడమే లాభకర విధానంగా పార్టీలకు కనిపిస్తోంది.గతంలో అన్నాడిఎంకె అధినేత్రి జయలలిత ఈ'ఉచిత పంట' అన్ని ఇళ్లలో బాగా పండించారు. కొన్ని లక్షలమంది రోజూ టీవీలు చూడగలుగుతున్నారంటే అది ఆమెపుణ్యమే.


స్టాలిన్

టీవీలున్న వారికి ఉచిత కేబుల్ కనెక్షన్లిచ్చారు. అసలు ఆమె ఉచితంగా ఇవ్వనిదేం ఉంది? అని ప్రశ్నించుకోవచ్చు. ఆమె కంటే నాలుగాకులు ఎక్కువ చదివాననుకొంటున్న స్టాలిన్ చాలా ఉచిత పథకాలే అమలు చేస్తున్నారు. వాటిలో ఎక్కువ మహిళలకే. జయలలిత టీవీలు పంచిన కాలంలో కొన్ని కంపెనీలకు లాభాలు ఇబ్బడిముబ్బడిగా వచ్చాయి. తద్వారా కొందరికి కమీషన్లు కూడాబాగానే ముట్టిఉంటాయి. అన్ని ఇళ్లలో కనిపించేవి ఉచితంగా వచ్చిన టీవీలు, స్కూటర్లు, ఇతర గృహోపకరణాలు, కంప్యూటర్లు, ట్యాబ్‌లు,లాప్‌టాప్‌లే. ఇచ్చినవే ఇస్తే ఓట్లు పడవనుకున్నారో ఏమో! ఇప్పుడు డైరెక్ట్‌గా డబ్బు వారిఖాతాల్లో వేసేస్తున్నారు. అధికార పార్టీ నేరుగా చెప్పివేస్తుంటే, విపక్షాలు రహస్యంగా అదేబాట పట్టి తామను కొన్న ఓటర్ల ఖాతాలు నింపుతున్నాయి. ఎన్నికల ముందు భారీగా డబ్బు వాహనాల్లో తరలించి పట్టుబడం కంటే ఇదే నయమనుకొంటున్నాయి. ఆమధ్య బీహార్‌లో ఎటువంటి దృశ్యం కనిపించిందో, ఇప్పుడు తమిళనాట అదే కనిపిస్తోంది. 'డ్రాపవుట్స్' తగ్గించడానికి విద్యార్థులకు డబ్బు పంచి పెడుతున్న పథకాలు కూడా కొన్ని చోట్ల పెడదారి పడుతున్నట్లు వినిపిస్తోంది.విద్యార్థులకు లాప్ టాప్‌లు, స్కూటీలు, సైకిళ్ల పంచిపెట్టడంతో పాటు వారి తల్లుల అక్కౌంట్లలో భారీగా డబ్బు జమచేస్తున్నారు. అదికూడా ఓట్ల ఆకర్షణకే అనడంలో సందేహామేముంటుంది! కానీనిజమైన పేదపిల్లలు ప్రభుత్వ బడులకైనా వెళ్లగలుగుతున్నారా! సందేహమే. ఇలా ఓటర్ల పంట ఏదో ఒకరూపంలో పండుతోంది. పార్టీ లు పండిస్తున్న ఈ'ఉచిత' పంటల ఖర్చురాష్ట్రాల జిఎస్ డిపిలో 25 నుంచి 45 శాతానికి చేరుతున్నదంటే ఎంత నిరర్థక వ్యయం జరుగుతున్నదో అర్థమవుతుంది. వయోవృద్ధులు, దివ్యాంగులు, ఇంకా నిజంగా అవసరమున్న వర్గాల కోసం ఎంతైనా ఖర్చు చేయవచ్చు. కానీ కేవలం ఓట్లను దృష్టిలో ఉంచుకుని కోట్లు పంచడం ఉచితమా? సుప్రీంకోర్టు కూడా రెండు రోజుల క్రితం ఇదే ప్రశ్న వేసి అటువంటి ప్రభుత్వాలను, పార్టీలను గట్టిగానే మందలించింది. ఆర్థిక స్థాయితో సంబంధం లేకుండా అందరికీ 100యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని స్టాలిన్ ప్రభుత్వం ఇటీవల చేసిన మరోప్రకటనను విమ ర్శిస్తూ దానివల్లజరిగే అభివృద్ధి ఏమిటని ప్రశ్నిం చింది. గతంలో కూడా సుప్రీంకోర్టు ఇటువంటి వాతలు పెట్టినా పార్టీలకు ఎప్పటికప్పుడు పరగ డుపే. ఉచితంగా ఆహారం, విద్యుత్, సైకిళ్ల వంటివి ఇవ్వడానికి బదులుగా ఉపాధి అవకాశాలు పెంచే పథకాలు మరిన్ని ప్రకటిస్తే దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయి. నడ్డి విరిగిన రైతులకు ఉచిత కరెంటు ఇస్తే ప్రయోజనం ఉంటుంది. కానీ బడా భూస్వాములకు ఇస్తే లాభం ఎవరికి! అన్నీ ఉచితంగా ఇస్తూ వెళ్తే ఎవరు చదువుకుంటారు, ఎవరు పనిచేస్తారు? సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటామనుకునే ద్రవిడ పార్టీలు వాస్తవాలను ఆలోచించాలి. అన్నాడిఎంకె, కొత్తగా వచ్చిన విజయ్ పార్టీ కూడా ఈ విషయంలో డిఎంకెతో పోటీ పడుతున్నాయి. సుప్రీంకోర్టు చెప్పినట్లు పార్టీలు ఈ విధానాలను సమీక్షించుకోవడం అవసరం. లేకుంటే దీర్ఘకాలంలో సమాజం చాలా వెనుకబడుతుందనే అనిపిస్తుంది. ●

# తగ్గని ట్రంప్ తెంపరితనం!

అమెరికా

**గన్ని మోహన్**

ప్రపంచదేశాలను దారికి తెచ్చుకోడం కోసం మిత్రులు, శత్రువులు అని చూడకుండా 25నుంచి 100శాతం వరకూ దిగుమతి సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు కోర్టు మొట్టికాయలు వేసినా తెంపరితనం వీడలేదు. మొత్తం ప్రపంచంలోని అన్ని దేశాలపైనా 10శాతం సుంకాలు విధిస్తున్నట్లు మరో కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేసి సంచలనం కలిగించారు. ఈ ప్రకారం వాణిజ్య ఒప్పందం జరగనున్న తరుణంలో భారత్‌పై ఉన్న 18శాతం సుంకాలు ఇప్పుడు 10శాతానికి చేరతాయి. కేవలం ఒక్క భారత్‌కే పరిమితం కాలేదు. అన్ని దేశాలపైనా చిన్న పెద్ద, ధనిక, పేద తేడా లేకుండా అన్నింటిపైనా 10శాతం సుంకాలు తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులపై సంతకం చేయడం చూస్తుంటే ట్రంప్ సుప్రీంకోర్టు ఉత్తర్వులు సైతం లెక్క చేయడం లేదని స్పష్టం అవుతోంది. మొత్తం 150 రోజులపాటు అంటే ఐదునెలలపాటు ఈ సుంకాలు అమలులో ఉంటాయని కూడా హెచ్చరించారు. ఫార్మా ఉత్పత్తులతోపాటు అమెరికాలో ప్రవేశిస్తున్న విదేశీ ఉత్పత్తులన్నింటిపైనా ఈ సుంకాలు వేస్తారు. యుఎస్ మెక్సికో కెనడా ఒప్పందం ప్రకారం ఈసుంకాలు అమలు చేస్తున్నామని, 1974 వాణిజ్య చట్టంలోని సెక్షన్ 122 ప్రకారం తనకున్న అధికారాలను వినియోగించి ఈ సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ తన సోషల్‌మీడియా 'ట్రూత్'లో వెల్లడించడం చూస్తుంటే కోర్టు ఉత్తర్వులు ఎన్ని వచ్చినా తాను చేయాల్సింది మాత్రంచేసి తీరుతానని చెపుతున్నట్లుగా ఉంది. భారీఎత్తున సుంకాలు విధించేందుకు ట్రంప్‌నకు అధికారాలు లేవని చెపుతూ సుప్రీంకోర్టు ఈ సుంకాలు చెల్లవని తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే.ఈసెక్షన్ ప్రకారం అధ్యక్షుడికి కొన్ని అంతర్జాతీయ చెల్లింపుల సమస్యలుఎదురైనప్పుడు సర్‌ఛార్జి సమస్యలు, ఇతర ప్రత్యేక దిగుమతి ఆంక్షలు ఉన్నప్పుడు తన విచక్షణ అధికారాలు ప్రయోగించవచ్చు. ఈ సెక్షన్ కింద అమెరికా అధ్యక్షుడు 15శాతం వరకూ తాత్కాలిక సుంకాలను ఐదునెలలపాటు విధించే అధికారాలుంటాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక చెల్లింపులు, లోటు ఇతర ఆర్థిక సమస్యల సమతుల్యత కోసం ఈ చట్టం ప్రయోగించవచ్చన్న వెసులుబాటును ఆసరాగా తీసుకుని ట్రంప్ కొత్తగా 10శాతం సుంకాలు విధించారు.ఇప్పటికే కొన్నిదేశాలు అమెరికాతో ఒప్పందానికి వచ్చాయి. ఇప్పుడు 10శాతం సుంకాలతో గతంలో చేసుకున్న భారీ సుంకాలు కొంతమేర తగ్గుతాయి. నిజానికి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో సుంకాలు చెల్లవని, తక్షణమే రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. అయితే ఇప్పటికే 11 లక్షల కోట్లమేర సుంకాలు వసూలయ్యాయి.


ట్రంప్

వీటన్నింటినీ తిరిగి వసూలు చేసుకునేందుకు ఆయా సంస్థలు మళ్లీకోర్టులకెక్కుతున్నాయి. ఈతరుణంలో ట్రంప్ విధించినపదిశాతం సుంకాలతో మళ్లీ ఆయన ఖజానా నిండుతుందేమో కానీ ప్రజల్లో నిరసన మాత్రం తగ్గదు. ప్రపంచ దేశాల నుంచి కూడా విముఖత తీవ్రస్థాయిలోనే ఎదుర్కొనాల్సి వస్తుంది. ఇప్పుడు కొత్తగా విధించిన సుంకాలను మళ్లీ పొడిగించాల్సివస్తే కాంగ్రెస్ ప్రతినిధుల సభ ఆమోదించాల్సి ఉంటుంది. అలాకాని పక్షంలో ట్రంప్ మళ్లీ తాజాగా చెల్లింపుల ఆర్థిక సమతుల్యతను ప్రస్తావిస్తూ అత్యవసర పరిస్థితిలో విధిస్తున్నట్లు మళ్లీ సుంకాలను విధించే అవకాశాలున్నాయి.అయితే ఈసుంకాలకు ముందు అమెరికా కొన్ని దేశాలకు భారత్‌తోపాటు అత్యంత ఆమోదనీయమైన దేశం హోదా ఇచ్చినవాటికి కేవలం 3.5శాతం మాత్రమే సుంకాలు అమలయ్యేవి. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా ఫస్ట్, అమెరికన్ ఫస్ట్, మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ అని 'మాగా' కొత్తనినాదాన్ని లేవనెత్తినప్పటి నుంచి కూడా తనదైన శైలిలో వెళ్లిపోతున్నారు. ముందు ఉక్రెయిన్ రష్యా యుద్ధం, పాలస్తీనా, ఇజ్రాయెల్ యుద్ధ విరమణలు, ఇప్పుడు తాజాగా ఇరాన్‌పై యుద్ధభేరి వంటివి ట్రంప్ మెదడులో వచ్చిన ఆలోచనలేనని చెప్పాలి. అటు ఆర్థిక మూలాలను దెబ్బతీస్తూ తనవైపునకు తిప్పుకుంటున్న దేశాల్లో వెనిజులా చేరినసంగతి తెలిసిందే. ఇప్పుడు అదే వ్యూహం ఇరాన్‌పైనా అమలుచేస్తున్నారు. తమ ఉత్పత్తులపై అధిక సుంకాలు వేస్తున్నారంటూ ప్రపంచదేశాలపై 18 నుంచి 50శాతం కొన్నింటిపై 100శాతం సుంకాలుకూడా విధించిన ట్రంప్ ఇప్పుడు సుప్రీంకోర్టు ఉత్తర్వులతో మొత్తం రద్దుచేసినా 10శాతం సుంకాలంటూ మళ్లీ తెరపైకి కొత్తవివాదం తీసుకువచ్చారు. ఐదుదశాబ్దాలనాటి పాత అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం 1977ను ప్రయోగించే వీలులేదని న్యాయస్థానం మొట్టికాయలు వేసింది. ఇప్పటికే చైనా, రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ వంటి అగ్రరాజ్యాలు ట్రంప్ సుంకాలను వ్యతిరేకించాయి. అయినా కూడా నా దగ్గర ప్లాన్‌బి ఉందంటూ ట్రంప్ కొత్తగా 10 శాతం సుంకాలుతెచ్చారు.రోజుకొక కొత్తనిర్ణయం, రోజుకో కొత్త కార్యనిర్వాహక ఉత్తర్వుతో దుమారం రేపుతున్న ట్రంప్ వైఖరి ఆదేశంలోని రిపబ్లికన్లకు సైతం అంతుబట్టడంలేదు. మరోపక్క స్వదేశంలోనే ఆయనకు రేటింగ్ పడిపోయింది. అమెరికా చరిత్రలోనే అత్యంత 'చెడ్డ' అధ్యక్షుడు అంటూ రేటింగ్‌లో వెలువడింది. ఎలాంటి సర్వేలు ఎన్నిక వచ్చినా కూడా లెక్కచేయనంటూ ట్రంప్ తన తెంపరితనం మరింతగా చూపిస్తుండటం చూస్తుంటే మొత్తం ప్రపంచదేశాలపై అమెరికా ఆధిపత్యం కొనసాగించాలన్న ఏకైక లక్ష్యం కనిపిస్తోంది.ఆ దిశగానే ట్రంప్ ధోరణులు కూడా ఉన్నాయనడానికి కోర్టు ఒకపక్క స్పష్టమైన ఉత్తర్వులిచ్చినా నాదారి నాదేనంటూ మళ్లీ సుంకాలు విధించడం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇదేతీరు కొనసాగిస్తే ట్రంప్ పాలనకు సత్వరమే అభిశంసన ముప్పుతప్పదని చెప్పవచ్చు. అయినా కూడా సుంకాలపరంగా వెనక్కి తగ్గేందుకు మాత్రం ఆయన మనసు అంగీకరించడంలేదు. అందుకు మూల్యం మాత్రం భారీగానే చెల్లించుకోవాల్సి వస్తుందని ముందుముందు గ్రహించడం మంచిది. ●

# పాక్ చెర నుండి బలూచిస్థాన్‌కి విముక్తి ఎప్పుడు?

**డా. కావలి చెన్నయ్య**

బలూచ్ ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా తమను విలీనం చేసుకున్న పాకిస్థాన్ నుండి వేరు పడుతామని నాటి నుండే దశాబ్దాలుగా పోరాటం చేస్తూనే ఉన్నారు బలూచ్ ప్రజలు. భారత్లో పహల్గాం దాడి తరువాత భారత్ ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్థాన్‌పై దాడిచేసి వారి వాయు సేనను తీవ్రంగా దెబ్బతీసింది. ఇదే అదునుగా భావించి 2025 మే నెలలో బలూచ్ పోరాటయోధుడు 'మీర్ యార్ బలూచ్', 'డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్' ను ప్రకటించాడు. అదేవిధంగా బలూచిస్తాన్ చాలా భూభాగంలో పాకిస్థాన్ ప్రభుత్వ నియంత్రణ కోల్పోయి బలూచ్ పోరాట యోధుల చేతిలోకి వెళ్ళినట్టు తెలుస్తుంది. వీరు, పాక్ సైన్యం తమ ప్రాంతాన్ని వదిలి వెళ్లాలని, తమ ప్రాంతాన్ని ప్రత్యేక దేశంగా గుర్తించాలని ఐక్యరాజ్యసమితిని ఇతర ప్రపంచ దేశాలను వేడుకుంటున్నారు. బలూచిస్తాన్లో మానవ హక్కులను మంటగలిపి, ప్రజలపై అమానుష మారణకాండను కొనసాగిస్తూ, వనరులను దోపిడీ చేస్తూ, శాంతియుత నిరసనలు సైతం కర్కశంగా అణచివేస్తూ, వ్యక్తిగత స్వేచ్ఛ, వాక్ స్వతంత్రం, అక్రమ నిర్బంధాలు, ఎందరినో బలవంతంగా నిర్బంధించి చంపడం, అణిచివేత లాంటి చర్యలతో బలూచ్‌ల గొంతు నొక్కుతున్నారు. దీనికి తోడు కటిక పేదరికం తాండవిస్తున్నదక్కడ. పాక్ అణిచివేతకు ప్రతిగా బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ లాంటి సాయుధ గ్రూపులు పాక్‌పై వీరోచిత పోరాటం మొదలుపెట్టాయి. చారిత్రకంగా పరిశీలించినప్పుడు ఒకప్పుడు బలుచిస్తాన్లో బ్రాహుయ్ ప్రజలు ఉండేవారు. వీరికి భారత్లోని ద్రావిడ భాష మాట్లాడే ప్రజలతో దగ్గర సంబంధం ఉండేదంటారు. మీరు హిందూ బౌద్ధ మతాలను స్వీకరించినట్టు తెలుస్తుంది. ఈ ప్రాంతాన్ని 7వ శతాబ్దంవరకు హిందూ రాజులే పరిపాలించారని చరిత్ర చెప్పుతున్నది. 7వ శతాబ్దంలో అరబ్బుల దండయాత్ర వలన భయపడిన హిందువులందర్ని బలవంతంగా ఇస్లాంలోకి మార్చేసినట్లు తెలుస్తున్నది. ఇక్కడి హింగోల్ నదీ తీరంలో ఒక కొండ గుహలో వెలసిన హింగ్లాజ్ మాత/ హింగ్లాజ్ దేవీ/ హింగోలి దేవి పీఠం హిందూ ధర్మంలోని 51 శక్తి పీఠాలలో ఒకటి. పాక్ ముస్లింలు ఈ దేవతను బీబీనానిగా కొలుస్తారు, ఇక్కడికి ఉత్సవాలను నానీ క హాజ్ అంటారు. భారత ఉప ఖండం స్వేచ్ఛ పొందుతూ భారత్, పాక్‌గా విడిపోయింది. నాడు బ్రిటిష్ ఆదీన భారత ఉపఖండంలో భాగంగా ఉన్న 'ఖాన్ ఆఫ్ ఖలాత్'నేటి బలూచిస్తాన్ స్వతంత్రం గానే ఉండిపోయింది. జిత్తులమారి గుంట నక్క జిన్నా మాయమాటలు నమ్మి అక్కడి కొందరుజమీందారుల, నాయకుల మతోన్మాద మత ఐక్యత పేరిట మోసపోయి బలవంతంగా పాక్‌లో విలీనం అయింది. విలీన సమయంలో పాకిస్థాన్ నావికాదళం అరేబియా సముద్రం గుండా బలూచ్ వైపు వస్తున్నప్పుడు అక్కడి ప్రజలు సముద్రపు నీళ్లలోకి దిగి చేతులపైకెత్తి స్వాగతం పలికారు. ఏదో మంచి జరుగుతుందని అంతలా నమ్మారు నయవంచకపాకిస్థాన్ను. కానీ నేడు ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారక్కడి ప్రజలు. నిజానికి నాడు అక్కడి చాలా మంది ప్రజలు భారత్లో కలవాలని కోరుకున్నారు కానీ అప్పుడున్న రాజకీయ సమీకరణలు కావచ్చు, భౌగోళిక సమీకరణల దృష్ట్యా కావచ్చు. నాటి మన పాలకులు సరైన విధంగా ప్రతిస్పందించలేకపోయారు. ఇది పాకిస్థాన్ నైరుతి ప్రాంతంలో 347190 చదరపు కిలో మీటర్ల వైశాల్యంతో కఠినమైన భూభ్భాగ,పర్వతాలు, ఎడారులతో కూడిన విశాల పీఠభూమితో కూడిన అతిపెద్ద ప్రావిన్స్. అంటే ఇది పాక్ భూభాగంలో 44 శాతం కానీ పాక్ జనాభాలో మాత్రం 14894402 (2023 జనాభా లెక్కల ప్రకారం) మందితో కేవలం 5నుండి 6శాతం మాత్రమే అందులో 50శాతం పేదలే. రాజధాని క్వెట్టా వందల సంవత్సరాలుగా బలూచ్ భాషకు లిపి లేదు ఫలితంగా రచనలు గాని కవిత్వం గాని లాటిన్ అరబిక్ భాషలో రాయబడ్డాయి. సాధారణంగా ఈ భాషను పర్షియన్ అరబిక్( నస్తాలిక్) లిపిని సవరించి బలూచ్ లిపి తయారు చేశారు. 20వ శతాబ్దంలో బలూచ్ సాహిత్యంలో సయ్యద్ జహుర్షా హాష్మీ వంటి రచయితలు ఈ లిపిని అభివృద్ధి పరచడంలో



ప్రముఖ పాత్ర పోషించారు అందుకే ఆయనను బలూచ్ పితామహుడు అంటారు. జర్మనీ బెర్లిన్ విశ్వవిద్యాలయ ప్రపంచ ప్రథమ సమీప ప్రాచ్య పురావస్తుశాస్త్ర ఆచార్యులు ఎర్నెస్ట్ ఎమిల్ హెర్జ్ఫెల్డ్ ప్రకారం 'బలూచ్ అంటే బిగ్గరగా గా అరవడం' అనే మధ్యస్థ పదం నుండి ఉద్భవించి ఉంటుందని చెప్పాడు. వీరు 'పాగ్' తలపాగ ధరిస్తారు. ఇక్కడ క్రీ.శ 600 సం. తరువాత ఇస్లాం ప్రవేశించింది. ఆ సమయంలో ఈ ప్రాంతాన్ని మక్రాన్ అనేవారు. 1817 1839 వరకు కలత్/బలూచ్‌ను మీర్ మెహ్రాబ్ ఖాన్ ఆహామ్మద్ జాయ్ పాలించాడు.ఆఫ్ఘానిస్థాన్ పై బ్రిటిషర్స్ చేసిన దాడికి మద్దతు ఇవ్వనందున కలాత్( బలూచ్) పైన బ్రిటీషర్స్ దాడి చేసి మెహ్రాబ్ ఖాన్ చంపేసి స్థానిక గిరిజన భూస్వామ్య నాయకులతో కలిసి ఈప్రాంతాన్ని తమఅదుపులో ఉంచుకున్నందున అక్కడి గిరిజన ప్రజల్లో తీవ్ర అసంతృప్తి రగిలి బ్రిటీష్ వారిపై దాడులు చేస్తుండేవారు ఫలితంగా 1920లలోనే ప్రజల్లో తీవ్ర స్వాతంత్ర్య కాంక్ష రగిలి బలూచ్ జాతీయవాదం బలపడ సాగింది.ఫలితంగా 1929లో 'అంజుమన్ ఎ ఇత్తే హద్ బలుచిస్తాన్' సంస్థ స్థాపించబడింది. ఈ సంస్థ బలూచ్ కలాత్ సంస్కృతినిరక్షించడం, కలాత్ రాజ్య స్వతంత్రం( బలూచిస్థాన్) కోసం పనిచేయడం మొదలుపెట్టింది. భారత ఉపఖండ విభజన సమయానికి కలాత్ రాజ్యం మీర్ అహ్మద్ యార్ ఖాన్ నాయకత్వంలో స్వతంత్ర దేశాన్ని ప్రకటించుకుంది. కలాత్ రాజ్య స్వాతంత్ర్యానికి జిన్నా మద్దతు ఇస్తూ, ముస్లిం లీగ్ పార్టీ కూడా మద్దతిస్తూ గౌరవిస్తుందని తెలిపి మీర్ అహ్మద్ యార్ ఖాన్ జిన్నా ఒప్పందం కూడా కుదిరింది. ఒప్పందాన్ని తుంగలో తొక్కి బలవంతంగా బలూచిస్తాన్‌ను విలీనం చేసుకొని కలాత్ నేతలపై ఒత్తిడి చేసి, మీర్ అహ్మద్ యార్ ఖాన్ బలవంతంగా పాకిస్థాన్ కరాచీకి తీసుకెళ్లి బెదిరించి మరి విలీన ఒప్పందంపై సంతకం చేయించుకుంది. దీనిని వ్యతిరేకిస్తూ ప్రిన్స్ అబ్దుల్ కరీమ్ గెరిల్లా దాడులతో మొదటి తిరుగుబాటు చేసిన అతన్ని జైల్లో పెట్టారు. నౌషేర ఖాన్ సారధ్యంలో 1958-59లలో పాక్ సైన్యం చేస్తున్న ఘోరా కృత్యాలకు, రాజకీయ నాయకులపై నిర్బంధాలకు,ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా రెండవ తిరుగుబాటు జరిగింది. బలూచిస్తాన్, సింద్, ఖైబర్ ఫఖ్తూన్ ఖ్వా, పంజాబ్‌తూర్పు పాకిస్థాన్ ప్రావీన్సులను కలిపి వేసి 'వన్ యూనిట్' విధానం తెచ్చి కేంద్ర ప్రభుత్వ పాలనను ఏర్పాటు చేయాలని 1955-70లో ప్రయత్నాలు చేశారు. బలూచిస్థాన్‌లో వివిధ వర్గాలు, సంస్థలు కలిపి బలూచిస్తాన్ ఫ్రంట్ ఆధ్వర్యంలో 1963-69 మధ్య ఈ ప్రాంతంలోని గ్యాస్, సహజ వనరుల విషయంలో సమాన వాట దక్కాలని, పాక్ జైళ్లలోని బలూచ్ ఖైదీలను విడుదల, వన్ యూనిట్ రద్దు తదితర డిమాండ్లతో షేర్ మహమ్మద్ బిజ్రాని మర్రి అధ్యక్షతన ఏర్పడ్డ 'పరారీ' గెరిల్లా యుద్ధ సంస్థ పాక్ సైన్యంపై దాడులు చేసింది. 1969లో పాక్ సైన్యంతో బలూచిస్తాన్ లిబరేషన్ ఫ్రంట్ కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్నది. ఫలితంగా ఈ గెరిల్లా యుద్ధంలో పాల్గొన్న తిరుగుబాటుదారులకు క్షమాభిక్ష కూడా లభించింది. ఇది మూడవ తిరుగుబాటు. వన్ యూనిట్ విధానాన్ని అన్ని ప్రావిన్సులు వ్యతిరేకిస్తూ తమ తమ సంస్కృతి, సాంప్రదాయాలు, కలలు, వేష, భాషలు కాలగర్భంలో కలిసి పోతాయనడం చేత 1970లో వన్ యూనిట్ విధానాన్ని రద్దు చేశారు. జుల్ఫికర్ అలీ భుట్టో, బలుచిస్తాన్ ప్రభుత్వాన్ని రద్దు చేయడం వలన ఖైర్ భక్ష్ మర్రి, అతావుల్లా మెంగల్ వంటి స్థానిక గిరిజన సర్దార్ నాయకుల సారథ్యంలో ఇరాక్‌నుండి ఆయుధాలు సమకూర్చుకొని 1973-77 మధ్యలో పాక్ పై భయంకరమైన తిరుగుబాటు జరిగింది. ఈ తిరుగుబాటులో చాలామంది బలుచీలు మరణించినట్లు, అదేవిధంగా 3000 5000మంది పాక్ సైనికులు మరణించినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈతిరుగుబాటు అణిచివేతకు 80వేల మంది పాక్ సైనికులు పాల్గొన్నందున ఈ తిరుగుబాటు ఎంత పెద్దదో ఇట్టే అర్థమవుతుంది. ఆ తర్వాత పాక్ సైన్యాధిపతి జియా ఉల్ హక్, ప్రధాని జుల్ఫికర్ అలీ బుట్టోనూ సైనిక తిరుగుబాటు ద్వారా దించేసి అధికారంలోకి రావడం చేత బలూచ్ సమస్యను రాజకీయంగా పరిష్కారం చేయడానికి సిద్ధపడటం. బలుచ్ నాయకులు ఆఫ్ఘానిస్థాన్ కు శరణార్థులుగా వెళ్లడం చేత తిరుగుబాటు సమిసి పోయింది. ●

# భారత్‌లో దాడులకు జైష్ కుట్ర



**హైదరాబాద్, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ జేష్ ఏ మహమ్మద్ మరోసారి భారతీయులను లక్ష్యం చేసుకుని దాడులకు భారీ కుట్రలు పన్నినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఒక్క భారత్‌లోనే కాకుండా విదేశాల్లో భారతీయులు ఎక్కువగా వుండే నగరాలను ఎంచుకుని అక్కడి పబ్‌లు, క్లబ్బులలో ఆత్మాహుతి దాడుల ద్వారా భారీగా ప్రాణ నష్టం కలిగించేందుకు ఈ సంస్థ వ్యూహాలు రచించినట్లు నిఘా వర్గాలకు స మాచారం అందింది. ఇందుకోసం జైష్ ఏ మహమ్మద్ తమ మహిళా క్యాడర్‌ను ఆత్మాహుతి దాడుల కోసం ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి నియ మించిందని నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ విషయంలో భారత్‌లోని మెట్రో నగరాలలో అప్రమత్తంగా ఉండాలని అక్కడి పోలీసులను నిఘా వర్గాలు అప్రమత్తం చేశాయి.

భారత్‌పై ఉగ్రదాడులకు కుట్రలు చేస్తున్న పాక్‌లోని జైష్ ఏ మహమ్మద్ ఉగ్ర కార్యకలాపాలకు రెండేళ్ల క్రితం మహిళా క్యాడర్‌ను నియమించుకోవ డం తెలిసిందే. పురుషులకు ఏమాత్రం తీసిపోని విధంగా కఠిన శిక్షణ పొందిన మహిళలను ఉగ్రవాదులుగా తీర్చిదిద్దిన విషయాన్ని ఆపరేషన్ సిం ధూర్ తరువాత నిఘా వర్గాలు గుర్తించాయి. వాస్తవానికి అంతకు ముందే జైష్ ఏ మహమ్మద్ తన సంస్థలో మహిళా ఉగ్రవాదులను ఎంపిక చేసినా ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్ర శిబిరాలపై భారత్ దాడులు చేశాకే ఈ

### మహిళా ఉగ్రవాదులతో ఆత్మాహుతి దాడులకు యత్నం..

### గుర్తించిన నిఘా వర్గాలు

విషయం బయటపడంది. భవిష్యత్తులో భారత్‌పై దాడులకు మహిళా ఉగ్రవాదులను ఉపయోగిం చేందుకు ఈ సంస్థ పథకాలను రచించింది. ఇందులో భాగంగా భారతీయులను లక్ష్యం చేసుకుని భారత్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాలలో భారతీయులు ఎక్కువగా వుండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి దాడులకు జైష్ ఏ మహ మ్మద్ వ్యూహాలు రచించినట్లు తాజాగా వెలుగు చూసింది. ఇందుకు జనావాసం కలిగిన ప్రాంతాల కన్నా పబ్‌లు, క్లబ్బులపై దాడులు చేయడం మేలని జైష్ ఏ మహమ్మద్ భావించినట్లు వెల్లడయ్యింది. ఇందు కోసం ఎంపిక చేసిన పబ్‌లు, క్లబ్బుల్లో ఉద్యోగు లుగా తమ సంస్థకు చెందిన మహిళా ఉగ్రవాదులను నియమించడం కూడా పూర్తయి నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. వీరంతా ఆయా క్లబ్బులు, పబ్‌లలో ఉద్యోగులుగా పనిచేస్తూ ఆదేశాలు అందగానే నిమి షాలలో ఆత్మాహుతి బాంబర్లుగా మారి తమను తాము పేల్చుకుని భారీ ప్రాణనష్టం కలిగించేలా శిక్షణ పొంది నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఉగ్ర దాడు లకుగానూ భారత్‌తోపాటు బ్రిటన్, అమెరికా, ఇండోనే షియా, దుబాయ్‌లోని కొన్ని నగరాలను జైష్ ఏ మహమ్మద్ ఎంపిక చేసుకుందని తెలిసింది. కొన్నిచోట్ల ఆత్మాహుతి దాడుల కోసం ఇప్పటికే రెక్కీ కూడా పూర్త యినట్లుగా తెలిసింది. ఆత్మాహుతి బా ంబర్లుగా పాక్‌తో పాటు విదేశీ మహిళలను ఎంపిక చేసినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ సహకారంతో వీరికి నకిలీ గుర్తింపు కార్డులు జారీ అయినట్లు తెలిసింది.

ప్రపంచ వ్యాప్తంగా ఏక కాలంలో దాడులకు పాల్పడాలని జైష్ ఏ మహమ్మద్ వ్యూహంగా నిఘా వర్గాలు అంచనాకు వచ్చాయి. ఈ భారీ ఆపరేషన్‌కు పెద్ద ఎత్తున నిధులు అవసరం కావడంతో గాజా సహాయం పేరిట పాకిస్తాన్ తో పాటు గల్ఫ్ దేశాలలో నాలుగు నెలలుగా జైష్ ఏ మహమ్మద్ విరాళాలు సేకరిస్తోందని నిఘా వర్గాలు గుర్తించాయి.





## ట్రంప్ దూకుడుకు బ్రేకులు వేసిన నీల్‌కత్యాల్!

### అమెరికా తాజా పరిణామాలలో భారత సంతతి లాయర్ కీలక పాత్ర

**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** తన, పర భేదం లేకుండా టారిఫ్‌ల పేరుతో ప్రపంచ దేశాలను వణికించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుకు అగ్రరాజ్య సుప్రీంకోర్టు బ్రేక్ వేసింది. ఆ సుంకాలేవీ చెల్లవంటూ సంచలన తీర్పు వెలువరించింది. ఈ తీర్పు రావడంలో భారత సంతతి న్యాయవాది నీల్ కత్యాల్ కీలక పాత్ర పోషించారు. ట్రంప్ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ పిటిషన్లు దాఖలు చేసిన చిన్న వ్యాపారులు, డెమోక్రాట్ పాలిత రాష్ట్రాల కూటమి తరఫున ఆయన సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. ఈ టారిఫ్‌ల కోసం ట్రంప్ 1977 నాటి అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టాన్ని (ఐఇఇపిఎ) ఉపయోగించడానికి వ్యతిరేకంగా నీల్ కత్యాల్ సుప్రీంకోర్టులో వాదించారు. ప్రతి వాణిజ్య భాగస్వామిపైగా సుంకాలు విధించడం అన్యాయమని, అది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. సుప్రీం తీర్పు నీల్ మాట్లాడుతూ.. 'ఈ రోజు అమెరికా సుప్రీంకోర్టు చట్టపరమైన పాలన, అమెరికన్ ప్రజల భద్రత కోసం నిలబడింది. అధ్యక్షుడు శక్తిమంతులే.. కానీ రాజ్యాంగం మరింత శక్తిమంతమైనదని న్యాయస్థానం నిరూపించింది. ప్రాథమిక విలువలను కాపాడింది. ఈ తీర్పు ఓ మైలురాయిగా నిలవనుంది' అని ఆనందం వ్యక్తం చేశారు. నీల్ కత్యాల్ షికాగోలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు భారత్ నుంచి వచ్చిన వలసదారులు. తల్లి ప్రతిభ వైద్యురాలు. తండ్రి సురేందర్ ఇంజినీర్‌గా పనిచేశారు. యేల్ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నీల్.. కెరీర్ తొలినాళ్లలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్టీఫెన్ బ్రేయర్ వద్ద క్లర్కుగా పని చేశారు. 2010లో నాటి అమెరికా అధ్యక్షుడు ఒబామా హయాంలో యుఎస్ సొలిసిటర్ జనరల్‌గా వ్యవహరించారు. ఇప్పటివరకు అమెరికా సుప్రీంకోర్టులో 50కి పైగా కేసులు వాదించారు. గతంలో ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా నీల్ న్యాయస్థానాల్లో వాదించిన సందర్భాలు ఉన్నాయి. 2017లో ట్రంప్ తొలిసారి అధికారంలో కొన్ని దేశాలపై విధించిన ప్రయాణ ఆంక్షలకు వ్యతిరేకంగా నమోదైన కేసులను నీల్ వాదించారు. 'ఇంపీచ్: ది కేస్ అగైనెస్ట్ డొనాల్డ్ ట్రంప్' అనే పుస్తకాన్ని కూడా రచించారు. సంచలనం సృష్టించిన ఆఫ్రికన్ అమెరికన్ జార్జ్ ఫ్లాయిడ్ హత్య కేసులో మిన్నేసోటా రాష్ట్రం తరఫున ప్రత్యేక ప్రాసిక్యూటర్‌గా వాదించారు. అమెరికా న్యాయవిభాగం నుంచి అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకున్నారు.

## పరువు నష్టం కేసులో రాహుల్‌గాంధీకి బెయిలు



**ముంబై, ఫిబ్రవరి 21:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఆర్ఎస్ఎస్ పరువు నష్టం దావా కేసులో ఊరట లభించింది. తాజాగా షూరిటీ సమర్పించడంతో భివాండీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో మహాత్మాగాంధీ హత్యలో సంఘ్ హస్తముందని ఆరోపణల చేయగా, ఆర్ఎస్ఎస్ కార్యకర్త రాజేశ్ కుంటె పరువు నష్టం దావా దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఆ కేసు విచారణలో భాగంగా శనివారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మహారాష్ట్రలోని భివాండీ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తాజాగా మహారాష్ట్ర పిసిసి చీఫ్ హర్షవర్ధన్ సప్కల్ షూరిటీతో దస్త్రాలను కోర్టులో దాఖలు చేయగా, కోర్టు రాహుల్‌కు బెయిల్ మంజూరు చేసింది. అంతకు ముందు మాజీ కేంద్ర మంత్రి శివరాజ్ పాటిల్ షూరిటీ సమర్పించగా, గత డిసెంబర్‌లో పాటిల్ మృతి చెందడంతో తాజాగా షూరిటీని సమర్పించాల్సి వచ్చింది. దీంతో మళ్లీ షూరిటీ సమర్పిస్తేనే బెయిల్ మంజూరు చేస్తామని న్యాయమూర్తి స్పష్టం చేయడంతో మహారాష్ట్ర పిసిసి చీఫ్ హర్షవర్ధన్ షూరిటీని సమర్పించారు. బెయిల్ మంజూరైంది. శనివారం ఉదయం ఢిల్లీ నుంచి రాహుల్‌గాంధీ విమానంలో ముంబై చేరుకోగా, విమానాశ్రయం వెలుపల బిజెపి శ్రేణుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది.

## 25, 26న ఇజ్రాయెల్‌లో ప్రధాని మోడీ పర్యటన

### పలు రక్షణ ఒప్పందాలు జరిగే అవకాశం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 25-26 తేదీల్లో రెండురోజుల పాటు ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వ్యూహాత్మక సంబంధాలు, రక్షణ రంగంలో సహకారాన్ని మరింత విస్తరించుకునే దిశగా అడుగులు పడనున్నాయి. యాంటీ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్, లేజర్ వెపన్స్, లాంగ్‌రేంజ్‌స్టాండాఫ్ మిస్సైల్స్, డ్రోన్ల అభివృద్ధిలో ఇరుదేశాలు పాలుపంచుకునేలా రక్షణ ఒప్పందం జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటన అజెండాపై రెండు దేశాల నుంచి ప్రస్తుతానికి ఎలాంటి ప్రకటనా రాలేదు. అయితే అత్యాధునిక రక్షణ సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత్‌తో పంచుకునేందుకు ఇజ్రాయెల్ అంగీకరించినట్లు తెలుస్తోంది. హైటెక్ లేజర్ డిఫెన్స్, స్టాండాఫ్ సిస్టమ్స్ అందులో ఉన్నాయి. ఈ విస్తృత రక్షణ సహకారానికి గతేడాదే పునాది పడింది. గత నవంబర్‌లో డిఫెన్స్ సెక్రటరీ ఆర్కే సింగ్ ఇజ్రాయెల్‌లో పర్యటించారు. అప్పుడే దీని అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఇజ్రాయెల్‌తో కలిసి యాంటీ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ వ్యవ స్థను అభివృద్ధి చేయాలని భారత్ భావిస్తోంది. ఇది మిషన్‌సుదర్శన్‌కు కీలకం కానుంది. భారత్‌లోని కీలకమైన వ్యవస్థలు, అణువిద్యుత్ కేంద్రాలు, ఇస్రో సంస్థలను దీర్ఘశ్రేణి క్షిపణుల నుంచి రక్షించుకునేందుకు ప్రధాని మోడీ ఈ మిషన్‌ను ప్రకటించారు. లాంగ్‌రేంజ్ యారో, మీడియం రేంజ్ స్టింగ్, షార్ట్ రేంజ్ ఐరన్ డోమ్ సిస్టమ్‌తో కూడిన యాంటీ బాలిస్టిక్ మిస్సైల్ సిస్టమ్‌లో ఇజ్రాయెల్ లీడర్‌గా ఉంది. యారో మిస్సైల్ సిస్టమ్‌ను ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఎక్కువ ఎత్తు నుంచి వచ్చే క్షిపణులను ఇది అడ్డగిస్తుంది. ఇందులో యారో 3.. 100 కిలోమీటర్ల ఎత్తు నుంచి, అంతరిక్షం నుంచి ప్రయోగించే క్షిపణు లను కూడా అడ్డుకుంటుంది. యారో 2 ఇది భూవాతావరణం నుంచి ప్రయోగించే స్వల్ప, మధ్యశ్రేణి క్షిపణులను అడ్డుకుంటుంది. యారో 4 అయితే అభివృద్ధి దశలో ఉంది. హైపర్‌సోనిక్ ముప్పులను ఎదుర్కొనే లక్ష్యంతో దీనిని రూపొందిస్తున్నారు. ఇక యారో 3ని ఇజ్రాయెల్ ఇతర దేశాలకు విక్రయిస్తోంది. అలాగే దీర్ఘశ్రేణి క్షిపణులు, కామికేజ్ డ్రోన్లను కొనుగోలు చేయాలని చూస్తోంది. అవి శత్రుదేశాల రక్షణ వ్యవస్థలను దాటి దాడి చేయగలవు. ఈ డ్రోన్లు ఆధునిక యుద్ధతంత్రంలో కీలకపాత్ర పోషించనున్నాయి. ఇవి టార్గెట్‌పై పడి పేలిపోయే ఆత్మాహుతి డ్రోన్లు. తక్కువ ఖర్చు.

## విద్యార్థులపై టీచర్ కాల్పులు.. ఒకరికి తీవ్రగాయాలు

**కోల్‌కత్తా, ఫిబ్రవరి 21:** పశ్చిమ బెంగాల్‌లో ఒక ఉపాధ్యాయుడు కాల్పులు జరిపిన ఘటనలో ఒక విద్యార్థికి గాయాలయ్యాయి. కాల్పుల ఘటనకు సంబంధించి పోలీసులు అతడిని అరెస్టు చేశారు. ముర్షిదాబాద్ జిల్లాలో తన ఇంటి బయట ఆడుకుంటున్న స్కూల్ విద్యా ర్థులపై ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కాల్పులు జరపడం కలకలం రేపింది. బనిపూర్ గ్రామంలో సమీర్ అనే ఉపాధ్యాయుడి ఇంటి పక్కన ఖాళీ స్థలం ఉంది. శుక్రవారం మధ్యాహ్నం పది పన్నెండు మంది విద్యార్థులు రోజులాగే ఆ ఖాళీ స్థలంలో క్రికెట్, ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారు. విద్యా ర్థులు ఆడుకుంటుం డగా బంతి సమీర్ ఇంటి తలుపుకు, గోడలకు పలుమార్లు తాకింది. దీంతో ఆగ్రహం చెందిన సమీర్ తన తుపాకీతో మైదానంలో ఆడుతున్న పిల్లల పైకి ఆరు రౌండ్ల కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఒక విద్యార్థికి గాయాలయ్యాయి. తాము మైదానంలో ఆడుకుంటున్న సమయంలో బంతి సమీర్ ఇంటి గోడను తాకిందని, దీంతో ఆగ్రహం చెందిన ఉపాధ్యాయుడు తమ పైకి కాల్పులు జరిపాడని ఓ విద్యార్థి మీడియా ప్రతినిధులతో చెప్పాడు.

## మార్చినెలాఖరుకల్లా నక్సలిజం అంతం - అదే మా లక్ష్యం

### అస్సోంలో హోంమంత్రి అమిత్‌షా



**గువాహతి, ఫిబ్రవరి 21:** మార్చి 31 లోగా దేశం నుంచి నక్సలిజాన్ని నిర్మూలించనున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. 87వ సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో ఆయన పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్‌లో సీఆర్పీఎఫ్ దళాలు కీలక పాత్ర పోషించాయని, అక్కడ రాళ్లు రువ్వే ఘటనలు పూర్తిగా అంతం అయ్యాయని వెల్లడించారు. మణిపూర్‌లోనూ జాతుల వైరంతో వచ్చిన హింసను ఆ దళాలు కట్టడి చేసినట్లు చెప్పారు. కేవలం మూడేళ్లలో మావోయిస్టుల వెన్ను విరిచినట్లు సీఆర్పీఎఫ్‌ను మంత్రి షా కీర్తించారు. సీఆర్పీఎఫ్‌పై నమ్మకంతో కాన్ఫిడెంట్‌గా చెబుతున్నానని, దేశంలో ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు నక్సల్ సమస్యను నిర్మూలించనున్నట్లు షా తెలిపారు. చత్తీస్‌ఘఢ్‌తెలంగాణ బోర్డర్‌లో ఉన్న కర్రెగుట్టలో ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌ను చేపట్టిన దళాలపై మంత్రి షా ప్రశంసలు కురిపించారు. ఆ ఆపరేషన్‌లో గత ఏడాది ఏప్రిల్, మే మధ్య కాలంలో 31 మంది నక్సల్స్ మరణించారు. సుమారు 46 డిగ్రీల ఎండలో ఆ ఆపరేషన్ చేపట్టినట్లు చెప్పారు. నక్సల్స్ ఆధీనంలో ఉన్న ఆ కొండల్ని విముక్తి చేసేందుకు కేంద్ర రిజర్వ్ పోలీసులు దళాలు అత్యంత ధైర్యాన్ని ప్రదర్శించినట్లు తెలిపారు. పదేళ్ల క్రితం దేశంలో మూడు అతిపెద్ద హాట్‌స్పాట్ కేంద్రాలు ఉండేవని, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం, ఈశాన్యంలో చొరబాటులు, చత్తీస్‌ఘఢ్ అడవుల్లో నక్సలిజం పెద్ద సమస్యగా ఉండేవని, కానీ ఇప్పుడు ఆ ప్రాంతాలు ప్రగతి, శాంతికి సంకేతంగా మారాయన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో 700 మంది సీఆర్పీఎఫ్, నక్సల్ ప్రాంతాల్లో 780 మంది, జమ్మూకశ్మీర్‌లో 540 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు మంత్రి వెల్లడించారు. వీరి త్యాగాల వల్ల ఒకప్పుడు హింసకు కేంద్ర బిందువులైన ఆ ప్రాంతాలు ఇప్పుడు శాంతియుతంగా మారాయన్నారు.

## సంక్షిప్తంగా..

### ట్రంప్ చైనా పర్యటన ఖరారు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా పర్యటన ఖరారైంది. మార్చి 31 నుంచి ఏప్రిల్ 2 వరకు ఆయన మూడు రోజుల పాటు చైనాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ఉన్నత స్థాయి వాణిజ్య చర్చలు జరపనున్నారు. వైట్‌హౌస్ అధికారి అధికారికంగా పర్యటన తేదీలను ధ్రువీకరించారు. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించి, ఆర్థిక సంబంధాలను చక్కదిద్దడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. ఇరు దేశాధినేతలు నేరుగా చర్చలు జరిపి కీలక అంశాలపై స్పష్టతకు రానున్నారు.

గత ఏడాది అక్టోబర్‌లో దక్షిణ కొరియాలో ఇరువురు నేతలు వాణిజ్య యుద్ధ విరమణకు తాత్కాలికంగా అంగీ కరించారు. ఆ ఒప్పందాన్ని పొడిగించే అంశంపై కూడా సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

### బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూ విడుదల




**లండన్, ఫిబ్రవరి 21:** బ్రిటన్ రాజు చార్లెస్-3 సోదరుడు ఆండ్రూ మౌంట్‌బాటన్ విండ్సర్‌ను పోలీసులు విడుదల చేశారు. అమెరికా లైంగిక నేరగాడు జెఫ్రీఎప్‌స్టీన్‌కు బ్రిటన్ రహస్య పత్రాలను చేరవేయటంతోపాటు తన కార్యాలయాన్ని అసాంఘిక వ్యవహారాల కోసం వినియోగించుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అభియోగాలపై ఆండ్రూను థేమ్స్ వ్యాలీ పోలీసులు గురువారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దాదాపు 11 గంటలపాటు తమ అదుపులోనే ఉంచుకున్న పోలీసులు గురువారం విడుదల చేశారు. ఆండ్రూపై దర్యాప్తు కొనసాగుతుందని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆండ్రూకు చెందిన నార్‌ఫోక్ ఎస్టేట్‌లో సోదాలు పూర్తయ్యాయని, బెర్క్‌షైర్‌లోని కోటలో సోదాలు ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు.

### గ్యాస్ ట్యాంకర్ పేలుడు: నలుగురు మృతి

శాంటియాగో, ఫిబ్రవరి 21: చిలీ రాజధాని శాంటియాగోలో భారీ ప్రమాదం సంభవించింది. ద్రవ రూపంలో ఉన్న గ్యాస్‌ను తీసుకెళుతున్న ఒక ట్రక్కు బోల్తా పడి, నిమిషాల వ్యవధిలోనే భారీ శబ్దంతో పేలిపోయింది. ఈ దుర్ఘటనలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు వివరాల ప్రకారం ట్రక్కు డ్రైవర్ అదుపు తప్పి వాహనాన్ని క్రాష్ చేయడంతో ఈ ప్రమాదం జరిగింది. మరణించిన వారిలో ట్రక్కు డ్రైవర్ కూడా ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. స్థానిక గ్యాస్ కంపెనీ ఖిగాస్కోఖి కు చెందిన ఈ ట్రక్కు ప్రమాదానికి గురైన వెంటనే మంటలు ఎగిసిపడ్డాయి. పేలుడు తీవ్రతకు 150 నుంచి 200 మీటర్ల పరిధిలోని 50 వాహనాలు దెబ్బతిన్నాయని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.


### అధికారం కోసం ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించలేదు: మోహన్‌భగవత్



**మీరట్, ఫిబ్రవరి 21:** అధికారంకోసం రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ్ ఆవిర్భవించలేదని, మొత్తం హిందూ సమాజాన్ని జాగృతంచేసి హిందూత్వాన్ని ఏకతాటిపైకి తీసుకురావడమే లక్ష్యంగా ఉద్భవించిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. శతాబ్దినగర్‌లోని మాధవ్‌కుంజ్‌లో 950 మందికిపైగా హాజరయిన జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్ ఏకులానికి మతానికి వ్యతిరేకం కాదని, సామాజికసమానత్వం కోరుతున్నదని అన్నారు. ఆర్ఎస్ఎస్ 100 ఏళ్ల చరిత్రలో ఎప్పుడూ అదికారంకోసం పాకులాడలేదని, హిందూ సమాజానికి దిశా నిర్దేశంచేసిందని అన్నారు. జాతినిర్మాణంలో యువత విరివిగా పాలుపంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## సుప్రీం తీర్పు వెనుక విదేశీ ప్రయోజనాలు!

### - గ్లోబల్‌స్థాయిలో 10% సుంకాలు తక్షణమే అమలు - ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం



**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** తన పన్నుల విధింపు అధికారాన్ని కట్టడి చేస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. శ్వేతసౌధంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన న్యాయవ్యవస్థపై ధ్వజమెత్తారు. ఈ తీర్పు దేశానికి తీరని అవమానమని, కొందరు న్యాయమూర్తులకు దేశం కోసం సరైన నిర్ణయం తీసుకునే ధైర్యం లేదని విమర్శించారు. అంతటితో ఆగకుండా, ఈ తీర్పు వెనుక విదేశీ ప్రయోజనాలున్నాయని, న్యాయమూర్తులు బయటి వ్యక్తుల ప్రభావానికి లోనయ్యారని సంచలన ఆరోపణలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు తనను ఆపలేదని ట్రంప్ స్పష్టం చేశారు. పాత చట్టంకింద వేసిన పన్నులను కోర్టు కొట్టివేస్తే, తక్షణమే సెక్షన్ 122 కింద 10 శాతం గ్లోబల్ టారిఫ్ విధిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. తాను ఎంత పన్ను వేయాలనుకుంటే అంత వేస్తానని పాత చట్టాల కంటే ఇప్పుడు మా దగ్గర ఉన్నవి చాలా శక్తిమంతమైనవి. అవసరమైతే ఏ దేశంపైనైనా వాణిజ్య దిగ్బంధం విధిస్తాను, ఇతర దేశాల వాణిజ్యాన్ని దెబ్బతీసే అధికారం నాకుందంటూ ఆయన తన దూకుడును ప్రదర్శించారు. సుంకాల విధింపు వల్ల అమెరికాలో పరిశ్రమలు కళకళలాడుతున్నాయని ట్రంప్ చెప్పుకొచ్చారు. జార్జియాలోని ఒక స్టీల్ ప్లాంట్ యజమాని తనను కలిసి "సార్, మిమ్మల్ని ముద్దు పెట్టుకోవాలని ఉందని అన్నారని ఆయన గుర్తు చేసుకున్నారు. విదేశీ వస్తువుల దిగుమతి ఆగిపోవడంతో అమెరికాలో నిరుద్యోగం తగ్గిందని, స్టాక్ మార్కెట్ 50 వేల మార్కును దాటిందని ఆయన గర్వంగా ప్రకటించారు. సుప్రీంకోర్టు తీర్పుతో గతంలో వసూలు చేసిన సుమారు 175 బిలియన్ డాలర్ల పన్ను ఆదాయం ఇప్పుడు అనిశ్చితిలో పడింది. ఆ డబ్బును వెనక్కి ఇవ్వాల్సి ఉంటుందా అన్న ప్రశ్నకు కోర్టు ఆ విషయం గురించి చర్చించలేదు, దీనిపై మరో ఐదేళ్ల పాటు కోర్టులో పోరాటం సాగుతుందని ట్రంప్ దాటవేశారు.

## సుంకాలతో అమెరికా ఖజానాకు రూ.26 లక్షలకోట్లు!




**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అమెరికా ఫస్ట్ ఆర్థిక విధానాలు ఆ దేశ వాణిజ్య ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేస్తున్నాయి. ఇతర దేశాల నుంచి వచ్చే వస్తువులపై ఆయన విధించిన భారీ సుంకాల వల్ల గత ఏడాది కాలంలో అమెరికా ఖజానాకు అక్షరాలా 287 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 26 లక్షల కోట్లు) అదనపు ఆదాయం సమకూరింది. 2024 ఏప్రిల్‌లో భారత్ సహా పలు దేశాలపై సగటున 17 శాతం వరకు సుంకాలు విధించడంతో, గతంతో పోలిస్తే పన్నుల రాబడి ఏకంగా మూడు రెట్లు పెరిగింది. 1932 తర్వాత అమెరికా చరిత్రలో ఇవే అత్యంత కఠినమైన పన్ను విధానాలని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ సుంకాల వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం మాత్రం పాక్షికంగానే నెరవేరింది. అమెరికాకు ఇతర దేశాలతో ఉన్న వాణిజ్య లోటు గణనీయంగా తగ్గి, 2009 నాటి కనిష్ట స్థాయికి చేరుకున్నప్పటికీ, స్థానిక తయారీ రంగం మాత్రం ఆశించిన స్థాయిలో పుంజుకోలేదు. సొంత దేశంలో పరిశ్రమలు పెరిగి ఉద్యోగాల కల్పన జరుగుతుందని ట్రంప్ ప్రభుత్వం భావించినా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ముఖ్యంగా ఆటోమొబైల్ పరిశ్రమపై ఈ పన్నుల ప్రభావం తీవ్రంగా పడటంతో ఆ రంగం ఒత్తిడికి లోనవుతోంది. మరోవైపు, ఈ పన్నుల భారం అంతిమంగా అమెరికా సామాన్య ప్రజల జేబులకే చిల్లు పెట్టింది. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకడంతో, ఒకానొక దశలో రిటైల్ ద్రవ్యోల్బణం ఆందోళనకర స్థాయికి చేరింది. సుమారు 51 శాతం మంది ప్రజలు ఈ సుంకాల వల్ల తమ జీవనం భారమైందని వాపోతున్నట్లు తాజా సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలోనే అమెరికా సుప్రీంకోర్టు తాజాగా ట్రంప్ తీసుకున్న కొన్ని ఏకపక్ష నిర్ణయాలను కొట్టివేయడం వాణిజ్యసంస్థలకు పెద్ద ఊరటనిచ్చింది. అలాగే తమనుంచి వసూలుచేసిన సుంకాలను రికవరీచేసుకునేందుకు తిరిగి కోర్టులను ఆశ్రయించనుండటం ట్రంప్‌నకు ఎదురవుతున్న అతిపెద్ద సవాల్ అనే చెప్పాలి.

## అజిత్‌పవార్ మృతిలో కుట్రకోణం

### రామ్మోహన్‌నాయుడు రాజీనామాచేయాలని రోహిత్‌పవార్ డిమాండ్

**ముంబయి, ఫిబ్రవరి 21:** మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణానికి కారణమైన విమాన ప్రమాదంపై రాజకీయ ప్రకంపనలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, అప్పటి వరకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తన పదవికి రాజీనామా చేయాలని ఎన్సీపీ (ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్ పవార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. జనవరి 28న బారామతి వద్ద జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణించిన సంగతి తెలిసిందే. ప్రమాదానికి గురైన విమానం వీఎస్ఆర్ వెంచర్స్ సంస్థకు చెందినదని, ఈ సంస్థతో విమానయాన మంత్రికి చెందిన రాజకీయ పార్టీకి మధ్య సంబంధాలు ఉన్నాయని రోహిత్ పవార్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో నిష్పక్షపాత విచారణ జరగాలంటే మంత్రి పదవిలో ఉండకూడదని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రమాదం వెనుక రాజకీయ లేదా వ్యాపార పరమైన కుట్ర ఉండవచ్చని రోహిత్ పవార్ అనుమానం వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణమైన కంపెనీని కొందరు శక్తివంతులు కాపాడుతున్నారు. ఇందులో డీజీసీఏ అధికారుల ప్రమేయం కూడా ఉండే అవకాశం ఉంది. ఈ కేసులో న్యాయం జరగాలంటే ప్రధాని మోదీ, అమిత్ షా స్వయంగా దృష్టి సారించాలని ఆయన కోరారు. ప్రమాద సమయంలో విమానాన్ని నడిపిన కెప్టెన్ సుమిత్ కపూర్ గతంలో మద్యం సేవించినందుకు మూడేళ్ల పాటు సస్పెన్షన్‌కు గురయ్యారని, అటువంటి వ్యక్తికి విమాన బాధ్యతలు ఎలా అప్పగించారని రోహిత్ ప్రశ్నించారు.

# గడువులోగా పత్తి అమ్ముకోవాలి

## రైతుల వద్ద 10 లక్షల టన్నుల నిల్వ

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కొనుగోళ్లకు సంబంధించిన గడువు పొడిగించిన నేపథ్యంలో తమ వద్ద మిగిలి ఉన్న పత్తిని సకాలంలో అమ్ముకోవాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో రాష్ట్రంలోని రైతులకు ఇబ్బంది కలగకుండా, ఈ నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లను కొనసాగించేందుకు సీసీఐ అంగీకరించిందన్నారు. రైతు ప్రయోజనాలను ప్రాధాన్యంగా తీసుకొని కొనుగోళ్ల గడువును పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం మరియు సీసీఐ దృష్టికి తీసుకెళ్లగా, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో పత్తి సాగు ఆలస్యంగా ప్రారంభమవడంతో దిగుబడులు కూడా ఆలస్యంగా మార్కెట్‌కు వస్తున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో ఇంకా 9.99 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి రైతుల వద్ద ఉందని మార్కెటింగ్ అధికారులు అంచనా వేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం కొత్తగా తీసుకొచ్చిన కపాస్ కిసాన్ పై మొదట రైతులు మరియు జిన్నర్ల నుండి వ్యతిరేకత వచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తూ, రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని యాప్ విధానానికి మద్దతు ఇచ్చామని పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు క్యూలలో నిలబడే అవకాశం లేకుండా, సమయపాలన పాటిస్తూ, రైతులకు దగ్గరలోని పత్తి కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించుకునే అవకాశం కలగడంతో పాటు, పత్తి కొనుగోళ్లను రెగ్యులేట్ చేస్తూ, పారదర్శకంగా కొనుగోళ్లను చేపట్టే వెసులుబాటు కలిగిందన్నారు.

# పరీక్షలు ఉన్నాయని ఆందోళన వద్దు

## ఇంటర్ విద్యార్థులకు కవిత సూచన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:** తెలంగాణలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 25వ తేదీ నుంచి జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆమె ఆకాంక్షి ంచారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షల్లో ఆందోళనకు గురి కాకుండా ఎంత వస్తే అంత రాయాలని సూచించారు. ఫలితాల కోసం ఏమాత్రం ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. పరీక్షలు బాగా రాయలేనేమోననే ఆందోళనతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు వార్త చూశానని, కాబట్టి ఫలితాల గురించి భయపడ వద్దని అన్నారు. పరీక్షలు అనేవి జీవితంలో చిన్న పందెమని గుర్తుంచుకోవాలని సూచించారు.
ఒక పరీక్ష సరిగ్గా రాయకుంటే మన జీవితం అంతటితో ఆగిపోదని అన్నారు. పరీక్షల తర్వాత ఎంతో జీవితం ఉందని వ్యాఖ్యానించారు. పరీక్షల భయంతో ఏదైనా చేసుకుంటే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంత క్షోభిస్తారో గుర్తుంచుకోవాలని అన్నారు. పరీక్షల వంటి చిన్నచిన్న అంశాలను దాటుకుంటూ వెళితే జీవితంలో పెద్దపెద్ద వాటిని సులభంగా ఎదుర్కోవచ్చని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ విఠల్, చైర్మన్ లక్ష్మయ్య, శ్రీధర్, శ్రీనివాస్, బాలకృష్ణారెడ్డి తదితరులు

# ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ వ్యవస్థను తక్షణమే రద్దు చేయాలి

## ప్రభుత్వమే నేరుగా ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

### తెలంగాణ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జెఏసి డిమాండ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు ఏజెన్సీ వ్యవస్థను తక్షణమే రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని తెలంగాణ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర ప్రభుత్వాన్నిడిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ విఠల్ హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔటసోర్సింగ్ ఉద్యోగులకు చట్టబద్ధమైన ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.అలాగే పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. జెఏసి కమిటీ చైర్మన్ లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, దుర్గం శ్రీనివాస్‌లు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్ల సాధనకు ఈ నెల 28న హైదరాబాద్ కేంద్రంగా భిక్షాటన కార్యక్రమం, మార్చి 7న అన్నిజిల్లా కేంద్రాల్లో మానవహారం, మార్చి 14న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా, ఏప్రిల్ 11న చలో ఢిల్లీ ద్వారా రాహుల్‌గాంధీని కలిసి ఏజెన్సీ వ్యవస్థ రద్దుకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో ఏజెన్సీ వ్యవస్థల రద్దు అయ్యేవరకు ఉద్యమం ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో ట్రెజరర్‌లు, సంతోష్‌కుమార్, జగదీష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సురేందర్‌గౌడ్, పద్మ, బాలకృష్ణారెడ్డి, శాంతికుమార్,రాణా సాగర్, సురేష్‌గౌడ్ తదతరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ట్రెజరీస్, అకౌంట్స్ ప్రమోషన్లు

## ఆర్థిక శాఖ నిర్వాకంతో అధికారుల్లో అసంతృప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** రాష్ట్ర ఆర్థిక శాఖ పరిధిలోని ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టరేట్ (డీటీఏ)లో అధికారుల ప్రమోషన్లు ఒక కొలిక్కి వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఐదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న అధికారుల పదోన్నతుల వ్యవహారం ఎటూ తేలడం లేదు. దీంతో ట్రెజరీ, అకౌంట్స్ విభాగం అధికారులు అసంతృప్తి చెందుతున్నారు. డీటీఏ పంపించిన ఫైలులో సవరణలు చేసి పంపించాలంటూ న్యాయ శాఖ సూచించినా, ఆర్థిక శాఖ అధికారులు పదోన్నతుల విషయంలో పాత పద్ధతినే సిఫారసు చేస్తూ ఫైలును రూపొందించారన్న విమర్శలున్నాయి. ఇక జిల్లాల్లో పని చేసే సబ్ ట్రెజరీ ఆఫీసర్‌లు, డైరెక్టరేట్‌లో పని చేసే జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌లకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్), అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేస్తారు. కొన్నింటిని ప్రత్యక్ష ఎంపిక విధానంలో భర్తీ చేస్తారు. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు ఒకే ఒక మల్టీ జోన్(3) ఉండేది. అప్పుడు ట్రెజరీ విభాగానికి చెందిన ఎస్‌టీవోలకు 9, అకౌంట్స్ విభాగానికి చెందిన జేఏవోలకు 5 పోస్టుల అవకాశం కల్పించి పదోన్నతులిస్తూ ఏటీవో, ఏఏవో పోస్టులను భర్తీ చేసేవారు. మిగతా 6 పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేసేవారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో రెండు మల్టీ జోన్లను ఏర్పాటు చేశారు. దీనికి అనుగుణంగా గెజిటెడ్ సర్వీస్ రూల్స్‌ను సవరించి ఒక్కో మల్టీ జోన్‌లో ఎస్‌టీవోలకు 5, జేవోలకు 2, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కింద 3 పోస్టులను ప్రతిపాదించింది. అయినా అధికారుల ప్రమోషన్లు పెండింగ్‌లోనే ఉండిపోయాయి.

# రైతాంగాన్ని శాస్త్రవేత్తలు అగ్రగామిగా నిలపాలి


సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్

## రైతులు, శాస్త్రవేత్తలకు సహాయ సహకారాలు అందిస్తాం

### కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్

### ఐసిఎఆర్-నార్మ్‌లో క్షమత భవన్ ప్రారంభం

**హైదరాబాద్ (అత్తాపూర్), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** రైతులకు అన్ని విధాలు సహాయ సహకారాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని దేశంలో రైతాంగాన్ని శాస్త్రవేత్తలు అగ్రగామిగా నిలపాలని కేంద్ర వ్యవసాయ,రైతు సంక్షేమ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. శనివారం రాజేంద్రనగర్ లోని ఐసిఎఆర్-నార్మ్‌లో నూతనంగా నిర్మించిన క్షమత భవన్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హాజరై ప్రారంభించారు. అనంతరం నార్మ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లా డారు. వ్యవసాయ వ్యాపార నిర్వహణ విద్యార్థులకు సహా వాటాదారులకు మరియు విద్యా కార్యక్రమాలకు అదనపు మౌలిక సదుపాయాలు కల్పించడానికి క్షమత భవన్ ఉపయో పడుతుందని అన్నారు. హైదరాబాద్‌లోని ఐసిఎఆర్ సంస్థ పురోగతి, భవిష్యత్తు ప్రణాళికకు తోడ్పాటునందిస్తామన్నారు. అన్ని ఐసిఎఆర్ సంస్థల ప్రయత్నాలను అభినందిస్తూ, స్వయం సమృద్ధిని సాధించడానికి ముఖ్యంగా నూనెగింజలు, చిరు ధాన్యాలలో రైతులు దృక్కోణం నుండి లాభదా యకతను పెంచడానికి రోడుమ్యాప్‌లను అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. శాస్త్రవేత్తలు రైతులకు ఉపయోగపడే ఆవిష్కరణలను సృష్టిస్తూ దేశాన్ని అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. రైతులు,శాస్త్రవేత్తలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ముందుగా డెర్ కార్యదర్శి ,ఐసిఎఆర్ డైరెక్టర్ జనరల్ డా.మంగి లాల్ జాట్ శాస్త్రవేత్తలతో సంభాషించారు. వ్యవసాయంలో శాస్త్రీయ పరిశోధన కోసం ఆలోచనలు,వనరులను అన్వయించడం పట్ల అసాధారణ ఆలోచనలను కలిగి ఉండాలన్నారు. డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. జాయ్ కృష్ణ జైనా, ఐసిఎఆర్-నార్‌నమ డైరెక్టర్ డా.గోపాల్‌లాల్ పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు. నార్మ్ సామర్థ్య నిర్మాణ కార్యక్రమాల గురించి మంత్రికి వివరించారు.

# చంచల్‌గూడ జైలు నుంచి ఉగ్రకుట్రలపై ప్రచారం అసత్యం

## జైళ్ల శాఖ డిఐజి శ్రీనివాస్ వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైల్లో వున్న పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు ఇక్కడి నుంచి దేశ వ్యాప్తంగా పలు చోట్ల పేలుళ్లకు పాల్పడేందుకు కుట్రలు పన్నినట్లు రెండు రోజులుగా సోషల్ మీడియాతో పాటు కొన్ని ఛానళ్లలో వచ్చిన వార్తలు పూర్తిగా నిరాధారమని జైళ్ల శాఖ డిఐజి శ్రీనివాస్ తెలిపారు. ఈ విషయమై కేంద్ర నిఘా వర్గాలు రాష్ట్రాన్ని అప్రమ త్తం చేసినట్లు జరుగుతున్న ప్రచారంలో కూడా నిజం కాదని, ఇవన్నీ వదంతులేనని ఆయన వెల్లడించారు. శనివారం ఆయన చంచల్‌గూడ జైలు పరిపాలన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ చంచల్‌గూడ జైల్లో ఉగ్రవాదులతో పాటు నేరగాళ్లు ఎలాంటి కుట్రలు చేసేందుకు ఆస్కారం ఉండదని, ఇక్కడ అంతా కట్టుదిట్టమైన భద్రత ఉంటుందని అన్నారు.
ఉగ్రవాదులతో పాటు నేరగాళ్లకు ములాఖత్‌లు ఇవ్వడం అనేది ఒక పద్ధతి ప్రకారం జరుగుతుందని, ఇదంతా నిబంధనల మేరకు ఉంటుందని, ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు ఉండవని ఆయన స్పష్టం చేశారు. జాతీయ భద్రతకు సంబంధించిన అం శాలపై ఈ తరహా వార్తలు రావడం సరైంది కాదని ఆయన అన్నారు. ఈ తరహా వార్తలను ప్రసారం చేసేముందు నిజానిజాలు ధ్రువీకరించుకోవాలని ఆయన కోరారు. చంచల్‌గూడ జైల్లో ఉగ్రవాదులు ములాఖత్‌ల సమయంలో మరి కొందరితో మాట్లాడి కుట్రలకు తెరలేపారని ప్రముఖ ఛానళ్లలో కూడా రావడం బాధాకరమని ఆయన తెలిపారు. చంచల్‌గూడ జైల్లో లష్కర్ ఏ తోయిబాకు చెందిన ఉగ్రవాది ఒక్కడే వున్నాడని, అతనికి కూడా భార్యతో తప్ప ఎవరితోనూ ములాఖత్ ఇవ్వలేదని డిఐజి పేర్కొన్నారు. చంచల్‌గూడ జైలుతోపాటు ఇతర జైళ్లలోనూ ఖైదీలు, రిమాండు ఖైదీల విషయంలో కచ్చితమైన నిబంధనలు అమలు చేస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జైళ్ల శాఖ అధికారులు పలువురు పాల్గొన్నారు.

## మాజీ ఎంపి బోయినపల్లి డిమాండ్

# ప్రాణాలను హరిస్తున్న పారాక్వాట్ డిక్లోరైడ్ గడ్డి మందును నిషేధించాలి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:** మనుషుల ప్రాణాలను హరిస్తున్న పారాక్వాట్ డిక్లోరైడ్ గడ్డిమందు వాడకుండా నిషేధం విధించేందుకు ప్రభుత్వం ఆలోచన చేయాలని మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రతినెలా ఈ మందు తాగి పదుల సంఖ్యలో కరీంనగర్, వరంగల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరి మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉందని అన్నారు. ఈ మందుకు విరుగుడు మందు లేకపోవడం వల్ల తాగిన వ్యక్తులు చనిపోతున్నారని పేర్కొన్నారు. పారాక్వాట్ డిక్లోరైడ్ వాడకాన్ని ఒడిశా ప్రభుత్వం ప్రతి ఆరు నెలలపాటు నిషేధిస్తూ వస్తోందని, ప్రపంచంలో 70 దేశాలు ఈ గడ్డి మందును నిషేధించాయని వెల్లడించారు. పారాక్వాట్ డిక్లోరైడ్‌ను నిషేధించాలని సిఎం రేవంత్‌రెడ్డి, వ్యవ సాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సిఎస్ రామకృష్ణారావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరామ్‌రెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కిషన్‌కు లేఖ రాశారని వివరించారు.

**పొలాలకు వాడాక గడ్డి మందును దాచుకోవద్దు : డాక్టర్ మహేష్‌రెడ్డి**

తెలుగు రాష్ట్రాల్లో పారాక్వాట్ డిక్లోరైడ్ గడ్డి మందుతాగి ఎక్కువ మంది చనిపోతు న్నారని డాక్టర్ మర్రి మహేష్‌రెడ్డి వెల్లడించారు. ఈ గడ్డిమందు వాడకంపై గ్రామాల్లో తిరిగి ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నామని, దీనిని నిషేధించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని పేర్కొన్నారు. ఎండోసల్ఫాన్ అనే మందును ఇండి యాలో బ్యాన్ చేసినట్లుగానే పారాక్వాట్ డిక్లోరైడ్ గడ్డిమందు తాగి బ్రతికేవాళ్లు సైతం సైడ్‌ఎఫెక్ట్స్‌తో చనిపోతున్నారని వివరించారు. పారాక్వాట్ డిక్లోరైడ్ గడ్డి మందును వాడిన తర్వాత మిగిలిన మందును రైతులు దాచుకోవద్దని సూచించారు.

# కూరగాయల పంటల సాగుకు మొగ్గు చూపాలి

## రైతులకు ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా సూచన

**హైదరాబాద్ (అత్తాపూర్) ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కూరగాయల కొరత 50 శాతంపైగానే ఉందని అందుకే ఇతర రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు నుంచి పలురకాల కూరగాయలు దిగుమతి చేసుకుంటున్నామని దీన్ని అధిగమించేందుకు రైతులు కాయగూరల సాగు చేయాలని, తద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చునని ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. రాజేంద్ర నగర్‌లోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం వేదికగా జరుగుతున్న కూరగాయల పంటలపై అఖిల భారత సమన్వయ పథకం 44వ వార్షిక సమావేశం రెండోరోజు కార్యక్రమానికి చైర్‌పర్సన్‌గా హాజరైన ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మాట్లాడారు. కూరగాయ పంటల్లో ఉత్పత్తి పెంచేందుకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూక్ష్మ సేద్య పరికరాలు, మిషనరీ సబ్సిడీపై అందిస్తామని, అధిక దిగుబడినిచ్చే రకాలు సిఫార్సు చేస్తామని అన్నారు. మిగతా పంటలతో పోలిస్తే కూరగాయల పంటలు తక్కువ కాలంలో దిగుబడి సాధ్యమని తద్వారా మేలైన ధరతో సాగు రైతులకు గిట్టుబాటు అవుతుందని అన్నారు. అధిక వేడిని తట్టుకునే రకాలు, ముడత రోగం తట్టుకునే రకాలు, వైరస్‌ను తట్టుకునే రకాలు, ఎండు తెగులు తట్టుకోవడంతో పాటు అధిక నాణ్యత కలిగిన రకాలు రాష్ట్రంలో సాగుకు అవసరమని ఆమె అన్నారు. సాధ్యమైనంత ఎక్కువ రైతు క్షేత్రాల్లో నూతన రకాలు, ఉత్తమ పద్ధతులను ప్రదర్శించి రైతులకు అందజేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన వర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి, ఐసిఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుధాకర్ పాండే, వారణాసిలోని భారతీయ కూరగాయల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ రాజేష్ కుమార్, బెంగళూరులోని ఐహెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ టికె బెహరా, అని ఎన్‌బిపిజిఆర్ డైరెక్టర్ డాక్టర్ జిపి సింగ్, మాజీ వైస్‌ఛాన్సలర్, ఎన్ఐఆర్‌సిఎ రాజమండ్రి డైరెక్టర్ డాక్టర్ శేషు మాధవ్, పరిశోధన సంచాలకులు లక్ష్మీ ్మ నారా యణ, లోకల్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ అనిత కుమారి, డాక్టర్ చీనా, డాక్టర్ పి ప్రశాంత్, దేశవ్యాప్తంగా కూరగాయల్లో పరిశోధన చేస్తున్న 300 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి, తదితరులు

# వారం రోజులు పత్తి కొనుగోళ్లు పొడిగింపు

**ఇప్పటికే ముగిసినట్లు ప్రకటించిన కాటన్ కార్పొరేషన్**

**ఇప్పటి వరకూ 15.60 లక్షల టన్నుల సేకరణ**

**ప్రైవేటుగా మరో 4.30 లక్షల టన్నులు కొనుగోలు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పత్తి రైతులకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తీపి కబురు చెప్పింది. ఈ నెలాఖరు వరకు పత్తిని కొనుగోళ్లు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రైతుల వద్ద నిలువ ఉన్న, లేట్ క్రాఫ్ ద్వారా సేకరిస్తున్న పత్తి కొనుగోళ్లను పొడిగించింది. వాస్తవంగా శనివారంతో పత్తి కొనుగోలు కేంద్రాలను సీసీఐ పూర్తిగా మూసివేసింది. అయిత రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు పత్తి కొనుగోళ్లను ఈ నెల 28వ తేదీ వరకూ పొడిగిస్తూ సీసీఐ తాజాగా నిర్ణయం తీసుకుంది.
కాగా రాష్ట్రంలో గత వానాకాలం సీజనుకు సంబంధించి 45.32 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ప్రభుత్వం 28.29 లక్షల టన్నులు ఉత్పత్తి అవుతుందని అంచనా వేసింది. పత్తి దిగుబడిలో 1.40 లక్షల టన్నులతో ఆదిలాబాద్ జిల్లా అగ్రస్థానంలో ఉండగా, తర్వాత నల్లగొండ 1.38 లక్షల టన్నులు, వరంగల్ 1.21 లక్షల టన్నులతో వరుస స్థానాల్లో నిలిచాయి. పత్తి మద్దతు ధరను కేంద్రం రూ. 8,110 ప్రకటించింది.
దీని నిమిత్తం గత ఏడాది అక్టోబర్ నుంచి రాష్ట్రంలో 336 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దాదాపు మూడు నెలలకు పైగా సీసీఐ కొనుగోళ్లు జరిపింది. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో రైతు నుంచి ఏడు క్వింటాళ్ల చొప్పున మొత్తం మీద 8.39 లక్షల మంది రైతుల వద్ద నుండి దాదాపు 15.60 లక్షల టన్నుల మేర పత్తిని కొనుగోలు చేసింది. సీసీఐ కొనుగోలు చేసిన ఈ పత్తి విలువ రూ.12,313 కోట్లుగా ఉంది. వాస్తవానికి రాష్ట్రంలో సీజన్ ఆరంభం నుంచి సీసీఐ తేమ పేరిట కోతలు విధించి ఇబ్బందులకు గురి చేసిందనే అసంతృప్తి రైతుల్లో ఉంది. మద్దతు ధర మొదట్లో రూ. 8,110 ఉండగా, సీసీఐ కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభించకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకు పలువురు రైతులు తెగనమ్ముకున్నారు. తేమ పేరుతో కోత విధించడంతో చాలా మందికి మద్దతు ధర లభించలేదు. ఇక ఆలస్యంగా సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన తదుపరి కిసాన్ కపాస్ యాప్‌తో ఇబ్బందులు పడిన రైతులు తమ పత్తిని తక్కువ ధరలకు ప్రైవేటు వ్యాపారులకు తెగనమ్ముకున్నారు. కొత్తగా తీసుకొచ్చిన యాప్‌తో స్లాట్ బుకింగ్‌లో తీవ్ర జాప్యం జరిగింది. అలాగే ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయడంతో ప్రభుత్వ కేంద్రాల వైపు రావడానికి రైతులు అంతగా ఆసక్తి చూపకుండా వ్యాపారులు, దళారులను ఆశ్రయించారు. ఇదే అదునుగా భావించి వారు తేమ పేరుతో మద్దతు ధరలో కోత పెట్టి రైతులను దోపిడీ చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఈ విధంగా ప్రైవేటు వ్యాపారులు రాష్ట్రంలోని రైతుల వద్ద నుండి సుమారు 4.30 లక్షల టన్నుల వరకు కొనుగోలు చేశారని అంచనా. దీనికి తగినట్లుగా ఏటా మార్చి వరకు కొనుగోలు చేసే సీసీఐ అధికారులు ఈసారి ముందుగానే కేంద్రాలను మూసివేసేందుకు నిర్ణయించుకోవడంతో రైతాంగంలో ఆందోళన వ్యక్తమైంది. ఈ క్రమంలో సీసీఐ తాజాగా కనుగోళ్లు పొడిగించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సిటీ పోలీసు విభాగంలో కొత్త అధ్యాయం

## డిగ్రీ, పిజి విద్యార్థులకు పోలీసింగ్‌లో ఇంటర్న్‌షిప్

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** హైదరాబాద్ సిటీ పోలీసు విభాగంలో మరో కొత్త అధ్యాయం మొదలయ్యింది. యువతకు పోలీసు శాఖతో పాటు ప్రభుత్వ పరిపాలన గురించి అవగాహన కలిగించేందుకు ఇంటర్న్‌షిప్ ఇవ్వాలని నగర పోలీసు విభాగం నిర్ణయించింది. ఈ మేరకు కొత్వాల్ సజ్జనార్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. 25 ఏళ్ల లోపు వయస్సు కలిగి డిగ్రీ లేదా పిజి చదువుతున్న వారు ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవ చ్చు. ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన వారికి పోలీసు శాఖ ప్రాధాన్యతలకు అనుగుణంగా డేటా అనాలసిస్, పరిశోధన ఆధారిత ప్రాజెక్టులు, నిర్దిష్ట విధుల ను కేటాయిస్తారు. దీనివల్ల విద్యార్థులకు ప్రభుత్వ పరిపాలన, పోలీసింగ్ వ్యవస్థపై ఆచరణాత్మక అవగాహన లభిస్తుందని పోలీసు శాఖ భావిస్తోంది. కాగా ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తు చేయాల్సిన వారు ఆన్‌లైన్‌లో సిటీ పోలీసు వెబ్‌సైట్ ద్వారా చేయాల్సి వుంటుంది. కాగా ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన వారికి సర్టిఫికేట్ ఇస్తారు. ఇంటర్న్‌షిప్‌ను సిటీ కొత్వాల్ సజ్జనార్ స్వయంగా పర్యవేక్షిస్తారు. దీనికి సంబంధించిన ఇతర వివరాలను హైదరాబాద్ సిటీ పోలీసు వెబ్‌సైట్‌లో చూడాలని పోలీసు శాఖ కోరింది.

# ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కామారెడ్డిలో కాటిపల్లి వెంకట రమణారెడ్డి క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో చర్చకు స్థానం ఉండాలి గానీ, హింసకు తావులేదన్నారు. కాంగ్రెస్ నాయకుల రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఈ విధమైన అల్లర్లకు పాల్పడటం అత్యంత దుర్మార్గం అన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సి న బాధ్యత ప్రభుత్వానిదేనని, కామారెడ్డిలో ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే బిజెపి సహించదని హెచ్చరించారు. ఇలాంటి రాజకీయ హింసాత్మక చర్యలకు ప్రజాస్వామ్యంలో ఏమాత్రం స్థానం లేదు. మా పార్టీ కార్యకర్తలకు అండగా నిలవడం కోసం, అలాగే పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి నిజాలు ప్రజల ముందుకు తీసుకురావడం కోసం నేను స్వయంగా సంఘటన స్థలాన్ని సందర్శిస్తానని, హింసను ప్రోత్స హించే రాజకీయాలను భారతీయ జనతా పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదనన్నారు.

# ప్రజాప్రతినిధి ఇంటిపై దాడికి యత్నించడం కాంగ్రెస్ అహంకారం, దుర్మార్గానికి పరాకాష్ట

## వెంకటరమణారెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన డికె అరుణ


**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి యత్నించడాన్ని ఎంపి డికె అరుణ తీవ్రంగా ఖండించారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డితో ఎంపి డికె అరుణ ఫోన్‌లో మాట్లాడారు. ప్రజాప్రతినిధి ఇంటిపై దాడికి యత్నించడం అధికార కాంగ్రెస్ అహంకారం, దుర్మార్గపు చర్యకు నిదర్శనం అన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని, అసత్య ఆరోపణలతో బురద జల్లే ప్రయత్నం చేసి, పారిపోవడం కాదు, ఆధారాలతో చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాల్ చేశారన్నారు. సవాల్ స్వీకరించలేక, ఎమ్మెల్యే ఇంటి పైకి రౌడీలను పురమాయించడం కాంగ్రెస్ ప్రతీకార రాజకీయానికి అద్దంపడుతుంది. శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా అధికార కాంగ్రెస్ దుందుడుకుగా వ్యవహరిస్తుంది. కామారెడ్డిలో కెసిఆర్,రేవంత్ రెడ్డిలను ఓడించడాన్ని జీర్ణించుకోలేక మొన్నటి మున్సిపాలిటీ ఎన్నికల్లో బిజెపిని ఒంటరిగా ఎదుర్కోలేక, కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు ఏకమై కక్షా రాజకీయం చేస్తున్నాయన్నారు.

# ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల ఫీజులను పెంచొద్దు

## పేద విద్యార్థులను ఉన్నతవిద్యకు దూరం చేయొద్దు

### ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజులను పెంచొద్దని అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబివిపి) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో టిఏఎఫ్ఆర్‌సి ప్రతిపాదించిన ఫీజుల పెంపును ప్రభుత్వం నిలిపివేయాలన్నారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫీజుల పెంపును ప్రతిపాదిస్తూ ఏఎఫ్ఆర్‌సీ ప్రభుత్వానికి నివేదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇంజనీరింగ్ కాలేజీల ఫీజుల పెంపు వల్ల పేద విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యకు దూరం అవుతారని, ఏఎఫ్ఆర్‌సి ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 19 ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజులను తగ్గించడాన్ని ఏబివిపి స్వాగతిస్తున్నదని, కానీ 63 కళాశాలల్లో ఏ ప్రతిపాదికన భారీగా ఫీజుల పెంపును ప్రతిపాదించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, ఆ కారణంగా విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారని, కనీసం సర్టిఫికెట్స్ తీసుకోలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో విద్యార్థులున్నారని విద్యార్థి సంఘాలుగా తాము డిమాండ్ చేసినప్పుడు, అదేవిధంగా రీయింబర్స్ బకాయిలు విడుదల చేయాలని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు బంద్ కు పిలుపునిచ్చినప్పుడు ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రైవేట్ కళాశాలల ఫీజులు చూస్తే కళ్ళు బైర్లు కమ్ముతున్నాయని, అవి దోచుకుంటున్నాయని, ఇంతింత ఫీజులు ఎక్కడైనా ఉంటాయా అని చిలుక పలుకులు పలికి విజిలెన్స్ ఎంక్వైరీకి ఆదేశించారని గుర్తు చేశారు. విజిలెన్స్ ఎంక్వైరీలో కళాశాలలకు ముఖ్యమంత్రికి నడిచిన రహస్య ఒప్పందంతోనే ఈ ఫీజుల పెంపు నిర్ణయానికి వచ్చినట్లు ఏబివిపి భావిస్తుందన్నారు.




# వనస్థలిపురం, కోకాపేట్‌లో జోయాలుక్కాస్ షోరూమ్స్ ప్రారంభం

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఆభరణాల వ్యాపారి జోయాలుక్కాస్ తెలంగాణలో మరోచోట్ల తమ బ్రాంచీలను ప్రారంభించింది. శనివారం వనస్థలిపురంతోపాటు, కోకాపేటలో జోయా లుక్కాస్ షోరూమ్‌లను ప్రారంభించింది. హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో తన కొత్త షోరూమ్‌ను జోయాలుక్కాస్ ప్రారంభించింది. ఈ షోరూమ్‌ను ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ (టిఎస్‌ఆర్‌డిసి) చైర్మన్ మల్‌రెడ్డి రామ్ రెడ్డి, జోయాలుక్కాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ బొమ్మిడి యాది రెడ్డి, బొమ్మిడి రంగారెడ్డి, థామస్ మాథ్యూ, జోయాలుక్కాస్ సీవోవో హెన్రీ జార్జ్, జోయాలుక్కాస్ రిటైల్ హెడ్ రాజేష్ కృష్ణన్ సమక్షంలో ప్రారంభించారు.

**కోకాపేటలో..**

ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఆభరణాల వ్యాపారి జోయాలుక్కాస్ తెలంగాణలోని కోకాపేటలో తన కొత్త షోరూమ్‌ను ప్రారంభించింది. ఈ షోరూమ్‌ను లోక్‌సభ ఎంపీ, విప్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. వంశీరామ్ బిల్డర్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బి.సుబ్బారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జోయాలుక్కాస్ థామస్ మాథ్యూ, జోయాలుక్కాస్ సీవోవో హెన్రీ జార్జ్, జోయాలుక్కాస్ హెడ్‌రిటైల్ రాజేష్ కృష్ణన్ సమక్షంలో ప్రారంభించారు.

# మార్చి 4వ వారంలో విద్యుత్ సంస్థల కార్యాలయాల బిసి కమిషన్ సందర్శన

## నియామకాల్లో రిజర్వేషన్ల ఉల్లంఘనపై విచారణ

### తెలంగాణ బిసి కమిషన్ మీటింగ్‌లో నిర్ణయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మార్చి 4వ వారంలో విద్యుత్ సంస్థల కార్యాలయాలను తెలంగాణ బిసి కమిషన్ సందర్శించనుంది. సంస్థల నియామకాల్లో రిజర్వేషన్ల ఉల్లంఘనలపై విచారణ చేపట్టనుంది. తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ సమావేశం శనివారం ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, కమిషన్ మెంబర్ సెక్రెటరీ బాల మాయ దేవి పాల్గొన్నారు. సమావేశంలో కమిషన్ వివిధ అంశాలపై చర్చించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ సంస్థల నియామకాలలో రిజర్వేషన్ల ఉల్లంఘన జరుగుతుందని తెలంగాణ విద్యుత్ బిసి ఉద్యోగుల సంఘం కమిషన్ దష్టికి తీసుకువచ్చిన అంశంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించింది. అందులో భాగంగా మార్చి 4వ వారంలో విద్యుత్ సంస్థల కార్యాలయాలను సందర్శించి నియామకాలపై విచారణ నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. అలాగే రాష్ట్రంలోని విద్యార్థుల వివరాల సేకరణ వేగవంతం చేయాలని కమిషన్ అధికారులకు సూచించింది. సమావేశంలో అధికారులు డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్ పాల్గొన్నారు.

# ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా మణికంఠరెడ్డి, కార్యదర్శిగా పుట్టా లక్ష్మణ్ ఎన్నిక

### నిజామాబాద్‌లో రాష్ట్ర 4వ మహాసభలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడిగా కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా పుట్ట లక్ష్మణ్ ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు నిజామాబాద్‌లో ఈ నెల 18 నుంచి 20 వరకు జరిగాయి. ఎఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు విజయవంతంగా ముగిసాయని, ఈ మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుండి 400 విద్యార్థి ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభల్లో విద్యారంగ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేయడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు అశోక్ స్టాలిన్ తెలిపారు. మహాసభల్లో నూతనంగా రాష్ట్ర అధ్యక్షుడిగా కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా పుట్ట లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా రెహమాన్, గ్యార క్రాంతి, సోతుకు ప్రవీణ్, బాలసాని లెనిన్, సహాయ కార్యదర్శులుగా ఇటికాల రామకృష్ణ, బానోతు రఘురాం, గ్యార నరేష్, చిట్యాల రాజు, కోశాధికారిగా కాసోజు నాగజ్యోతితోపాటు నూతన కౌన్సిల్ సభ్యులుగా 69, ఆహ్వానితులుగా నలుగురితో కలిపి 73 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు.

# లిక్కర్ స్కాం కేసు వాసుదేవరెడ్డి అరెస్టు

**విజయవాడ, ఫిబ్రవరి 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. అక్టోబర్ 2019 నుంచి మార్చి 2024 మధ్య కాలంలో జరిగిన సుమారు రూ. 3,570.87 కోట్ల లిక్కర్ స్కామ్‌లో ప్రధాన కుట్రదారుల్లో ఒకరైన ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డిని (ఏ2) దర్యాప్తు అధికారులు అరెస్టు చేశారు. వాసు దేవ రెడ్డికి గతంలోనే ముందస్తు బెయిల్ పిటిషన్ ఇచ్చేందుకు ఏసీబీ కోర్టు నిరాకరించిన వేళ సిట్ అధికారులు ఆయన్ను అరెస్టు చేశారు. విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరుపరచగా ఈ నెల 27 వరకు రిమాండ్ విధించింది. మద్యం కేసులో వాసుదేవరెడ్డితోపాటు ఎక్సైజ్ శాఖ మాజీ ప్రత్యేకాధికారి దొడ్డా వెంకట సత్యప్రసాద్‌ది కీలక పాత్రని, వారి కేంద్రంగానే కుంభకోణం జరిగిందని విజయవాడ ఏసీబీ కోర్టు గతంలో స్పష్టం చేసింది. మొత్తం కుంభకోణం శరీరం అయితే వారిద్దరూ తలలాంటి వారిని తెలిపింది. తల తీసేస్తే, శరీరం కుప్పకూలుతుందని వాసుదేవరెడ్డికి బెయిల్ పిటిషన్ తిరస్కరణ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. ముడుపులిచ్చిన కంపెనీలకే మద్యం ఆర్డర్లు కట్టబెట్టడంలో వాసుదేవరెడ్డి కీలక పాత్ర పోషించారు. గతంలోనే ఆయన ఇల్లు, కార్యాలయాల్లో సిట్ అధికారులు సోదాలు చేశారు. ఎప్పుడైనా అరెస్టు చేస్తారనే అనుమానంతో వాసుదేవరెడ్డి బెయిల్ కోసం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి, విజయవాడలోని ఏసీబీ కోర్టుతోపాటు హైకోర్టు కూడా వాసుదేవరెడ్డికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించాయి. జగన్ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్న కంపెనీలు, డిస్టిలరీల నుంచి ముడుపుల సొమ్ము వసూలు చేసి భారీ కుంభకోణానికి తెరలేపిన సంగతి తెలిసిందే. అందుకు వైఎస్సార్సీపీ ముఠా అనేక మార్గాలు అనుసరించినట్లు గతంలో ఈడీ గుర్తించింది. ఏపీఎస్‌బీసీఎల్ నుంచి డిస్టిలరీల ఖాతాల్లోకి సొమ్ము జమకాగానే ఆయా సంస్థల యజమానులు అందులో 12శాతాన్ని నగదు రూపంలోకి మార్చి వైఎస్సార్సీపీ ముఠాకు అందజేసే వారు. దీని కోసం డిస్టిలరీల యజమానులు బంగారు దుకాణాలు, డొల్ల కంపెనీలు, ప్యాకేజింగ్ సంస్థల ఖాతాల్లోకి నిధులు మళ్లించి వైట్ నుంచి బ్లాక్‌లోకి మార్చినట్లుగా ఈడీ గుర్తించింది.

# వెనుకబడిన సుగంధ ద్రవ్యాల సాగు

## రాష్ట్రంలో మసాలా దినుసుల కొరత

### చింతపండు సైతం దిగుమతే గతి

### ఉద్యాన అధికారుల నిర్లక్ష్యం

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** సుగంధ ద్రవ్యాల సాగులో తెలంగాణ వెనుకబడిపోయింది. ఉద్యాన శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో సుగంధ ద్రవ్యాల సాగుపై రైతులు ముందుకు రావడం లేదు. దీంతో రాష్ట్రంలో ప్రధానంగా చింతపండు, అల్లం, వెల్లుల్లి, ధనియాలు, జీలకర్ర తదితర మసాలా దినుసులకు కొరత ఏర్పడింది. ఎండు మిర్చి, పసుపు సాగులో మాత్రం రాష్ట్రం అగ్రగామిగా ఉన్నా, చివరకు చింత పండును సైతం దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి తప్పడం లేదు. రాష్ట్రంలో ప్రతి రోజు సగటున ఒక్కొక్కరు 21.21 గ్రాముల సుగంధ ద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు ఉద్యాన అధికారుల అంచనా. ఇలా రోజుకు 731 టన్నులు డిమాండ్ ఉండగా, ఏటా 2.63 లక్షల టన్నులు అవసరం ఉంటుందని అంచనా. చింతపండు, అల్లం, వెల్లుల్లి, ధనియాలు, జీలకర్ర, ఆవాలు, మిరియాలు తదితర సుగంధ ద్రవ్యాలు 1.78 లక్షల టన్నులు అవసరం ఉన్నది. ఈ డిమాండ్‌కు సరిపడా పంట రావాలంటే రాష్ట్రంలో 1.09 లక్షల ఎకరాల్లో ఈ పంటలు సాగుచేయాల్సి ఉంటుందని అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, జాపత్రి, జీలకర్ర వంటి విలువైన సుగంధ ద్రవ్యాలను ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. కానీ చింతపండు, అల్లం, వెల్లుల్లి, ధనియాల వంటివాటిని కూడా దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. ఈ విధంగా ఏటా 61,564 టన్నుల చింతపండును దిగుమతి చేసుకుంటున్నారు. అలాగే రాష్ట్రంలో అల్లం 2,103 ఎకరాల్లో సాగవుతూ తద్వారా 20,489 టన్నుల ఉత్పత్తి అవుతోంది. అయితే అల్లం వినియోగం మాత్రం 68,419 టన్నులుగా ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో సాగైనది పోను ఇంకా 47,930 టన్నుల మేర ఇతర రాష్ట్రాల నుంచి వస్తోంది. ఇక వెల్లుల్లి విషయానికి వస్తే 27 ఎకరాల్లో మాత్రమే సాగవుతూ, 148 టన్నులు ఉత్పత్తి అవుతుండగా, వినియోగం మాత్రం 39,417 టన్నుల మేర ఉంటోంది. ధనియాలు రాష్ట్రం వ్యాప్తంగా 13,532 టన్నుల వినియోగం ఉండగా, 4,971 ఎకరాల్లో మాత్రమే సాగవుతోంది. తద్వారా 2,431 టన్నులు ఉత్పత్తి జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో సుగంధ ద్రవ్యాల సాగు చేయాల్సిన అవసరం ఉందని అంచనా. ఇందుకు ఉద్యాన శాఖ అధికారులు ప్రోత్సహం కల్పించి సుగంధ ద్రవ్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఖమేనీ, ముర్తజాల హత్యకు అమెరికా వ్యూహం




**టెహ్రాన్, ఫిబ్రవరి 21:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతూనే ఉన్నాయి. అమెరికా మిలిటరీ కార్యకలాపాలు ఇరాన్‌కు సమీపంలో పెరిగాయి. కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో యూఎస్ ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్లు అనుమతి కోసం వేచిచూస్తున్నాయి. అత్యాధునిక విమానాలు మిడిల్ ఈస్ట్‌కు చేరాయి. మరోవైపు, ఇరాన్ రష్యాలు కలిసి హార్మోజ్ జలసంధిలో యుద్ధ విన్యాసాలు ప్రారంభించాయి. కీలక లక్ష్యాలపైకి మిస్సైల్స్ ప్రయోగించింది. ఇదిలా ఉంటే, ఇరాన్ సుప్రీంలీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ, ఆయన కుమారుడు మోజ్తాబా ఖమేనీని లక్ష్యంగా చేసుకుని హతమార్చేందుకు అమెరికా ప్లాన్ చేసినట్లు తెలిసింది. ఈ సైనిక ఆప్షన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు ఉంచినట్లు ఆక్సియోస్ నివేదిక తెలిపింది. మొజ్తాబాను సుప్రీంలీడర్ వారసుడిగా అంతా భావిస్తున్నారు. ఇరాన్ అగ్రనేతలతో పాటు కీలకమైన ముల్లాలను అంతమొందించేలా రక్షణ శాఖ పలు ఆప్షన్లను ట్రంప్ ముందు ఉంచింది. దీనిపై ట్రంప్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ట్రంప్ నిర్ణయం తీసుకుంటే ఇరాన్‌పై అమెరికా దాడులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అధ్యక్షుడు ఎప్పుడు నిర్ణయం తీసుకుంటారనే దానిపై స్పష్టత లేదని పెంటగాన్ వర్గాలు చెబుతున్నాయి. ఓ వైపు ఇరాన్‌తో అణు చర్చలు జరుపుతూనే అమెరికా సైనికంగా ఆ దేశంపై ఒత్తిడి తీసుకువస్తోంది. ప్రస్తుతం ఇరాన్ చుట్టు పక్కల 13 యుద్ధ నౌకల్ని అమెరికా మోహరించింది. ఇందులో అబ్రహం లింకన్, మరో శక్తివంతమైన గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ వంటి నౌకలున్నాయి. ముందు వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో ఆయన భార్యను అదుపులోకి తీసుకున్న తరహాలోనే వ్యూహాన్ని అమలుచేయాలని భావించినాట్రంప్‌నుంచి ఎటువంటి సంకేతాలు రాకపోవడంతో అమెరికా రక్షణ దళాలు వేచిచూ స్తున్నాయి. అయితే హార్మోజ్ జలసంధిని తాత్కాలికంగా మూసివేసి అక్కడినుంచి క్షిపణి కసరత్తులుచేయడాన్ని అమెరికా సీరియస్‌గా భావిస్తోంది. దీనికితోడు రష్యాతోకలిసి ఇరాన్ సంయుక్త విన్యాసాలకు దిగడం కూడా అమెరికాకు సుతరాము నచ్చలేదు. ఇప్పటికే అక్కడ మకాం వేసి ఉన్న యుద్ధనౌకలు, యుద్ధవిమానాలతో ముందు పరిమితస్థాయిలో అయినా దాడిచేయాలనినిర్ణయించిన అమెరికా ట్రంప్ నుంచి వచ్చే సంకేతాలకోసం ఎదుచూస్తోంది.

# విమాన ప్రయాణికుల భద్రతకు ఎఐ కమాండ్ కంట్రోల్ సెంటర్

## విమానరంగ విస్తృతికి అత్యాధునిక సేవలు

## తిరుమలలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



**తిరుమల,ఫిబ్రవరి21ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ ప్రసిద్ధిగాంచిన హిందూ ధార్మికసంస్థ తిరువ ులలో భక్తుల రద్దీ, సౌకర్యాలపై ఎప్పటి కప్పుడు సమాచారం తెలుసుకునేందుకు అమలు చేస్తున్న ఎఐ అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరు బావుందని కేంద్రవిమాన యానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు అభి నందించారు. ఇదే విధానం త్వరలోనే దేశ వ్యాప్తంగా సివిల్ ఏవియేషన్ రంగం లోనూ ఎఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ విధానం వద్ద విమా నరంగం సేవలు మరింత విస్తృతం చేయడమతో బాటు ప్రయాణీకుల భద్రత, విమానసేవలు మెరు గుపడుతాయన్నారు. దేశంలో రోజురోజుకూ ఏవి యేషన్ సేవలు పెరుగుతున్నాయని, అందుకు తగ్గట్లు భద్రత కూడా ప్రధానమని కేంద్రమంత్రి తెలిపారు. 2014లో దేశంలో 74 విమానాశ్ర యాలు మాత్రమే ఉండగా 2025కి 165కి పెరి గాయని రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. రాబోయే 20 సంవత్సరాల్లో ఏటా పదిశాతం వృద్ధి చెంది ఈ రంగం మరింత ఊపం దుకుం టుందని ఆయన ఆశాభావం వెలిబుచ్చారు. మారు తున్న కాలానికి తోడు పెరుగుతున్న భక్తుల రద్దీని గమనిస్తూ టిటిడి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఎఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుచేసుకోవడం అద్భు తమన్నారు. త్వరలోనే ఈ సాంకేతికత మోడల్‌పై పూర్తి అధ్యయనంచేసి సివిల్ ఏవియేషన్ రంగంలో కూడా ఇటువంటి అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటుచేస్తామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలో సివిల్ ఏవియేషన్ రంగం వేగంగా అభివృద్ధి చెం దుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు పాలనలో టిటిడిలో మరింత సాంకే తికత అభివృద్ధిచేయడం జరిగిందన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు, త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించడం వంటివి అద్భుతమని ఆయన కితాబిచ్చారు. టిటిడి కల్పిస్తున్న అత్యుత్తమ సౌకర్యాలు, సేవలపై, నాణ్యతపై భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని కేంద్రమంత్రి రామ్మోహన్ తెలిపారు. శనివారం ఉదయం మాజీ ఎంపి గల్లా జయదేవ్,ఎమ్మెల్యే గుమ్మనూరు జయ రాంతో కలసి రామ్మోహన్ నాయుడు శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. టిటిడి అదనపు ఇఒ చిరు మామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం,అర్చకులు స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తం భానికి నమస్కరించిన కేంద్రమంత్రి ఆలయం లోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పటిష్ట పర్యవేక్షణ

## క్రమం తప్పకుండా తనిఖీలు

## జిల్లా అధికారులకు లిఖితపూర్వక సూచనలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమం, భద్రతపై తెలంగాణ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ గురుకులాల్లో కట్టుదిట్టమైన పర్యవేక్షణకు ఆదేశాలు జారీ చేసింది. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించేందుకు నోడల్ అధికారుల నియామకం, డిటైల్డ్ ఎంక్వైరీ క్యాలెండర్ తయారీ, ఆకస్మిక సందర్శనలు తప్పనిసరి చేస్తూ జిల్లా అధికారులకు లిఖితపూర్వక సూచనలు పంపింది. గురుకుల విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన వసతులు కల్పించడం, ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే వాటిని వేగంగా పరిష్కరించడంతో పాటు, మెరుగైన పర్యవేక్షణ చేయాలని జిల్లా అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడానికి నోడల్ అధికారులను నియమించాలని ఆదేశాలు జారీ చేసింది. డిటైల్డ్ ఎంక్వైరీ క్యాలెండర్‌ను ముందుగానే తయారు చేయాలని స్పష్టం చేసింది. జిల్లా షెడ్యూల్‌కు అనుగుణంగా, సంబంధిత అన్ని విభాగాలకు వాటిని అందజేయాలని స్పష్టం చేసింది. నోడల్ అధికారులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తనిఖీలు నిర్వహించాలని, విద్యా సంస్థల సరైన పనితీరును నిర్ధారించడానికి ఆకస్మిక సందర్శనలను కూడా నిర్వహిస్తారని వెల్లడించింది. అధికారులు గురుకుల పాఠశాలలను సందర్శించిన తర్వాత అవసరమైన చర్యలు తీసుకోవడానికి తనిఖీ నివేదికలను తయారు చేసి వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. ఏ చర్యలు తీసుకున్నారో వెంటనే తెలియజేయాలని జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. తీసుకున్న చర్యల నివేదికను ప్రతి నెల అయిదో తేదీలోపు సంబంధిత విభాగాధిపతులు, కార్యదర్శులకు తప్పకుండా సమర్పించాలని ఆదేశాల్లో ప్రభుత్వం పేర్కొంది.

# వ్యవసాయ శాఖ ఎడిఎ కిరణ్ బంధువుల ఇంట్లో దాడులు

## ఏడుచోట్ల ఏకకాలంలో సోదాలు

**గరిడేపల్లి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పొనుగోడులో వ్యవసాయ శాఖలో ఎడిఎ గా పనిచేస్తున్న సుందరి కిరణ్ ఇంటిపై శనివారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఉదయం 5 గంటలకే సుందరి కిరణ్ స్వగ్రామమైన పొనుగోడు లో ఉన్న ఇంటికి ఏసీబీ అధికార బృందాలు చేరుకున్నాయి. సుమారు 7 గంటల పాటు అధికారులు సోదాలు నిర్వహించారు. అనేక విషయాలపై ఆరా తీశారు. దాడులు నిర్వహించిన సమయంలో స్వగ్రామమైన పొనుగోడు ఇంటిలోనే ఏడిఏ కిరణ్ ఉన్నారు. ఆయన సమక్షంలోనే అధికారులు సోదాలు నిర్వహించారు. దాడుల విషయంపై మహబూబ్నగర్ జిల్లా ఎసిబి డీఎస్పీ బాలకృష్ణ మాట్లాడుతూ మహబూబ్నగర్ జిల్లాలో వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు వివరించారు. ప్రస్తుతం ఏ డి ఏ కిరణ్ వ్యవసాయ శాఖలో నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తిలో విధులు నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయంటూ ఫిర్యాదులు అందిన కారణంగా అధికారులు ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు.

సుందరి కిరణ్ కు సంబంధించిన వివిధ ప్రాంతాల్లో ఉన్న ఏడు చోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామాల్లోని కిరణ్ సొంత ఇంటిలో దాడులు చేయగా, నేరేడుచర్ల పట్టణంలోని భాగస్వాములుగా ఉన్న అవని రైస్ మిల్లులో కూడా సోదాలు నిర్వహించి వివరాలు రాబట్టారు.



దీంతోపాటు గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలోని కిరణ్ అత్తగారు ఇంటిలో, ఆయన కూతురు గ్రామమైన అనంతగిరి మండలంలోని అమీనాబాద్ లో, సూర్యాపేట పట్టణంలోని ఆయన నివాసం ఉంటున్న కిరాయి ఇంటిలో, రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని కిరాయి ఇంటిలో దాడులు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. నేరేడుచర్ల పట్టణంలో నల్లగొండ జిల్లా ఎసిపి డిఎస్పి జగదీష్ చంద్ర ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఇంకా పూర్తిస్థాయిలో దాడులు నిర్వహించి వివరాలు రాబట్టాలని అనంతరం పూర్తి సమాచారాన్ని అధికారికంగా వెల్లడిస్తామని ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు. వచ్చిన ఫిర్యాదు మేరకు ఏ డి ఏ కిరణ్ ను విచారణ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# మావోయిస్టు పార్టీ మనుగడపై మల్లోజుల కీలక వ్యాఖ్యలు

## పార్టీలో సీనియర్లంతా వృద్ధులై పోయారు

## దయచేసి అజ్ఞాతం వీడాలని దేవ్‌జీ, రాజిరెడ్డికి విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీ గురించి ఆ పార్టీ మాజీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీకి మనుగ డ లేదని ఆయన తెలిపారు. శనివారం నాడు ఛత్తీస్‌ఘడ్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ గురించి, క్యాడర్ గురించి ఆసక్తిర అంశాలు వెల్లడించారు మావోయిస్టు పార్టీలో వున్న వారంతా వృద్దులయ్యారని, కొత్తవారు రావడం లేదని, యువ రక్తం కనుమరుగ య్యిందని ఆయన తెలిపారు. చైనా, రష్యా బూజు సిద్ధాంతాలపై ఉనికిని కొనసాగించలేమని ఆయన వెల్లడించారు. మావోయిస్టు పార్టీలో నెలకొన్న వాస్తవ పరిస్థితుల గురించి తాను మాట్లాడితే తనను ద్రోహి అని అంటున్నారని మల్లోజుల ఆవేదన చెందారు. తనను ద్రోహి అంటున్న వారికి కాలమే సమాధానం చెబుతుందని ఆయన తెలిపారు. తాను ఇప్పటికీ ప్రజల తోనే వారి మధ్యనే వున్నానని, ప్రజలు కోరుకుంటే రాజకీయబాట పడతానని కీలక ప్రకటన చేశారు.

పార్టీలో కొనసాగుతున్న ఒకప్పటి తన సహచరులు ఇకనైనా మంచి నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. మార్చి 31వ తేదీ దగ్గర పడుతుందని, ఈ లోగా మిగిలి న నక్సలైట్లు ఆయుధాలను వీడతారని తాను ఆశిస్తున్నట్లు మల్లోజుల ఆశాభావం వ్యక్తం చేశారు. మావోయిస్టు పార్టీ కార్యదర్శిగా ప్రచారం జరుగుతున్న దేవ్ జీతో పాటు మరో అగ్రనేత రాజిరెడ్డి అజ్ఞాతం వీడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వారితో పాటు అజ్ఞాతంలో వున్న వారు కూడా తమ డిమాండ్లను ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం ముందు వుంచి లొంగిపోవాల ని ఆయన కోరారు. గతంలో తాను, తనతో పాటు లొంగిపోయిన వారంతా ప్రభుత్వంతో మాట్లాడిన తరువాతే జనజీవన స్రవంతిలో కలిశామని ఆయన తెలిపారు. మావోయిస్టుల డిమాండ్లను పరిష్కరించేందుకు కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా వున్నాయని ఆయన వెల్లడించారు. సోను దాదాగా పేరొందిన తాను ఉద్యమాన్ని వదిలి పెట్టానని ఆయన తెలిపారు.

తన బాటలో అనేక మంది వచ్చారని ఆయన పేర్కొన్నారు. తాను పుట్టి పెరిగిన తెలంగాణకు త్వర లోనే వస్తానని ఆయన వెల్లడించారు. 1980లో వున్న తెలంగాణకు ఇప్పటి తెలంగాణకు ఎంతో తేడా వుందని ఆ యన తెలిపారు. అర్బన్ మావోయిజం ఎప్పుడో అంతరించిందని ఒక ప్రశ్నకు జవాబుగా ఆయన తెలిపారు.

### ఆపరేషన్ కర్రెగుట్టల ఎఫెక్ట్ లొంగుబాటలో అగ్రనేతలు?

ఇదిలావుండగా నక్సల్స్‌కు రెండవ ఖిల్లాగా పేరున్న కర్రెగుట్టలో మరోసారి కేంద్ర బలగాలు కూంబింగ్ చేబట్టడంతో మావోయిస్టు పార్టీ అగ్రనేతలు లొంగుబాటు మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలిసింది. పార్టీ అగ్రనేతలు దేవ్ జీ, రాజిరెడ్డి సహా మరో ఐదుగురు అగ్రనేతలు ఛత్తీస్‌ఘడ్‌తో పాటు తెలం గాణ పోలీసులతో లొంగుబాటు గురించి చర్చలు జరుపుతున్నట్లుగా తెలిసింది. ఈ వార్తలను రెండు రాష్ట్రాల పోలీసు విభాగాలు ధృవీకరించడం లేదు.

# గతం కంటే రూ.25 వేల కోట్లు పెరిగిన ఆదాయం

## ఖజానాకు చేరిన రూ.2.8 లక్షల కోట్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఇప్పటి వరకూ రాష్ట్ర ఖజానాకు రూ.2,07,558.18 కోట్ల రూపాయలు జమ అయ్యాయి. గత ఏడాది ఇదే సమయానికి వచ్చిన ఆదాయం కంటే ఈ సారి రూ.25 వేల కోట్లు ఎక్కువ. గత 2024-25 ఆర్థిక సంవత్సరం ఈ కాలానికి రూ.1,82,437.83 కోట్లు సమకూరాయి. ఆర్థిక శాఖ వివరాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సవత్సరం జనవరి నెలాఖరు నాటికి పన్నుల ఆదాయం రూ.14 వేల కోట్లు, రుణాలు రూ.9 వేల కోట్లు పెరిగిన నేపథ్యంలో ఖజానాకు జమ అయిన ఆదాయంలో పెరుగుదల చోటు చేసుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నుల రూపంలో పది నెలల కాలానికి రూ.1.26,293.64 కోట్లు రాగా, గత ఏడాది రూ. 1,12,772.48 కోట్లు మాత్రమే వచ్చాయి. ఏప్రిల్‌లో రూ.10,916.68 కోట్లు, మేలో రూ.11,692.33 కోట్లు, జూన్‌లో 13,112.79 కోట్లు, జూలైలో రూ.12,423.76 కోట్లు, అగస్టులో రూ.11,822.02 కోట్లు, సెప్టెంబరులో రూ.11,869.07 కోట్లు, అక్టోబరులో రూ.16,272.44 కోట్లు, నవంబరులో రూ.12,234.16 కోట్లు, డిసెంబరులో రూ. 13,541.81 కోట్లు, జనవరిలో రూ.12,308.28 కోట్లు పన్నుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు చేరుకున్నాయి.

# మార్చి నెలాఖరుకు అన్ని పంచాయతీల్లో 100% చెత్త సేకరణ

## జపాన్ తరహాలో అలవాట్లు మార్చు కోవాలి

## ఎపి సిఎం చంద్రబాబు

**వినుకొండ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** పేద ప్రజల ఆదాయాన్ని పెంచి వారి జీవితాల్లో ఆనందాన్ని నింపుతామని... ప్రతి ఒక్కరికి ఆనం దం పంచేలా కృషి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజలకు ఆదాయం పెంచే మార్గాన్ని నేర్పించి వారిని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

**పల్నాడులో అడుగుపెడితే వచ్చే వైబ్రేషన్ వేరు:** వినుకొండలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మా ట్లాడుతూ "పౌరుషాల గడ్డ పల్నాడులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నాం. పల్నాడులో అడుగుపెడితే వచ్చే వైబ్రేషనే వేరుగా ఉంటుంది. ఇటీవల కోటప్పకొండలో శివరాత్రి ఉత్సాహంగా జరిగింది. భక్తులతో దద్దరిల్లింది. కోటప్పకొండ తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. శివరాత్రి ప్రభలు అంటే కోటప్పకొండ ప్రభలే గుర్తుకు వస్తాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా యణ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా బాగా జరుగుతున్నాయి. నేను గతంలో ముఖ్యమంత్రిగా వచ్చదనం -పరిశుభ్రత,నీరు-మీరు, ఆకస్మిక తనిఖీలు వంటి ఎన్నో కార్యక్ర మాలు చేపట్టాను. స్వచ్ఛాంధ్ర అంటే రోడ్లు ఊడ్చే కార్యక్రమం కాదు. స్వచ్ఛత మన జీవన విధానంలో భాగం కావాలి' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

**పరిసరాల శుభ్రత.. మన బాధ్యత:** 'రాష్ట్రంలోని ప్రతి మండలానికో స్వచ్ఛ రథం ఏర్పాటు చేస్తున్నాం. వారానికోసారి రథాలు గ్రామానికి వస్తాయి. ఇళ్లలో పనికి రాని వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసర వస్తువులు ఇస్తారు. అన్నింటికంటే మనకు ముఖ్యమైనది ఆరోగ్యం. ఆరోగ్యం బాగుండాలంటే మంచి పరిసరాలు, శుభ్రమైన కార్యాలయాలు, గ్రామాలు ఉండాలి. నేను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే నాటికి రాష్ట్రంలో 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. వర్షాలకు ఆ చెత్త భూమిలో ఇంకి తద్వారా భూగర్భ జలాలు కలుషితమయ్యే పరిస్థితి వచ్చింది. నూటికి 97 శాతం మున్సిపాలిటీల్లో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. వచ్చే నెల కల్లా రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో 100 శాతం ఇంటింటికీ చెత్త సేకరిస్తాం. రాష్ట్రంలో 4,14,004 కుటుంబాలు హోం కంపోస్టింగ్ చేస్తున్నారు. 4,19,288 టెర్రస్‌గార్డెన్లు ఉన్నాయి.

# ఏకసభ్యకమిటీయే ఇక సుప్రీమ్!



## -'కల్తీ' నెయ్యి అవినీతి పై మరింత లోతుగా దర్యాప్తు - పాపపు చిట్టా ఎవరిమెడకో?

**తిరుమల,ఫిబ్రవరి21ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూలకు రసాయనాలు కల్తీచేసిన నెయ్యిసరఫరా చేసిన పాపంలో మరింత లోతైన దర్యాప్తుకు రాష్ట్రప్రభుత్వం విశ్రాంత ఐఎఎస్,ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్‌ను ఏకసభ్య కమిటీగా నియమించడంతో ,విచారణకు ఆయనే సుప్రీమ్‌గా మారింది. ఆయన త్వరలోనే ఈ కమిటీలో బాధ్యతలు చేపట్టి తనదైన శైలిలో 2019-24 మధ్యకాలంలో ధార్మికసంస్థ టిటిడి టెండర్ నిబంధనల ఉల్లంఘన, తయారీ విధానం బోర్డుకు అనుకూలంగా మార్చుకుని నెయ్యి సరఫరా చేయించుకోవడం వంటివాటిపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా 2020-24 మధ్యకాలంలో తిరుమలకు నెయ్యి సరఫరా చేసిన డెయిరీలు, కాంట్రాక్టర్లు, సంస్థలు వంటి వివరాలు సేకరించటం ఆ దిశగా దర్యాప్తు సాగించనుండటం విశేషం. తిరుమల లడ్డూప్రసాదాల తయారీకి పలురకాల రసాయనాలు కలిపిన నూనె, ఇతర శాఖాహారపదార్థాలతో కల్తీ నెయ్యిని సరఫరా చేశారనేది ఇప్పటికే సిబిఐ సిట్ అధికారులు దాదాపు తేల్చేశారు. ఆ దిశగా నివేదికలను రాష్ట్రప్రభుత్వానికి సమర్పించిన విషయం తెలిసిందే. ఆ అవినీతి నిగ్గు తేల్చేందుకు ,అసలు సూత్రధారులు ఎవరనేది వెల్లడించడానికి ఇక ఏకసభ్యకమిటీ రంగ ప్రవేశం చేయనుంది. తిరుపతి ప్రధాన కేంద్రంగా ఈ కమిటీ ప్రభుత్వం నుండి అందుకున్న నివేదికలు, ఆధారాలతో రానున్న వారంలో మరింత లోతుగా కీలక వ్యక్తులను విచారణ చేస్తారనేది టిటిడిలో సంచలనంగా మారింది. ఈ కల్తీనెయ్యి బాగోతంలో సుమారు 237కోట్ల రూపాయలు వరకు అవినీతి జరిగిందనేది సిట్ అందించిన నివేదిక. అయితే అందులో ఎవరెవరి పాత్ర కీలకం, టెండర్ల నిబంధనలు మార్చిందెవరు, దీనివెనుక ఎంత మొత్తంలో ఎవరెవరి నుండి ఎవరికి ఆర్థికంగా లబ్ధిపొందారనేది పూర్తి ఆధారాలతో ఈ కమిటీ తేల్చితే అసలు దోషులు ఎవరనేది వెలుగుచూడనుంది. ఇప్పటికే గత ఏడాదిన్నర కాలంలో సిబిఐ సిట్ అధికారులు క్షేత్రస్థాయిలో అన్ని కోణాల్లో కీలక విచారణ చేపట్టి లడ్డూప్రసాదాల కల్తీనెయ్యి వాడకంపై పాత్రధారులను 36మందిని గుర్తించింది. ఇందులో 11మంది టిటిడి అధికారులే కావడం ప్రధానం. మరో కొందరు అధికారులు కూడా ఉన్నారని తాజాగా తేల్చిన విషయం. ఈ కేసులో ప్రధాన సూత్రధారి ,టిటిడి ఎఫ్ఎసిఎఓ ఓ.బాలాజీ పాత్ర కూడా ఉందని సిట్ అందించిన నివేదిక. ఆయన ఇప్పటికే దీర్ఘకాలిక సెలవు పెట్టేసి వెళ్లిపోయారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకముందే ఆయనకు సెలవు మంజూరుచేసిన అధికారులెవరనేది విశ్రాంత ఐఎఎస్ అధికారి తేల్చాల్సిన విషయం. గత టిటిడి బోర్డు పెద్దలు, గత అధికారుల పనితీరుపై పలురకాల ఆరోపణలు, విమర్శల నేపథ్యంలో వారందరినీ ఏకసభ్యకమిటీ పిలిపించుకుని సమగ్ర దర్యాప్తు చేయడానికి అవసరమైన అధికారాలు న్యాయ స్థానం ద్వారా బదలాయింపులు అనేది కూడా చూడాల్సి ఉంది. 2019-24 కాలంలో లడ్డూల తయారీకి ఐదుమంది కాంట్రాక్టర్లు టెండర్లలో దక్కించుకున్న ఒప్పందం ప్రకారం సరఫరా చేయాల్సిన నాణ్యతప్రమాణాలతో నెయ్యికి బదులు నాసిరకంగా, జంతువుల కొవ్వునూనె కలిపినారనేది సిబిఐ సిట్ తేల్చింది. దేవుని లడ్డూల తయారీలో కల్తీనెయ్యితో గత వైసిపి ప్రభుత్వం, అప్పటి టిటిడి బోర్డు పెద్దలు, టిటిడి అధికారులు అపవిత్రం చేశారనే విమర్శలు చెలరేగాయి. ఈ కల్తీనెయ్యి అవినీతి మరకల్లో అసలు దోషులు ఎవరనేది తేల్చాలనేది ప్రభుత్వం పట్టుదలతో కదులుతోంది. మరో ఈ కేసులో ఈ కమిటీ రానున్న రోజుల్లో ఎలా దర్యాప్తు ముందుకు కదలనుందనేది మాత్రం వేచి చూడాల్సిందే. తిరుమల లడ్డూ తయారీలో కీలక మైన ఆవునెయ్యి సరఫరాలో జంతువుల కొవ్వు నూనె కలిపి, నాసిరకం నెయ్యి టిటిడికి అందించిన కేసులో ప్రధాన దోషులెవరనేది సిట్ తేల్చ లేకపోయిందనేది ప్రభుత్వ పెద్దలు,మంత్రులు అనుమానం వెలిబుచ్చారు. ఏఆర్ డైరీ పేరుతో టెండర్లు దక్కించుకున్న వైష్ణవి డైరీ ప్రతినిధులు నకిలీ డాక్యుమెంట్లు, నకిలీ వే బిల్లులతో కల్తీనెయ్యి సరఫరా చేయడం. గత వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన పొరపాట్లపై సిట్ నివేదిక రాష్ట్రప్రభుత్వం చేతికి అందడంతో అసలు దోషులు ఎవరనేది తేల్చేందుకు ఇప్పుడు కీలక మలుపుతిరగనుంది.

## దేశప్రయోజనాలు వదలి ఎఐసమ్మిట్‌లో కాంగ్రెస్ రాద్ధాంతం - తిరుపతిలో బిజెవైఎం నిరసన



**తిరుపతి,ఫిబ్రవరి21ప్రభాతవార్తప్రతినిధి:** దేశప్రయోజనాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఢిల్లీలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ నాయకులు రాద్ధాంతం చేయడం దారుణమని బిజెవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.పృధ్వీరెడ్డి అన్నారు.కాంగ్రెస్ నాయకులు తీరును ఆయన తప్పుపట్టారు. ఎఐసమ్మిట్‌లో కాంగ్రెస్‌పార్టీ అనుసరించిన తీరుపై శనివారం మధ్యాహ్నాం బిజెవైఎం రాష్ట్రఉపాధ్యక్షుడు జి.పృధ్వీరెడ్డి ఆధ్వర్యంలో నాలుక్కాళ్ళమండపం వద్ద రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. దేశ అభివృద్ధి, సాంకేతిక పురోగతిని అడ్డుకునే విధంగా కాంగ్రెస్ నాయకులు ప్రవర్తించడం తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్‌పార్టీకి ప్రజలు ఇప్పటికే బుద్ది చెప్పారన్నారు. దేశప్రయోజనాలకోసం ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న కృషిని అడ్డుకోవాలనే ఏ ప్రయత్నమైనా బిజెవైఎం ప్రజాస్వామ్య పద్దతిలోనే గట్టిగా ప్రతిఘటిస్తామని పృధ్వీ హెచ్చరించారు. యువత భవిష్యత్తు, దేశప్రయోజనాలు కాపాడటంలో బిజెవైఎం నేతలు,కార్యకర్తలు ఎప్పుడూ ముందుంటారని స్పష్టం చేశారు. ఈ నిరసనలో బిజెవైఎం జిల్లా నాయకలు జీవన్‌రాయల్,శరత్,కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశాన్ని, మాతృభాషని, చదువుకున్న విద్యా సంస్థని, గురువులని మరిచిపోకూడదు

### - మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశాన్ని, మాతృభాషని, చదువుకున్న విద్యా సంస్థని, గురువులని మరిచిపోకూడదని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్దార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశోధనకి యువత ప్రాధాన్యం ఇవ్వాలి. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి. మన పూర్వీకులు మనకి అందించిన సంప్రదాయాలని భావితరాలకు అందించాలి. మన కట్టు, బొట్టులకు ప్రాధాన్యం ఇవ్వాలి. తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి. భారత్ విశ్వగురువు అయినా వేరే దేశం మీద దండయాత్రలు చేయలేదు. కులం కన్నా గుణం మిన్న. భారత్ సత్తా ప్రపంచ వేదికల మీద చాటి చెబుతున్నారు. డిగ్రీలు కాదు పరిజ్ఞానం ముఖ్యం. ముఖ్యమంత్రి చంద్రబాబు టెక్నాలజీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏఐని అదుపుచేసి ముందుకువెళ్లాల్సిన అవసరం ఉంది. ఏఐ వస్తే మానవ సంబంధాలు మంగగలిసిపోతాయేమోనన్న భయం నాకు ఉంది. విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చెయ్యాలి. సోషల్ మీడియా తప్పుడు అంశాలకు వేదికైంది. భావితరాలకు మంచి మార్గంలో నడపాలి. భవిష్యత్‌లో చాలా రంగాల్లో ఉద్యోగాలు పోతాయి. దీనికోసం మాట్లాడాల్సిన అవసరం ఉంది. దీనిపై చర్చించాలి. రాజకీయ నాయకులు బూతులు విపరీతంగా మాట్లాడుతున్నారు. గత ఎన్నికల్లో బూతులు మాట్లాడిన వాళ్లంతా ఓడిపోయారు. వ్యవస్థలో అలాంటి వ్యక్తులను ప్రోత్సహించకూడదు. సమాజం అలాంటి వాళ్లని బహిష్కరించాలి. రామాయణాన్ని పాఠ్య పుస్తకాల్లో పొందుపరచాలి. తల్లిదండ్రులు, పెద్దలు పిల్లలకు ఎక్కువ సమయం కేటాయించాలి. గూగుల్‌కి ప్రాధాన్యం తగ్గించి బుర్రకి పని చెప్పాలి. మంచి సమాజ నిర్మాణానికి మనందరం కృషి చేయాలి అని వెంకయ్యనాయుడు అన్నారు.

## హిందువుల మనోభావాలపై వైసిపి ఆటలు

### - యేడాదంతా జగన్, భూమనకు జనం సమస్యలు ఉండవు : శాప్స్ ఛైర్మన్ రవినాయుడు



**తిరుపతి,ఫిబ్రవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూలకు రసాయనాలు కలిపిన కల్తీనెయ్యి సరఫరా చేయడమేగాక, ఆ పాపంలో దేవుడ్ని అడ్డుపెట్టుకుని వైసిపి ప్రజాప్రతినిధులు ఆడిన నాటకం హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని శాప్స్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఘాటుగా స్పందించారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవాల్సిన వైసిపి ప్రజాప్రతినిధులు పక్కదారి పట్టి చేసిన పాపాన్ని తప్పించుకోవడానికి అబద్దాలతో రచ్చచేస్తుండటాన్ని యావత్తు భారతదేశం ప్రజలు గమనిస్తున్నారన్నారు. అసెంబ్లీలో ఏడుకొండల వెంకన్న ఫోటోలు ప్లకార్డులుగా పెట్టుకుని పాదరక్షలు వేసుకుని ప్రదర్శించడం మంచిది కాదన్నారు.ఇదీ ఆ దేవదేవుడి పవిత్రతను మంటగలపడమేనని విమర్శించారు. గత ఐదేళ్ళ వైసిపి హయాంలో టిటిడికి కల్తీనెయ్యి సరఫరా జరిగిందని మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి స్వయంగా తప్పును ఒప్పుకున్నారని రవినాయుడు తెలిపారు.

అయితే దీన్ని వక్రీకరించి అటు జగన్, ఇటు భూమన గత ఏడాదికాలంగా ప్రజల సంక్షేమం, సమస్యలను గాలికొదలి,పక్కదారిపట్టించి ఆరోపణలు చేస్తూ టిటిడిపై అసత్యప్రచారాలకు కాలం వెల్లబుస్తున్నారని రవి మండిపడ్డారు.అసెంబ్లీకి వచ్చి ప్రజలకు అవసరమైన సమస్యలు పరిష్కరించుకోవాల్సిన జగన్, ఆ పార్టీ నాయకులు వృధాగా కాలయాపనచేస్తున్నారని విమర్శించారు.

## వైసిసి కార్యకర్తకు ఇబ్బందుల్లో అండగా నిలిచిన మంత్రి నారా లోకేష్

**విజయవాడ.ఫిబ్రవరి 21,ప్రభాతవార్తప్రతినిధి:** రాజకీయాలకు అతీతంగా మానవతా దృక్పథంతో ఇబ్బందుల్లో ఉన్న వారికి ఏపీ మంత్రి నారా లోకేష్ సాయం అందిస్తున్నారు.తాజాగా కష్టాలలో ఉన్న వైసీపీ కార్యకర్తకు ఆయన తన చేయూతనిచ్చారు. తమ పార్టీ కాదు అన్న బేధ భావం మరచి సహాయం చేశారు మంత్రి నారా లోకేష్. సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్టుకు ఆయన స్పందించారు. అది కూడా తమ ప్రత్యర్ది రాజకీయ పార్టీనేత జగన్ తో కలిపి తనను ట్యాగ్ చేసినా, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవటం ముఖ్యమని భావించి సహాయం అందించారు.వైసీపీ కార్యకర్త భాస్కర్ అనే వ్యక్తి తండ్రికి ఇటీవల ప్రమాదం జరగటంతో ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వైద్యానికి సరిపడా ఆర్థిక పరిస్థితి లేకపోవటంతో తనకు సహాయం చెయ్యమని ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు.తన తండ్రి స్థితి వివరిస్తూ, మీ కోసం, పార్టీ కోసం నాకున్న శక్తి మేరకు కష్టపడుతున్నా వైఎస్ జగన్ అన్నా, మా నాన్న గారికి యాక్సిడెంట్ అయి, ఆస్పతిలో ఉన్నారు. నా శక్తి మేరకు ఖర్చు పెట్టాను. ఇంకా ఆర్థికంగా ఇబ్బందిగా ఉంది, కొంచెం అండగా నిలబడి ఆదుకోండి అంటూ పోస్ట్ పెట్టారు. ఇక ఆ ట్వీట్ లో వైఎస్ జగన్ తో పాటు నారా లోకేష్ ను కూడా ట్యాగ్ చేశారు.దీంతో లోకేష్ సానుకూలంగా స్పందించారు. "మీ నాన్నగారికి జరిగిన ప్రమాదం గురించి విని బాధపడ్డాను భాస్కర్. ఆయన త్వరగా, పూర్తిగా కోలుకోవాలన్నారు.

## ప్రపంచ కార్మిక వర్గానికి ఆయుధం వంటిది కమ్యూనిస్టు ప్రణాళిక

### - ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం

**విజయవాడ,ఫిబ్రవరి 21,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ కార్మిక వర్గానికి ఆయుధం వంటిది కమ్యూనిస్టు ప్రణాళిక అని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఎం టి ఎం సి పరిధిలోని వడ్డేశ్వరం కేబీ భవన్ లో రెడ్ బుక్ డే కార్యక్రమం సిఐటియు తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మనిషిని మనిషి దోచుకుతినే వ్యవస్థ అంతం కావాలని కార్మిక వర్గ రాజ్యస్థాపనకై కారల్ మార్క్స్, ఫ్రెడ్రిక్ యంగిల్స్ 1848 ఫిబ్రవరి 21న అందించిన కమ్యూనిస్టు ప్రణాళికే రెడ్ బుక్ డే గా దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నామని అన్నారు. సోషలిజానికి భవిష్యత్తు లేదని కారు కోతలు కూస్తున్న పెట్టుబడిదారీ భూస్వామ్య వర్గానికి, ఏజెంట్లుగా పనిచేస్తున్న వారికి కనువిప్పు కలిగేలా ప్రపంచవ్యాప్తంగా సోషలిజం కావాలని అనేక ఉద్యమాలు పోరాటాలు సాగుతున్నాయని అన్నారు. ఇటీవల అనేక దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి వచ్చాయని ఆయన అన్నారు. పెట్టుబడి దారి వ్యవస్థ, దోపిడి పెద్ద ఎత్తున పెరుగుతున్నాయని అన్నారు. అమెరికా సామ్రాజ్యవాద నాయకత్వంలో ఆర్థిక వనరుల కోసం, గనుల కోసం, ఆయిల్ కోసం సామ్రాజ్యవాద దేశం యుద్ధాలు ప్రకటిస్తున్నాయని అన్నారు. ఈ నిరంకుశ యుద్దాల వలన సామాన్య ప్రజలు ఊ చకోతకు గురవుతున్నారని అన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితులలో యుద్ధం కాదు ప్రపంచ కార్మికులారా ఏకంకండి అని పిలుపునిచ్చినటువంటి మార్క్స్ ఎంగిల్స్ సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టి 1917లో రష్యాలో సోషలిజం సాధించినటువంటి మహానాయకుడు లెనిన్ అని అన్నారు. లెనిన్ రచించిన సామ్రాజ్యవాద పుస్తకం నేటి వ్యవస్థకు అద్దం పట్టేలా ఉందని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ దేశభక్తి ముసుగులో భారత దేశ సంపదనంతా మోడీ ప్రభుత్వం గుత్త సంస్థలకు కట్టబెట్టి, కార్మిక వర్గ శ్రమను కొల్లగొడుతున్నారని అన్నారు. నాలుగు లేబర్ కోడ్ లు తీసుకురావడమే కాక వ్యవసాయ భూములను కారు చకోగా కార్పొరేట్ కంపెనీలకు మోడీ ప్రభుత్వం దారా దత్తం చేస్తుందని ఆయన విమర్శించారు.

## భవానీపురంలో ఇద్దరు పిల్లల మిస్సింగ్ కేసులో పురోగతి

**విజయవాడ, ఫిబ్రవరి 21,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో భవానీపురంలో ఇద్దరు పిల్లల మిస్సింగ్ కేసులో పోలీసులు పురోగతిని సాధించారు.వారిని గుర్తించి పోలీసులకు అప్పగించారు.ఇటీవల ట్యూషన్ వెళ్లకుండా ఇద్దరు పిల్లలు మేరారామ్(12), ఉమారామ్(13) ఎటో పోయారు.దాంతో కంగారు పడిన వారి తల్లిదండ్రులు పోలీసులకు ఆశ్రయించారు.వారు ట్యూషన్‌కు వెళ్ళకుండా ఆటోలో బస్టాండ్‌కు వెళ్లిపోయినట్లు పోలీసులు విచారణలో గుర్తించారు. వారు డబ్బులు వెంట తీసుకుని వెళ్లినట్లు సమాచారం తెలుసుకున్నారు. విజయవాడ బస్టాండ్ నుంచి ముంబయి వెళ్లిన ఇద్దరు పిల్లలు పిల్లలు గుజరాత్‌లోని సూరత్‌కు వెళ్తుండగా పోలీసులు గుర్తించారు.ఆ పిల్లలను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి : ప్రజాదర్బార్‌లో సుగుణమ్మ



**తిరుపతి, ఫిబ్రవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో టిడిపి,కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర పచ్చదనం,సుందరీకరణ ఛైర్‌పర్సన్ ఎం.సుగుణమ్మ అన్నారు.శనివారం ఆమె ప్రజాదర్బార్ కార్యక్రమం చేపట్టారు. తిరుపతి నియోజకవర్గంలోనేగాక పార్లమెంట్ జిల్లా పరిధిలో ప్రజలు పాల్గొని తమతమ సమస్యలపై వినతులు అందించారు.వీటన్నిటిపైఆమె అధికారులతో మాట్లాడి కొన్నిటిని పరిష్కరించారు. మిగిలిన వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని ఆమె భరోసా నిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వి.పుష్పావతియాదవ్, బుల్లెట్‌రమణ, మునిశేఖర్‌రాయల్, మురళి, విశ్వనాథం, సుజాత పాల్గొన్నారు.

## రాష్ట్రంలో క్రైమ్ రేటు 6 శాతం తగ్గింది :హోం మంత్రి అనిత

**విజయవాడ,ఫిబ్రవరి 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే కూటమి నాయకత్వంలో క్రైమ్ రేటు 6 శాతం తగ్గిందని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వైసీపీ కార్యకర్తలు రప్పా రప్పా అంటూ రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోబోమని మంత్రి అనిత హెచ్చరించారు. రాష్ట్రాభివృద్ధికి లా అండ్ ఆర్డర్ చాలా ముఖ్యమని, అది లేకనే గత ప్రభుత్వంలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో లా అండ్ ఆర్డర్ చక్కగా పనిచేయడం వల్లే క్రైమ్ రేట్ తగ్గిందన్నారు. అందుకే దేశంలోనే ఎక్కువ పెట్టుబడులు సాధించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో మహిళలు బయటకు రావడానికి కూడా భయపడేవాళ్లు అని, చట్టబద్ధత లేని దిశా యాప్ పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి పాలనలో కూటమి ప్రభుత్వం మహిళల రక్షణకు కట్టుబడి ఉందన్నారు. శక్తి యాప్, శక్తి టీమ్స్ తో మహిళా రక్షణకు కృషి చేస్తున్నామని చెప్పారు. అందుకే రాష్ట్రంలో మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గాయని స్పష్టం చేసారు.తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని, గీత దాటితే కటకటాలే అని హెచ్చరించారు.సైబర్ క్రైమ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలకు వివిధ కార్యక్రమాలు ద్వారా అవగాహన కల్పిస్తున్నాం అన్నారు.

## సమాచార హక్కు దరఖాస్తుల్లో కీలక మార్పు

### - అప్పీళ్ల నిర్వహణ విషయంలో ఆర్టీఐఎంఐఎస్ పేరుతో కొత్త విధానం

**విజయవాడ.ఫిబ్రవరి 21,ప్రభాతవార్తప్రతినిధి:** సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)ప్రకారం విధిగా ఇవ్వాల్సిన సమాచారాన్ని అడ్డుకుంటున్న ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు తాజాగా కొన్ని మార్గదర్శకాలు ఇచ్చింది. వీటిని రాష్ట్రాలు తప్పకుండా అమలు చేయాలని సూచించింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం కూడా సమాచార హక్కు చట్టం ప్రకారం సమాచారం కోరుతూ వచ్చే దరఖాస్తులు, అప్పీళ్ల నిర్వహణ విషయంలో ఆర్టీఐఎంఐఎస్ పేరుతో కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది.ఇకపై రాష్ట్రంలో ఆర్టీఐ దరఖాస్తులు, అప్పీళ్లు పూర్తిగా ఆన్ లైన్లో, డిజిటల్ విధానంలో నిర్వహిస్తారు. వీటి ప్రకారం రాష్ట్రంలో ఎవరైనా సమాచార హక్కు చట్టం ప్రకారం ఏదైనా సమాచారం కోసం దరఖాస్తు చేయాలంటే.. వెబ్ సైట్‌లో చేసుకోవచ్చు. ఫిబ్రవరి 18వ తేదీ నుంచి దీన్ని అమల్లోకి తీసుకుని వచ్చినట్లుప్రభుత్వం జీవో లో స్పష్టం చేసింది. ఈ కొత్త విధానం ప్రకారం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు చేస్తే.. ఎస్మెమ్మెస్, ఈమెయిల్స్ ద్వారా అప్ డేట్స్, 30 రోజుల్లో ప్రాథమిక సమాచార అధికారి (పీఐవో) నుంచి సమాధానం వస్తాయి.ఈ విషయంలో అవసరమైతే ఫస్ట్ అప్పీలు, సెకండ్ అప్పీలు కూడా వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. అలాగే వీటికి టైమ్ లైన్స్ కూడా ఇచ్చారు. జిల్లా నోడల్ ఆఫీసర్ అయితే 5 రోజుల్లో దరఖాస్తు ఫార్వర్డ్ చేయాల్సి ఉంటుంది. పీఐవో అయితే 30 రోజుల్లో సమాచారం ఇవ్వాలి. ఎఫ్ఏఏ అయితే 30 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలి. సెకండ్ అప్పీల్ విషయంలో 90 రోజుల్లో దాఖలు చేసుకోవచ్చు. ఈ దరఖాస్తుల్ని ఇంటి దగ్గరి నుంచే ఆన్ లైన్ లో చేసుకోవడంతో పాటు ట్రాకింగ్, అప్పీల్ కూడా చేసుకునే అవకాశం ఉంటుంది.

# తిరుమల సమాచారం



## నాణ్యమైన, ఆధ్యాత్మిక వాతావరణం కల్పించాలి

### - టిటిడి అగరబత్తుల కేంద్రం పరిశీలనలో జెఇఒ శరత్

**తిరుపతి, ఫిబ్రవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడిలో తిరుమల ఆలయంతోబాటు అనుబంధ ఆలయాల్లో దేవతామూర్తులకు వినియోగించిన పుష్పాలతో తయారుచేస్తున్న అగరబత్తీలతోబాటు త్వరలో మరో మూడురకాల అగరబత్తులను ఉత్పత్తిచేయనున్నట్లు టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ తెలిపారు. సంపంగి, వెయ్యివరహాలు, తులసి సుగంధాలతో ఈ మూడురకాల అగరబత్తీలు త్వరలోనే తయారుచేయనున్నారు. భక్తుల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలిగించే ఉత్పత్తులు అందించడమే టిటిడి లక్ష్యమన్నారు. శనివారం సాయంత్రం జెఇఒ డాక్టర్ శరత్ ఎస్వీ గోశాలను,అగరబత్తీల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. తయారీ ప్రక్రియ, ముడిసరుకు వినియోగం, ప్యాకేజింగ్ విధానం తదితర అంశాలను ఆయన ఉద్యోగుల నుండి తెలుసుకున్నారు. గోశాలలో గోవులు, పేయదూడలు, ఏనుగుల ఇతర పశువుల షెడ్లలో సమయానికి దాణా, తాగునీరు, వైద్యసదుపాయం, పరిశుభ్రత,గోశాల నుండి పాలుసేకరించి తరలించే సమయం తెలిసే సూచికబోర్డులు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. టిటిడి గోశాల డైరెక్టర్ డాక్టర్ ఏవిఎన్ శివకుమార్,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి ఉన్నారు.

## ఆకట్టుకున్న నగర సంకీర్తన



**తిరుపతి, ఫిబ్రవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మికనగరం తిరుపతిలో రాయలసీమ రంగస్థలం ప్రతి శనివారం ఉదయం నిర్వహించే నగర సంకీర్తన భక్తుల్లోనూఆధ్యాత్మిక భావం పెంపొందించేలా ఉందని రంగస్థలం ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. శనివారం వేకువజామున నగర సంకీర్తనలో భాగంగా గోవిందరాజస్వామి ఆలయ మాఢవీధుల్లో రంగస్థలి కళాకారులు గుండాల గోపీనాథరెడ్డి, కన్నప్పగారికేశవులు, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, అరుణ,జయమ్మ, సిద్దమ్మ, పార్వతి, మునేంద్ర, కల్పన, ఉష, కస్పాపద్మనాభం, నరసింహారెడ్డి, లోకప్రభాకర్‌నాయుడు, మధు, పోన్నాల జేజిరెడ్డి, పద్మావతి, శ్రావణి తదితరులు భక్తి,ఐక్యత, సేవా భావాల సమ్మేళనంగా ఈ నగరసం కీర్తన చేపట్టారు. కళాకారులతో కలసి నుదుటిన నామం ధరించి భక్తితో భజనలతో నగరంలో గోవిందనామసంకీర్తనలు హోరెత్తాయి. భక్తులకు అన్నప్రసాదాలు అందించారు.

## యూత్ కాంగ్రెస్ తీరు సిగ్గుచేటు : మాజీ సిఎం జగన్

**విజయవాడ,ఫిబ్రవరి 21,ప్రభాత వార్తప్రతినిధి:** ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో నిన్న యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన నిరసన ప్రదర్శనపట్ల మాజీ సిఎం జగన్ నిశిత విమర్శ చేశారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... ఏఐ సమ్మిట్ లో మనమంతా సిగ్గుపడేలా యూత్ కాంగ్రెస్ వ్యవహరించిందని మండిపడ్డారు. మన రాజకీయాలు ఎటువైపు వెళుతున్నాయని ప్రశ్నించారు. మన దేశాన్ని ఎవరూ, ఎప్పుడూ కించపరచకూడదని చెప్పారు. మన మధ్య ఎలాంటి రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ... ప్రపంచం ముందు అందరం ఐక్యంగా ఉండాలని అన్నారు. మీ తండ్రి వైఎస్సార్ వారసత్వాన్ని కించపరచవద్దు - జగన్‌కు యూత్ కాంగ్రెస్ హితవు. ఏపీ మాజీ సీఎం జగన్‌కు జాతీయ యువజన కాంగ్రెస్ హితవు పలికింది. సీబీఐ, ఈడీ కేసుల వల్లే రాజీ పడుతున్నారా అని ప్రశ్నించింది. ఢిల్లీ ఏఐ సదస్సులో తమ నిరసనలపై వైసీపీ అధినేత జగన్ చేసిన విమర్శలకు భారత యూత్ కాంగ్రెస్ ఘాటుగా బదులిచ్చింది.

ఆయన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి వారసత్వాన్ని గుర్తుచేస్తూ చురకలు అంటించింది. సీబీఐ, ఈడీ కేసుల కారణంగానే జగన్ కొన్ని శక్తులతో రాజీ పడుతున్నారని ఆరోపించింది.

## మత్స్యకార కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా విడుదల

**సచివాలయం,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,వ్యవసాయం,ఉద్యానవనం,మార్కెటింగ్ సహకారం,పాడి పరిశ్రమలు మరియు మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చన్నాయుడు ప్రత్యేక చొరవ,మార్గదర్శకత్వంలో గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ కింద 2018సంవత్సరం నుంచి వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్యంగా తీసుకొని పరిష్కరించారు. మత్స్య కార వేట సమయంలో ప్రమాదవశాత్తు మరణించిన 95మంది మత్స్యకారుల కుటుంబాలకు మొత్తం రూ.4.75కోట్లు ఎక్స్‌గ్రేషియా సహాయంగా మంజూరు చేసి విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు.సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్ళను మంత్రి స్వయంగా సమీక్షించి,అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి వేగవంతంగా చర్యఉ చేపట్టేలా చేసినట్లు పేర్కొన్నారు. మంత్రి ఆదేశాల మేరకు 95మంది లబ్దిదారులల్లో ఇప్పటికే 90మంది కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో ఎక్స్‌గ్రేషియా మొత్తాలు నేరుగా జమ చేయబడినట్లు వెల్లడించారు.మిగిలిన 5మంది లబ్దిదారుల ఖాతా వివరాల్లో ఉన్న సాంకేతిక సమస్యల కారణంగా జమ ప్రక్రియ పూర్తికాలేదని,వాటిని అత్యవసర ప్రాతిపదికన పరిష్కరించి త్వరలోనే వారి ఖాతాల్లో మొత్తాలను జమ చేయనున్నట్లు మంత్రి స్పష్టంచేశారు. మత్స్య కారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని,ఎవరూ అన్యాయానికి గురికాకుండా ప్రతి అర్హుడికి సహాయం అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు.రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న జిపిఐఎస్ క్లెయిమ్‌లను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు ప్రభుత్వం దృఢసంకల్పంతో పనిచేస్తుందని తెలియజేశారు.

## ఇంటర్ పరీక్షల్లో పారదర్శకత ముఖ్యం

### - ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (పాప్) డిమాండ్

### - అర్హత లేని ఇన్విజిలేటర్లు, మూల్యాంకన కర్తలపై చర్యలు తీసుకోవాలి

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఫిబ్రవరి 23 నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణలో బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, కేవలం అర్హత,అనుభవం ఉన్న అధ్యాపకులను మాత్రమే విధుల్లోకి తీసుకోవాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (పాప్) డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు బోర్డు సెక్రటరీ గారికి ఒక వినతి పత్రాన్ని పంపారు.ఇన్విజిలేషన్ విధుల్లో లోపాలు గమనించి సవరించాలి. రాష్ట్రవ్యాప్తంగా 1,537 కేంద్రాల్లో సుమారు 15 వేల మంది ఇన్విజిలేటర్లు అవసరం కాగా, ప్రభుత్వ పరంగా కేవలం 10 వేల మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. మిగిలిన 5 వేల మందిని ప్రైవేటు కళాశాలల నుండి తీసుకుంటున్నారు. అయితే, చాలా ప్రైవేటు యాజమాన్యాలు అనుభవం లేని, అర్హత లేని వారిని పంపిస్తున్నాయని, దీనివల్ల పరీక్షల పారదర్శకత దెబ్బతినే ప్రమాదం ఉందని అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవల ముగిసిన ప్రాక్టికల్ పరీక్షల్లో ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థుల నుండి వేల రూపాయలు వసూలు చేశాయని, మాల్ ప్రాక్టీస్ జరిగిందని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని, థియరీ పరీక్షల్లో ఇటువంటి అక్రమాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జవాబు పత్రాల మూల్యాంకనానికి సంబంధిత సబ్జెక్టులో పీజీ విద్యార్హతతో పాటు 35 ఏళ్ల బోధనా అనుభవం తప్పనిసరి చేయాలి. అర్హత లేని వారు మూల్యాంకనం చేయడం వల్ల ప్రతిభావంతులైన విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో విధులకు వచ్చే ప్రతి ఇన్విజిలేటర్ మరియు వాల్యుయేషన్ చేసే అధ్యాపకుని విద్యార్హత పత్రాలను, సర్వీస్ రిజిస్టర్లను బోర్డు అధికారులు కచ్చితంగా తనిఖీ చేయాలి. ర్యాంకుల వేటలో విద్యార్థులను ఒత్తిడికి గురిచేసే విధానాన్ని స్వస్తి పలికి, సృజనాత్మకమైన విద్యను ప్రోత్సహించాలి. అర్హత లేని వారిని తక్షణమే విధుల నుండి తప్పించి, నిష్పాక్షి కంగా పరీక్షలు నిర్వహించాలి. పాప్ గౌరవాధ్యక్షులు మలి రెడ్డి కోటారెడ్డి, నరహరి శిఖరం.రాష్ట్ర అధ్యక్షుడు.

# కేకు రుచులు

ఏ సందర్భం అయినా కేక్ కావాలి. కట్ చేయాలి, ఒకరికొకరు తినిపించుకోవాలి. కానీ దానిలోనేమో బోలెడన్ని కెలోరీలు, చక్కెరలు, అందుకే ఈసారి ఒంటికి మంచి చేసే ఈ పసందైనా కేక్స్‌ను ఇంట్లోనే తయారుచేద్దామా!


## క్యారెట్‌తో..



కావాల్సినవి: క్యారెట్ తురుము కప్పు, పాలు పావుకప్పు, బేకింగ్ సోడా అరచెంచా నూనె లేదా నెయ్యి అరకప్పు, చక్కెర అరకప్పు, పెరుగు చెంచా. తయారీ: ఒక పాత్రలో క్యారెట్ తురుము, చక్కెర, పాలు, నెయ్యి, పెరుగు వేసి బాగా కలిపి గిలకొట్టాలి. కేక్ ట్రేకి నూనె రాసి పక్కకు పెట్టిన మిశ్రమాన్ని అందులో వేసి సర్దాలి. కుక్కర్ తీసుకుని అందులో అడు గున కొద్దిగా నీళ్లు, ఉప్పు వేసుకుని స్టాండ్ పెట్టి కేక్ ట్రేను పెట్టాలి. 2 విజిల్స్ వచ్చేంత వరకు ఉడికించాలి. క్యారెట్ స్థానంలో బీట్రూట్ ఉపయోగించి బీట్రూట్ కేక్ కూడా చేయొచ్చు.

## రాగి బెల్లం

కావాల్సినవి: రాగిపిండి కప్పు, గోధుమపిండి అరకప్పు, బెల్లం తురుము అరకు లు పావుకప్పు, నూనె లేదా నెయ్యి అరకప్పు, బేకింగ్ సోడా అర చెంచా, పెరుగు 2 చెంచాలు, కోకోపౌడర్ పావుకప్పు, ఉప్పు చిటికెడు, వెనీలా ఎసెన్స్ వెంచా, బేకింగ్ పౌడర్ చెంచా. తయారీ రాగిపిండిని జల్లెడ పట్టాలి. అందులో గోధుమపిండి, పెరుగు, పాలు, బెల్లం, బేకింగ్ పౌడర్, సోడా, వెనీలా ఎసెన్స్, కోకోపౌడర్, నెయ్యి వేసి బాగా గిలకొట్టాలి. తర్వాత కేక్ పాన్ లేదా అడుగున సమానంగా ఉన్న పాత్ర తీసుకుని నూనె రాసుకుని పిండి చల్లాలి (లేదా బటర్ పేపర్ పెట్టాలి). మిశ్రమాన్ని అందులో సమానంగా సర్దాలి. మరో వెడల్పాటి పాత్రను తీసుకుని అడుగున ఉప్పు వేసి కొన్ని నీళ్లు పోసి స్టాండ్ పెట్టి వేడయ్యాక కలిపి పెట్టిన మిశ్రమం గిన్నెను ఉంచి 20 నిమిషాలు ఆవిరి మీద ఉడికించాలి.





## కోకోనట్ కాజు

కావాల్సినవి: బొంబాయి రవ్వ పావుకప్పు, తురిమిన పచ్చికొబ్బరి పావుకప్పు, కొబ్బరిపాలు 5 చెంచాలు, ఉప్పు చిటికెడు, బేకింగ్ పౌడర్ 3 చెంచాలు, బేకింగ్ సోడా అరచెంచా, యాలకుల పొడి అరచెంచా, నెయ్యి కప్పు, చక్కెర కప్పు, జీడిపప్పులు గుప్పెడు. తయారీ: ఒక పాత్రలో రవ్వ, కొద్దిగా కొబ్బరి తురుము, ఉప్పు, బేకింగ్ పౌడర్, సోడా కొబ్బరిపాలు, యాలకుల పొడి, నెయ్యి, చక్కెర వేసి మొత్తం కలపాలి. తర్వాత ఓ పాన్‌లో కొబ్బరి తురుము వేసి 2 నిమిషాలపాటు వేయించి తీసి అదే పాన్‌లో జీడిపప్పులను కాసేపు వేయించి పక్కకు పెట్టుకోవాలి. కేక్ టినికి నూనె రాసి బటర్ పేపర్ పెట్టి కలిపిన మిశ్రమాన్ని వేసి జీడిపప్పులను గార్నిష్ వేసుకోవాలి.

## బాలామృతం

కావాల్సినవి: బాలామృతం పిండి కప్పు, చక్కెర అరకప్పు, పాలు పావుకప్పు, నెయ్యి పావుకప్పు, బేకింగ్ సోడా అరచెంచా, గుడ్లు 2, నూనె పావుకప్పు. తయారీ: మిక్సీలో బాలామృతం, చక్కెర వేసి మెత్తగా ఆడించాలి. తర్వాత ఒక పాత్రలో మిక్సీ పట్టిన పిండి, గుడ్ల సొన, నెయ్యి, బేకింగ్ సోడా, పాలు వేసి బాగా గిలకొట్టాలి. కాస్త జారుగా కలపాలి. కేక్ పాన్ తీసుకుని నూనె రాసి, అందులో ఈ మిశ్రమాన్ని వేసి స్ప్రెడ్ చేయాలి. ఒక పాత్ర తీసుకుని అడుగున ఉప్పు, కొద్దిగా నీళ్లు పోసి స్టాండ్ పెట్టి వేడయ్యాక కలిపి పెట్టిన మిశ్రమం గిన్నెను ఉంచి 25 నిమిషాలు ఉడికించాలి.



# ఆర్కిటెక్చర్‌తో కొత్త పరిష్కారాలు చూపిస్తూ..

**ఆర్కిటెక్చర్‌లో కొత్త పరిష్కారాలు చూపిస్తూ.. భవన నిర్మాణం అంటే సిమెంట్, స్టీల్ మాత్రమే కాదు... ఇల్లు అంటే నాలుగు గోడల మధ్య బతకడం అంతకన్నా కాదు... మనిషికీ, మనసుకీ భద్రత ఇచ్చే స్థలం. ప్రకృతితో మనిషిని కలిపే వేదిక కానీ నేటి నిర్మాణ రంగంలో ప్రకృతితో అనుబంధాన్ని కోల్పోతున్నాం. ఈ పరిస్థితిని మార్చేందుకే సస్టెయినబుల్ ఆర్కిటెక్చర్‌తో కొత్త పరిష్కారాలు చూపిస్తున్నారు సాత్విక తాడూరు. ఆమె లింక్ ఎకో గ్రీన్ వ్యవస్థాపకురాలు. ఆమె గూర్చి తెలుసుకుందాం..**



నాన్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ కావడంతో ఏటా కొత్త మారుతూ ఉండాల్సి వచ్చింది. అలా హరియాణా, జమ్మూకాశ్మీర్, గ్వాలియర్, బాపట్ల... ఇలా పలు చోట్ల నా చదువు సాగింది. చిన్నప్పుడు అమ్మానాన్నలు నన్ను తరచూ విహారయాత్రలకు తీసుకెళ్లేవారు. అలా నేను ఎక్కువ చారిత్రక ప్రదేశాలు తిరిగేదాన్ని. ముఖ్యంగా పురాతన గుడులు, గుహ లు, కోట్లు ఆసక్తిగా చుట్టొచ్చేదాన్ని రాయితో చెక్కిన విగ్రహాలు, గోడల మీద కథలు చెప్పే శిల్పాలు, నిర్మాణాలు. ఇవన్నీ వందల ఏళ్లుగా నిలిచిపోయాయి. కానీ, ఇప్పుడు కడుతున్న ఇళ్లు ఎందుకు అలా లేవు? అన్న ప్రశ్నలే నాలో ఆర్కిటెక్చర్ పట్ల ఆసక్తి రేకెత్తించాయి. దీనికోసం ఆలిండియా స్థాయిలో మంచి ర్యాంకు సాధించి విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో చేరారు. కానీ, అక్కడ నేర్చుకున్నది సిమెంట్, స్టీల్, గాజుతో కూడిన మోడరన్ బిల్డింగ్స్ గురించి మాత్రమే. పురాతన సాంకేతికత, నిర్మాణ శైలి, మెటీరియల్స్, ప్రకృతికి అనుగుణమైన డిజైన్లు.... ఇలా వీటికి సంబంధించిన విషయాలేవీ పాఠ్యాంశాల్లో కనిపించలేదు. 2015లో నా చదువు పూర్తయింది. అదే సమయంలో నేపాల్‌లో ఘోర భూకంపం వచ్చింది. ఊళ్లకు ఊళ్లే నేలమట్టం అయ్యాయి. ఎన్నో జీవితాలు రోడ్డునపడ్డాయి. ఈ వార్తల్ని చూసిన నేను అక్కడికి వెళ్లాలన్న నిర్ణయానికి వచ్చా. ముఖ్యంగా డిస్ట్రక్షన్ తర్వాత రీకన్‌స్ట్రక్షన్ ఎలా జరుగుతుంది? ఒక ఆర్కిటెక్ట్ సమాజానికి నేను ఏమి చేయగలను? అనుకుంటూనే ఆ దేశంలో అడుగుపెట్టా. పునరావాస పనుల్లో నిమగ్నమైన కాన్షియస్ ఇంపాక్ట్ అనే అంతర్జాతీయ ఎన్జీవోతో కలిసి పనిచేయడం ప్రారంభించింది.

టెంట్లలో నివసిస్తూ, మా వంట మేమే చేసుకుంటూ గడిపేశాం. 80 శాతం మట్టి 20 శాతం ఇసుక కొద్దిగా సున్నం లేదా సిమెంట్ వాడి... బట్టీల్లో కాల్చకుండా 60 రోజుల పాటు ఎండలో ఆరబెట్టి రెడ్ బ్రిక్స్ కంటే నాణ్యమైన భారీ ఇటుకల్ని తయారుచేశాం. కాబట్టి పిల్లర్స్ లేకుండానే మూడంతస్థుల నిర్మాణం చేయొచ్చు. అలా భూకంప ప్రభావిత ప్రాంతంలో ఇరవై ఇళ్లు, ఓ స్కూల్, మహిళా సహకార సంఘ భవనం నిర్మించాం. స్థానిక మేస్త్రీలకు ఈ టెక్నాలజీ నేర్పించాం.

**భారత్‌లోనూ....** భారత్‌కు తిరిగివచ్చాక గుజరాత్‌లోని హన్నార్‌శాల ఫౌండేషన్‌లో చేరింది. ఇక్కడ ఆర్కిటెక్చర్‌కు కొత్త అర్థం దొరికింది. భవనాలు కాదు ముందు మనుషులే ముఖ్యం అనిపించింది. మహారాష్ట్ర అహ్మద్‌నగర్ సమీపంలో జరిగిన స్లమ్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లో 150 కుటుంబాలతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి ఇళ్లను డిజైన్ చేశాం. ఇదో గొప్ప అనుభవం. కోవిడ్ సమయంలో అమ్మానాన్నల దగ్గరకు హైదరాబాద్ తిరిగొచ్చా. ఇక్కడే ఉండాలనుకోవడంతో పాటు సైకాలజీలో మాస్టర్స్ చేయాలనే నిర్ణయించుకున్నా. మనిషి భావోద్వేగాలు అర్థం కాకుండా ఇల్లు డిజైన్ చేయడం సాధ్యం కాదు అనే నమ్మకమే ఇందుకు కారణం. ఆతర్వాతే.. లింక్ ఎక్ గ్రీన్ పేరుతో సంస్థను ఆరంబిచా. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నమూనా ఇళ్లను నిర్మించాం. సస్టైనబిలిటీని ఖరీదైన ట్రెండ్‌గా కాకుండా వసరమైన మార్గంగా చూపించాలనుకుంటున్నా.

# పిల్లల గురించి అధికంగా ప్రార్థించాల్సిందే..

'నీ కాలమునకు ముందుగా నీవేల చనిపోవుదువు?' (ప్రసంగి 7:17), 'నీతిమంతులు నశించుట చూచి యెవరును దానిని మనస్సున పెట్టరు, భక్తులైనవారు తీసికొనిపోబడుచున్నారు. కీడు చూడకుండా వారు విశ్రాంతిలో ప్రవేశించుచున్నారు' (యెషయా 57:1). పైరెండు వాక్యాలను మనం గమనిస్తే..మొదటి వాక్యం మన కాలానికి ముందే మనం చనిపోకూడదు. అంటే ఆత్మహత్య చేసుకోకూడదు. దేవుడు మనల్ని పుట్టించాడు అంటే మనపట్ల ఒక ప్రత్యేకమైన ఉద్దేశం ఉంటుంది. నిరాశలు, కృంగుబాటులు, నిర్వేదనలు మనల్ని ఆవరిస్తాయి. ఆర్థిక, ఆరోగ్య, కుటుంబ సమస్యలు మనల్ని ఉప్పెనలా ముంచెత్తుతాయి. బతకాలనే ఆశ ఏమాత్రం ఉండదు. మరణాపేక్షతతో అదే ఆలోచనలతో ఉంటారు. అయినా దేవుడిపై మనం భారాన్ని వేయాలి. ఆయన సన్నిధిలో ప్రార్థించాలి. దేవుడు పరిష్కరించలేని సమస్యలు అంటూ ఏవీ లేవు. ఆయనకు సమస్తం సాధ్యమే. కాకపోతే మనం కాస్త ఓపిక, గుండె దిట్టచేసుకునే విధానాన్ని అలవాటు చేసుకోవాలి.



ప్రభువుకే మనం విన్నవించుకుని, ఆయనపై విశ్వాసాన్ని ఉంచాలి. నేటికాలంలో ప్రత్యేకంగా యువత ఎంతో ఒత్తిడిలో పయనిస్తున్నది. వారిచుట్టూ కెరీర్‌పరంగా, గాడ్జెట్లపరంగా వారిని నిత్యం టెన్షన్లకు గురిచేస్తున్నాయి. పైగా వారిలో ఆవేశం అధికంగా ఉంటుంది. కాబట్టి మన పిల్లల గురించి మనం ఎంతో ప్రార్థించాల్సిన అవసరం ఉంది. సాతాను యవ్వనస్తులను టార్గెట్ చేసుకుని, వారిని నిత్యనరకంలోకి లాగుతున్నాడు. నిజంగా మనం మన పిల్లల్ని కాపాడుకోవడం ఒక సవాలుతో కూడిన పని. కానీ మనకు యేసుక్రీస్తు అండగా ఉన్నాడు. ప్రార్థన అనే కంచె మన పిల్లలకు వేయాల్సిన అవసరం ఉంది. అందుకే మన ఆధ్యాత్మిక జీవితంలో నిత్యం ఆత్మపరిశీలన చేసుకుంటూ, దేవుడిపై విశ్వాసంతో ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-పి.వాణిపుష్ప

అంతర్వాణి

# దోమల్ని తరిమే నూనెలివి

ఆహార వ్యర్థాలు, తేమ, నిలిచిన నీరు, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం ఇలా ఎన్నో కారణాల వల్ల బొద్దింకలు, పురుగులు ఇంట్లో చేరుతుంటాయి. వీటిని సహజంగా సులువుగా తరిమేయాలంటే.. 1.పావుకప్పు ఆవనూనెలో, ఐదారు పుదీనా ఆకులు వేసి మరగనివ్వాలి. ఆ మిశ్రమాన్ని వడకట్టి ఓసాలో పోసుకోవాలి. ఇప్పుడు గ్లాసు నీళ్లలో అరచెంచా ఈ నూనెను కలిపి వంటగది మూలల్లో స్ప్రే చేయండి. కొన్ని రోజులు ఇలా చేస్తే బొద్దింకలు దరిచేరవు.

2.వేప నూనె సహజ క్రిమి సంహారిణిగా పనిచేస్తుంది. పావులీటరు నీటిలో చెంచా వేపనూనె, అరచెంచ వంట సోడ కలపాలి. దాన్ని అవసరమైన చోట స్ప్రే చేయండి. పావుగంట తర్వాత దోమలే కాదు... చిన్న చిన్న పురుగులు కూడా పోతాయి. ఇక, బొద్దింకలు పోవాలంటే.

. నిమ్మ చెక్కపై కాస్తవేప నూనె అద్ది... సింకుల కింద, మురికి నీళ్ల గొట్టాలు, తలుపు మూలల్లో పెడితే సరి. వాటికి అడ్డుకట్ట వేయొచ్చు.

3. నిమ్మగడ్డి నూనె ఘాటైన వాసనకు బొద్దింకలు పరారవుతాయి. లీటరు నీటిలో కాస్త బేకింగ్ సోడా, నాలుగైదు చుక్కల నిమ్మగడ్డి నూనెను కలిపి... వంటింటి గట్టు, గోడలు తుడవండి. మూలల్లో స్ప్రే చేయండి.



# తేనెతో ఇలా చేశారా ?

అందానికి తేనెని వాడటం కొత్త విషయమేమీ కాదు కదూ! చాలావరకూ ఫేస్ ప్యాక్ వాడుతూనే ఉంటారు. కానీ సబ్బు, ఫేస్‌వష్‌లకు బదులుగా క్లెన్సర్గా వాడారా? ఇది క్లెన్సింగ్లో చాలా బాగా ఉపయోగ పడుతుందట. కాబట్టే, సోషల్ మీడియాలో 'హనీ క్లెన్సర్' ట్రెండ్ నడుస్తోంది. అంటే ఏమీ లేదు... సబ్బు, ఫేస్‌వాష్ స్థానంలో ముఖం శుభ్రతకు దీన్ని వాడటమే. ముఖాన్ని నీటితో కడిగి, ఓ స్పూను తేనెను పట్టించి కొన్ని సెకన్లపాటు మర్దన చేయాలి. ఆపై గోరు వెచ్చని నీటితో కడిగేయాలి. తరవాత నచ్చిన మాయిశ్చరైజర్ రాస్తే సరి. తేనెకి సహజ క్లెన్సర్గా పేరు. పైగా ఇది మురికిని పోగొట్టడమే కాదు... మిగిలిన ఫేస్‌లల్ల చర్మాన్ని పొడిబాం నీయదు. అంతేకాదు, తేమని అందిస్తూనే తాజాగానూ ఉంచుతుంది. ఆటాన్ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలెక్కువ. దీనితో మొటిమలు, ఎరుపుదనం వంటివాటిని దూరంగా ఉంచుతుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్నాయి కాబట్టే, అమ్మాయిలు తెగ ప్రయత్నిస్తున్నారు. అయితే సహజ తేనేనా కాదా అన్నది చూసుకోవాలి. ఓసారి ప్రయత్నించి చూడండి మరి.



# నెత్తుటి క్లబ్బులో విధ్వంసం



వరస ఫ్లాపులతో సతమతమవుతున్న విశ్వక్ సేన్ తిరిగి దర్శకత్వంలోకి వచ్చేశాడు. ఫలక్ నుమా దాస్, దాస్ కా ధమ్కీ తర్వాత కల్ట్‌తో మెగా ఫోన్ పట్టుకున్నాడు. కథ స్క్రీన్ ప్లే కూడా సమకూర్చుకుని మాటలు మాత్రం తరుణ్ భాస్కర్‌కి ఇవ్వడం విశేషం. టాలీవుడ్ మొదటి స్లాషర్ మూవీగా దీని గురించి విశ్వక్ ప్రత్యేకంగా ప్రమోషన్ చేస్తున్నాడు. చిన్నపిల్లలు, సున్నిత మనస్కులు దూరంగా ఉండమంటూ ముందే హింట్ ఇవ్వడం ద్వారా కంటెంట్ ఏ స్థాయిలో ఉందో అవగాహన కలిగిస్తున్నాడు. మొత్తానికి మూడు నిమిషాలకు దగ్గరగా ఉన్న టీజర్ లాంచ్ ఇవాళ హైదరాబాద్ పీసీఎక్స్ స్క్రీన్‌లో ఘనంగా జరిగింది. కథను దాచలేదు. గోవాలో కల్ట్ పేరుతో ఈవెంట్ జరుగుతుంది. దాంట్లో పాల్గొనే వాళ్ళు ఒక విలాసవంతమైన భవంతిలోకి అడుగు పెట్టాలి. ఇష్టమొచ్చినట్టు ఎంజాయ్ చేయొచ్చు. జీమూమ్బా అనే యానిమేషన్ క్యారెక్టర్ వచ్చి మీకు గేమ్స్ పెడతామని చెప్పి ఊరిస్తుంది. వందల్లో వచ్చిన యువతీ యువకులు ఉత్సాహంగా సరేనంటారు. ఎలిమినేట్ అయినవాళ్లకు చాలా దారుణమైన మరణశిక్ష ఉంటుంది. ఎటువైపు నుంచి కత్తి వస్తుందో అర్థం చేసుకునే లోపే తల, శరీర భాగాలు తెగిపడి ఉంటాయి. బయటికి వెళ్లే ఛాన్స్ ఉండదు. అప్పుడు వస్తాడు అసలు నిర్వాహకుడు (విశ్వక్ సేన్). ఇదంతా ఏంటి అనేది సినిమాలో చూడాలి. వయొలెన్స్ ని పీక్స్‌కు తీసుకెళ్ళిపోయిన విశ్వక్ సేన్ ఈసారి ప్యూర్ అడల్ట్స్ కంటెంట్ ఎంచుకున్నాడు. బ్లాక్ బస్టర్ వెబ్ సిరీస్ స్క్విడ్ గేమ్ ని స్ఫూర్తిగా తీసుకున్న వైనం కొన్ని సీన్స్ లో కనిపిస్తోంది. రవి బస్రూర్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ దానికి తగ్గట్టే ఉంది.

# 47 ఏళ్ల తర్వాత...



గత నలభై ఏడు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న సిల్వర్ స్క్రీన్ కాంబినేషన్ ఎట్టకేలకు ప్రారంభం కాబోతోంది. రజనీకాంత్, కమల్ హాసన్ హీరోలుగా నెల్సన్ దర్శకత్వంలో రూపొందబోయే భారీ ప్యాన్ ఇండియా మూవీ అనౌన్స్ మెంట్ ఇవాళ వీడియో రూపంలో వచ్చేసింది. ఏదో మొక్కుబడిగా నాలుగు కట్స్, రెండు ఫోటోలు వేయడం లాంటివి కాకుండా ప్రత్యేకంగా షూటింగ్ చేసి మరీ క్లిప్ వదిలారు. సూట్లు, బూట్లు, వాచీలు ఎంచుకోవడం దగ్గరి నుంచి ఒకే కారులో ఇద్దరు ప్రయాణించే దాకా నెల్సన్, అనిరుధ్ రవిచందర్ కలిసి చేసిన మేజిక్ మాములుగా లేదు. ఆహా ఏమీ కనువిందు అనుకునేలా ప్రెజెంట్ చేశారు. బ్యాక్ గ్రౌండ్ చూస్తుంటే ఇది రెట్రో వింటేజ్ స్టైల్ లో రూపొందే గ్యాంగ్ స్టర్ డ్రామాలా కనిపిస్తోంది. సెటప్ కూడా ఎనభై తొంభై దశకం నాటిదనే క్లూస్ ఇచ్చారు.

# యశ్ డ్యూయల్ రోల్



కన్నడ రాకింగ్ స్టార్ యశ్‌ను గడ్డం లేకుండా చూశారా? అదీ ఈ మధ్య కాలంలో!? కన్నడ ప్రేక్షకులు అయితే చూసే ఉంటారు. కానీ పాన్ ఇండియా ప్రేక్షకులకు గడ్డం లేని యశ్ గుర్తుకు వచ్చే అవకాశాలు చాలా అంటే చాలా తక్కువ. కేజీఎఫ్‌తో ఆయన నేషనల్ లెవల్ స్టార్‌డమ్ వచ్చింది. అందులో రాకీ భాయ్ పాత్రలో ఫుల్ గడ్డంతో కనిపించారు. ఆ తర్వాత ఆయన హీరోగా యాక్ట్ చేస్తున్న సినిమా టాక్సిక్. అందులోనూ గడ్డంతో ఉన్నారు. కానీ, ఇప్పుడు మరో లుక్ రిలీజ్ చేశారు. అదీ గడ్డం లేకుండా! టాక్సిక్ సినిమాలో యశ్ డ్యూయల్ రోల్ చేస్తున్నారు. రాయ పాత్రలో ఆయన లుక్ ఎప్పుడో రిలీజ్ చేశారు. టాక్సిక్ టీజర్ ఎండింగ్ చూశారా? గడ్డం లేకుండా చాలా సన్నగా కనిపించారు యశ్. అది మరొక లుక్. అంటే... ఈ మూవీలో ఆయన డ్యూయల్ రోల్ చేస్తున్నారన్నమాట. గడ్డం లేని యశ్ లుక్ శనివారం రిలీజ్ చేశారు. ఆ క్యారెక్టర్ పేరు టికెట్ అని తెలిపారు. అది చూశాక చాలా మందికి యానిమల్ గుర్తుకు వస్తోంది.

# భిన్నమైన పాత్రలలో



బ్యూటిఫుల్, టాలెంటెడ్ హీరోయిన్ నభా నటేష్‌కు ఈ సమ్మర్ ఎంతో స్పెషల్‌గా ఉండబోతోంది. ఆమె నటించిన రెండు భారీ పాన్ ఇండియా చిత్రాలు స్వయంభు, నాగబంధం. ఈ వేసవి విడుదలకు సిద్ధమవుతున్నాయి. భిన్నమైన కథా నేపథ్యాలతో తెరకెక్కిన ఈ రెండు చిత్రాల్లో నభా డిఫరెంట్ రోల్స్‌లో ప్రేక్షకుల్ని అలరించబోతోంది. నాగబంధం చిత్రంలో పార్వతి క్యారెక్టర్‌లో, స్వయంభు చిత్రంలో సుందరవల్లి అనే యువరాణి పాత్రలో ఆమె నటిస్తోంది. ఈ రెండు చిత్రాలతో ఆమె సాలిడ్ లైనప్ చేసుకుందని చెప్పుకోవచ్చు. స్వయంభు, నాగబంధం చిత్రాల్లోని కంటెంట్ ఆడియెన్స్‌కు రీచ్ అయితే నభా నటేష్ హీరోయిన్‌గా మరో స్థాయికి వెళ్ళడం ఖాయం. ఈ రెండు చిత్రాల విజయాల పట్ల, తన క్యారెక్టర్స్‌కు రాబోయే రెస్పాన్స్ పట్ల నభా నటేష్ కాన్ఫిడెంట్‌గా ఉంది. ఇప్పటికే స్వయంభు, నాగబంధం చిత్రాల టీజర్స్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది. విశేషం ఏమంటే తెలుగులో నభా నటేశ్, నిధి అగర్వాల్ ఇస్మార్ట్ శంకర్ మూవీలో కలిసి నటించారు. వీరిద్దరికీ తెలుగులో అది మూడో చిత్రం. ఆ తర్వాత ఇద్దరూ పెద్ద విజయాలను అందుకోలేదు. అయితే... నిధి అగర్వాల్ నటించిన రెండు పాన్ ఇండియా మూవీస్ హరిహర వీరమల్లు, ది రాజా సాబ్ ఒకదాని తర్వాత ఒకటి వచ్చాయి. కానీ ఈ రెండు సినిమాలు సక్సెస్ సాధించలేదు. ఇప్పుడు అలానే నభా నటేశ్ నటించిన రెండు పాన్ ఇండియా సినిమాలు స్వయంభు, నాగబంధం ఒక దాని వెనుక ఒకటి వస్తున్నాయి. మరి నభా నటేశ్ అయినా... ఈ సినిమాలతో విజయాన్ని అందుకుంటుందేమో చూడాలి. ఇందులో స్వయంభు ఏప్రిల్ 10న విడుదల కానుంది.



# త్రిగుణ్, పదినే కుమార్ జంటగా ఆకర్షిత

త్రిగుణ్ హీరోగా సూరిశెట్టి కిశోర్ తెరకెక్కిస్తున్న సినిమా ఆకర్షిత. ఈ సినిమా ద్వారా తమిళ నటి పదినే కుమార్ తెలుగులోకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తోంది. శనవారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో మొదలైంది. ఈ సినిమాలో రాజ్ కుమార్ కసిరెడ్డి, అదుర్స్ రఘు, సత్యం రాజేశ్, రవివర్మ, ప్రియ ఇతర ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. కోరె సందీప్ యాదవ్, శ్రీకాంత్ బట్టు సంయుక్తంగా ఆకర్షిత సినిమాను నిర్మిస్తున్నారు. ప్రముఖ సినిమాటో గ్రాఫర్ షేక్ హజారత్ (వలి) కెమెరామెన్‌గా పని చేయనున్నారు. శనివారం జరిగిన పూజా కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి వేణు స్వామి , ప్రముఖ నిర్మాత దామోదర ప్రసాద్, సి. కళ్యాణ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.


# రీల్ లైఫ్‌లోనూ రియల్ లైఫ్ భార్యాభర్తలు

జ్యోతి పూర్వజ్, పూర్వజ్ లీడ్ రోల్స్ చేస్తున్న సినిమా కిల్లర్. ఈ సినిమాను పూర్వజ్ డైరెక్ట్ చేయడంతో పాటు ఎ. పద్మనాభ రెడ్డితో కలిసి నిర్మించారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను ప్రముఖ దర్శకులు అనిల్ రావిపూడి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి మాట్లాడుతూ, టీజర్ చాలా బాగుంది. సై ఫై, థ్రిల్లర్ జానర్స్ కలిపి ఈ సినిమాను రూపొందించారు. కాంబినేషన్స్ వెరైటీగా ఉన్నాయి. బాగా ఎగ్జిక్యూట్ చేశారు. పూర్వజ్ నాకు చాలా కాలంగా తెలుసు. అప్పుడప్పుడు కలుస్తుంటాడు. ఈ సినిమాకు సంబంధించిన సీక్వెన్స్ కొన్ని చూపించాడు. చాలా బాగున్నాయి. జ్యోతిగారిని ఎన్నో సీరియల్స్‌లో చూశాం. ఇప్పుడు ఈ మూవీలో ఆమె ట్రాన్స్‌ఫర్మేషన్ షాకింగ్‌గా ఉంది. యాక్షన్ సీన్స్‌లో బాగా చేశారు. రియల్ లైఫ్‌లో భార్యాభర్తలు ఈ రీల్ లైఫ్‌లో ఎలా చేశారు? అనేది ఆసక్తికరంగా ఉంది అని అన్నారు. హీరోయిన్ జ్యోతి పూర్వజ్ మాట్లాడుతూ, ఎంతో బిజీగా ఉన్నా మా మూవీ టీజర్‌ను అభిమానంతో అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. చిన్న సినిమాలను ఎంకరేజ్ చేయడంలో ఆయన ముందుంటారు. కెరీర్‌లో పీక్ స్టేజ్‌లో ఉన్న ఈ టైమ్‌లో కూడా చిన్న చిత్రాలకు సపోర్ట్ చేస్తున్న ఆయన పెద్ద మనసుకు థ్యాంక్స్ అని అన్నారు. డైరెక్టర్ పూర్వజ్ మాట్లాడుతూ, అనిల్ చాలా హెక్టిక్ వర్క్‌లో ఉన్నారు. నేను ఆయనతో మాట్లాడినప్పుడు మీరు ఫ్రీగా ఉన్నప్పుడు టీజర్ రిలీజ్ చేద్దాం సార్ అన్నాను. కానీ ఆయన మనం పాజిటివిటీ స్ప్రెడ్ చేయాలి. కొత్త వాళ్లకు మన వంతు ప్రోత్సాహం ఇవ్వాలి అంటూ టీజర్ రిలీజ్ చేశారు. అనిల్ పాజిటివిటీ మా టీమ్‌కు కూడా రావాలి. ఆయనకు మా టీమ్ అందరి తరపున థ్యాంక్స్ చెబుతున్నాను. అతి త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తాంఖి అని అన్నారు.



తెర

## సరస్వతి అవసరమైతే
# కాళీగా మారుతుంది




డిఫరెంట్ రోల్స్‌తో తనకంటూ స్పెషల్ క్రేజ్ సంపాదించుకున్న నటి వరలక్ష్మి శరత్ కుమార్. హై కాన్సెప్ట్ థ్రిల్లర్ సరస్వతి మూవీతో ఆమె డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు.

కేవలం డైరెక్షన్ మాత్రమే కాకుండా ఇందులో కీలకపాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు. స్కూలుకు వెళ్లిన తన కూతురు మిస్సింగ్ కావడంతో పోలీసులకు కంప్లైంట్ చేస్తుంది ఓ మహిళ. ఇదే టైంలో మరో మహిళ కూడా స్కూలులో తన పాప కోసం వెతుకుతుంటుంది. అసలు ఆ పాప ఎవరు? ఎలా మిస్ అయ్యింది? పాప కోసం వెతుకుతున్న ఆ తల్లులు ఎవరు? వారికి ఏమైనా మానసిక సమస్య ఉందా? అనేది తెలియాలంటే మూవీ చూడాల్సిందే. సరస్వతి అనే అమ్మాయి మిస్సింగ్ కేసు చుట్టూ ఈ మూవీ సాగుతుందని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. ఈ కేసు గెలవడం చాలా కష్టమని లాయర్ చెప్పడం, ఆడదానికి పుట్టవా.. అడవి జంతువుకు పుట్టావా? అని ప్రియమణి చెప్పిన డైలాగులు ఆకట్టుకుంటున్నాయి.

ఈ మూవీకి వరలక్ష్మి శరత్ కుమారే దర్శకత్వం వహించగా... తన సోదరి పూజా శరత్ కుమార్‌తో కలిసి నిర్మించారు. తమ ఫస్ట్ ప్రొడక్షన్ బ్యానర్ ఖిదోస డైరేస్ఖి ప్రారంభించి ఫస్ట్ మూవీ ఖిసరస్వతిఖిని నిర్మించారు. వరలక్ష్మి ప్రధాన పాత్రలో నటిస్తుండగా... సమంత కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రకాష్ రాజ్, నాజర్, ప్రియమణి, రావు రమేష్, రాధిక, కిషోర్ కుమార్, జీవా, శ్రీకాంత్ అయ్యర్, సప్తగిరి, మైమ్ గోపి, హరేష్ పరేడే, తులసి, రఘుబాబు, దేవిశ్రీ ప్రసాద్, వెంకట్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. త్వరలోనే రిలీజ్ డేట్ అనౌన్స్ చేయనున్నారు.

# స్వలింగ ప్రేమికులుగా ..?



బాలీవుడ్ ఇండస్ట్రీ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మూవీ కాక్‌టెయిల్ 2. 2012లో దీపికా పదుకోన్, డయానా, సైఫ్ అలీ ఖాన్ నటించిన రోమ్ కామ్ కాక్‌టెయిల్. హోమీ అదాజానియా దర్శకత్వం వహించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. ఇప్పుడు దీనికి సీక్వెల్‌గా కాక్ టెయిల్ 2 రానుంది. షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో నటించనున్న ఈ సినిమాలో కృతి సనన్, రష్మిక నటించనున్నారు. ఇదో ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని తెలుస్తోంది. అయితే, రష్మిక, కృతి రోల్స్‌పై బాలీవుడ్ మీడియాలో తాజాగా ఓ న్యూస్ వైరల్ అవుతోంది. సినిమాలో రష్మిక, కృతి స్వలింగ ప్రేమికులుగా కనిపించనున్నారనే టాక్ వినిపిస్తోంది. అంటే లెస్బియన్ రోల్స్ చేయనున్నట్లు సమాచారం. బాలీవుడ్ మూవీస్‌లో ఈ పాయింట్ టచ్ చేయడం అప్పుడప్పుడూ సహజమే. కానీ ఇద్దరు స్టార్ హీరోయిన్స్ ఆ రోల్స్ చేస్తున్నారా? అనేదే ఇప్పుడు చర్చ. రష్మిక ఈ రోల్ చేయడానికి ఒప్పుకున్నారా? అనేది కూడా సస్పెన్స్. వీరి పాత్రల గురించి ఎలాంటి అనౌన్స్‌మెంట్ రాకపోయినా ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది. మరి త్వరలోనే దీనిపై క్లారిటీ వచ్చే ఛాన్స్ ఉంది.




# అసలైన క్రికెట్ కిక్!

## నేడు భారత్, సౌతాఫ్రికా మ్యాచ్ *సూపర్8లో ఢీ అంటే ఢీ

### ఒత్తిడిలో టీమిండియా.. పైచేయి మాదే-కన్రాడ్

సొంతగడ్డపై టీమిండియా తీవ్ర ఒత్తిడిలో ఉందని, ఇదే అదనుగా ఆ జట్టు బలహీనతలను ఉపయోగించుకుంటామని సౌతాఫ్రికా కోచ్ షుక్రి కన్రాడ్ అన్నారు. సొంతగడ్డపై ఆడుతున్న భారత్‌పై అంచనాలు భారీగా ఉన్నాయి. అందుకే వాళ్లు తీవ్ర ఒత్తిడిలో కూరుకుపోతారన్నాడు. ఒత్తిడిలో బలహీనపడే ఆ జట్టుపై పైచేయి సాధించి గెలుపొందుతామని కన్రాడ్ జోస్యం చెప్పారు.

### వాళ్ల గురించే నా బాధంతా-సూర్య

సౌతాఫ్రికాతో మ్యాచ్‌కు తాము సిద్ధంగా ఉన్నట్లు టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. పరిస్థితులకు అనుగుణంగా తమ బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేసుకుంటామన్నాడు. ప్రత్యర్థి బౌలింగ్ ఎలా ఉన్నా వ్యూహాలకు తగినట్లు ఆడతామని పేర్కొన్నాడు. అభిషేక్ ఫామ్‌లోకి వస్తాడని, అతన్ని ఎదుర్కొనే ప్రత్యర్థి బౌలర్ల గురించే నా బాధంతా అన్నాడు.

**ఆహ్మదాబాద్:** టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ బరిలోకి దిగిన టీమిండియా జోరు మీదుంది. సూపర్8 సమరంలో తన తొలి మ్యాచ్‌ను మరో హాట్ ఫెవరేట్ సౌతాఫ్రికాతో ఆహ్మదాబాద్ వేదికగా నేడు తలపడనుంది. రెండు జట్లు కూడా తమ తమ గ్రూపుల్లో టాప్ ప్లేస్‌లో నిలిచి సూపర్8కు వచ్చాయి. ఆడిన 4 మ్యాచ్‌ల్లోనూ అజేయంగా నిలిచాయి. బిగ్ జట్ల మధ్య జరుగుతున్న సూపర్8 పోరు ఆసక్తి రేపుతోంది. సూపర్8 గ్రూప్-1లో సౌతాఫ్రికా, జింబ్వే, వెస్టిండీస్‌లతో టీమిండియా తలపడుతుంది. ఈసారి టేబుల్ టాపర్స్‌గా ఉన్న జట్లన్నీ ఒకే గ్రూపులో ఉండడంతో టఫ్‌గా మారింది. సొంతగడ్డపై ఆడుతుండడం భారత్‌కు కలిసొచ్చే అంశం.

**అభి కుదిరితే అదుర్స్**

భారత బ్యాటింగ్ చూస్తే చాలా పటిష్టంగా కనిపిస్తున్నా...గ్రూప్ స్టేజ్ తొలి మ్యాచ్‌లోనే డొల్లతనం బయటపడింది. అయితే ఆ తర్వాత పుంజుకుని సూర్యసేన పరుగుల ట్రాక్‌లో పడింది. అయితే డైనమైట్ ఓపెనర్ అభిషేక్ రన్స్ ఖాతా తెరవకపోవడం ఆందోళనపరుస్తోంది. ఆడిన 3మ్యాచ్‌ల్లోనూ గోల్డెన్ డక్ అయ్యారు. అయినా అభిషేక్‌పై టీం మేనేజ్‌మెంట్ నమ్మకంతో ఉంది. ఒక్కసారి అభిషేక్ ట్రాక్‌లో పడితే పరుగుల సునామీనే

**సూపర్ ఫామ్‌లో ఇషాన్**

ఈ మెగాటోర్నీలో ఇషాన్ కిషన్ అద్భుతంగా రాణిస్తూ మెరుపు ఇన్నింగ్స్‌లు అందిస్తున్నాడు. ఆ తర్వాత వచ్చే హైదరాబాదీ తిలక్ చక్కగా పరుగులు సాధిస్తున్నా భారీ స్కోర్లుగా మలచాల్సి ఉంటుంది. మెగా టోర్నీకి ముందు పేలవఫామ్‌తో కెప్టెన్ సూర్యకుమార్ భయపెట్టినా.. పొట్టి ప్రపంచకప్‌లో పరుగుల ట్రాక్‌లో పడ్డాడు. శివమ్ దూబే స్లాగ్ ఓవర్లలో మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడుతూ నమ్మకమైన ఆల్‌రౌండర్‌గా మారాడు. బౌలింగ్‌లోనూ వికెట్లు అందిస్తున్నాడు. బిగ్ హిట్టర్ రింకూ సింగ్...ఆస్థాయి ఇన్నింగ్ బాకీ పడ్డాడు. ఆల్‌రౌండర్లు హార్దిక్, అక్షర్ రూపంలో బ్యాటింగ్ చివరి వరకు బలంగా ఉంది. దక్షిణాఫ్రికాపై బ్యాటింగ్ హిట్టయితే భారీ స్కోరుకు తిరుగుండదు.

**బుమ్ బుమ్ బౌలింగ్**

బుమ్రా, హార్దిక్ పాండ్య, అర్షదీప్‌సిగ్ రూపంలో పేస్ అటాక్, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ రూపంలో స్పిన్ ద్వయం చక్కగా వికెట్ల వేటలో ఉన్నారు. ముఖ్యంగా నెంబర్ వన్ వరుణ్ చక్రవర్తి.. ప్రతి జట్టును ఇబ్బంది పెడుతున్నఆడు. భారత్ బౌలింగ్ డిపార్ట్‌మెంట్ దక్షిణాఫ్రికా బ్యాటింగ్‌ను కట్టడి చేసే భారత్ విజయానికి తిరుగుండదు.

**ఢీ అంటున్న సఫారీలు**

హాట్ ఫేవరెట్లలో ఒక టైన సౌతాఫ్రికా బ్యాటింగ్, బౌలింగ్‌లో పటిష్టంగానే ఉంది. కెప్టెన్ మార్‌క్రమ్ 4 ఇన్నింగ్స్‌లో 178రన్స్‌చేసి టాప్‌ఫామ్‌లో ఉన్నాడు. రికెల్టన్, డేవిడ్ మిల్లర్ కూడా పరుగులు సాధిస్తున్నారు. ఏబీడీగా పేరొందిన డెవాల్డ్ బ్రెవిస్, క్వింటన్ డికాక్, ట్రిస్టన్ స్టబ్స్ కుదురుకుంటే పరుగుల వరదే. యాన్సన్ కూడా ప్రమాదకర బాట్స్‌మెన్. లోయర్ ఆర్డర్‌లో భారీ షాట్లు కొట్టగల సమర్థుడు. ఇక లుంగిడి ఎంగిడి, కగిసో రబడ, యాన్సన్, కేశమ్ మహరాజ్‌తో కూడిన బౌలింగ్ ప్రత్యర్థిని కట్టడిచేసే స్థాయిలో ఉంది.

**భారత్‌దే పైచేయి**

భారత్‌దే పైచేయి టీ20ల్లో సౌతాఫ్రికాపై టీమిండియాదే పైచేయిగా ఉంది. మెగా టోర్నీకి ముందు భారత్‌లో పర్యటించిన సౌతాఫ్రికాపై 3-1తో సూర్యసేన నెగ్గింది. అలాగే టీ20 ప్రపంచకప్‌లో భారత్-సౌతాఫ్రికా 7 సార్లు తలపడగా.. టీమిండియా 5సార్లు, సఫారీలు రెండుసార్లు నెగ్గాయి. అహ్మదాబాద్ పిచ్ బ్యాటర్లకు అనుకూలించే అవకాశం ఉంది. భారీ పరుగులు ఖాయం. ఇక డ్యూ కూడా కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.



**భారత జట్టు(అంచనా):** అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శివమ్ దూబే,హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్, బుమ్రా, వరుణ్ చక్రవర్తి

**దక్షిణాఫ్రికా జట్టు(అంచనా):** ఎడెన్ మార్‌క్రమ్(కెప్టెన్), క్వింటన్ డికాక్, ర్యాన్ రికల్టన్,డీవాల్డ్ బ్రెవిస్, డేవిడ్ మిల్లర్,ట్రిస్టన్ స్టబ్స్,మార్కో జన్సన్, కోర్బిన్ బాచ్, కగిసో రబడ, కేశవ్ మహారాజ్, లుంగిడి ఎంగిడి.

## మ్యాచ్ వర్షార్పణం

### పాక్, కివీస్‌కు చెరో పాయింట్

**కొలంబో:** టీ20 ప్రపంచకప్ సూపర్ 8 ఆరంభ మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా నిలిచింది. ఒక్క బంతి కూడా పడకుండానే పాకిస్థాన్, న్యూజిలాండ్ మ్యాచ్ రద్దయ్యింది. టాస్ పడడమే ఆలస్యం ప్రేమదాస స్టేడియాన్ని ముంచెత్తిన వర్షం.. ఎంతకూ తగ్గలేదు. టాస్ గెలిచిన పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అఘా బ్యాటింగ్ ఎంచుకున్న కాసేపటికే.. చినుకులు షురూ అయ్యాయి. కనీసం ఐదు ఓవర్ల ఆటైనా జరిపించాలనుకున్నా సాధ్యపడలేదు. వర్షం బ్రేకివ్వకపోవడంతో నాలుగు గంటలు వేచి చూసిన అంపైర్లు చివరకు ఆటను రద్దు చేసి ఇరు జట్లకు ఒక్కో పాయింట్ కేటాయించారు.

ప్రపంచకప్ మ్యాచ్‌కు వర్షం అడ్డుపడడం ఇది రెండోసారి. లీగ్ దశ గ్రూప్-బిలోని ఐర్లాండ్ జింబాబ్వే మ్యాచ్ వర్షార్పణం కావడం ఆస్ట్రేలియా కొంపముంచింది. ఈసారి సూపర్ 8లో మొదటి మ్యాచ్‌కే అంతరాయం కలిగించాడు. సూపర్8 ఒక్కో జట్టు మూడు మ్యాచ్‌లు ఆడుతుంది. టాప్2లో నిలిచిన జట్లు సెమీస్ చేరతాయి.

## నేటితో ముగియనున్న వింటర్ ఒలింపిక్స్


క్లాబో విక్టరీ స్టాండ్

### మెడల్స్ టాప్‌లో నార్వే

### 11 స్వర్ణాలతో క్లాబో రికార్డు

**మిలానో:** ఇటలీ అతిథ్యమిచ్చిన వింటర్ ఒలింపిక్స్ నేటితో ముగియనున్నాయి. ఈ రోజు మిలానో వేదికగా ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. 16 క్రీడాంశాలు, 116 విభాగాల్లో జరిగిన ఈ వింటర్ ఒలింపిక్స్‌లో పలు రికార్డులు బద్దలయ్యాయి. నార్వేకు చెందిన జోహన్నెస్ క్లాబో ఆల్‌టైమ్ రికార్డుతో ఏకంగా 11 స్వర్ణాలు గెలుపొందారు. ఈ క్రమంలో ముగ్గురు స్వదేశీయులను అధిగమించారు.

పతకాల పట్టికలో నార్వే దూసుకుపోయింది. మంచు కొండల్లో మెడల్స్ పంట పండించింది. మొత్తం 40 పతకాలతో టాప్ ప్లేస్‌లో నిలిచింది. అందులో 16 స్వర్ణాలు, 11 సిల్వర్, 11 బ్రాంజ్ మెడల్స్ ఉన్నాయి. అగ్రరాజ్యం అమెరికా ఈసారి రెండోస్థానంతో సరిపెట్టింది. 11 స్వర్ణాలు, 12 సిల్వర్, 7 బ్రాంజ్ మెడల్స్‌తో సహా మొత్తం 30 పతకాలు సాధించింది. చివరి రోజుకు వచ్చేసరికి అతిథ్య ఇటలీ మూడో స్థానానికి పడిపోయింది. 10 గోల్డ్ మెడల్స్, 6 సిల్వర్, 13 బ్రాంజ్ మెడల్స్‌తో మొత్తం 29 పతకాలతో సరిపెట్టింది. ఫ్రాన్స్ 23 మెడల్స్‌తో, నెదర్లాండ్స్ 18 మెడల్స్‌తో టాప్-5లో నిలిచాయి. నలుగురు అథ్లెట్లతో బరిలోకి దిగిన భారత్ శూన్యహస్తాలతో నిలిచింది.

## భారత్ ఫుట్‌బాల్ జట్టుకు..

### సౌమ్య గుగులోత్ ఎంపిక

**న్యూఢిల్లీ:** ఆసియాకప్ మహిళల ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే భారత జట్టుకు తెలంగాణకు చెందిన సౌమ్య గుగులోత్ ఎంపికయింది. 26 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ఆలిండియా ఫుట్‌బాల్ సమాఖ్య ప్రకటించింది. ఆస్ట్రేలియా వేదికగా వచ్చేనెలలో ఈ టోర్నీ జరగనుంది.

గ్రూప్-సిలో ఉన్న భారత్.. మార్చి 4న పెర్త్‌లో వియత్నాంతోతొలి మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత మార్చి7న జపాన్‌తో, మార్చి 10న చైనీస్ తైపీతో పోటీపడనుంది. ఈటోర్నీలో సెమీ ఫైనల్ చేరే నాలుగు జట్లు 2027 మహిళల ఫుట్‌బాల్ ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధిస్తాయి.

తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా కేనేపల్లికి చెందిన 24 ఏళ్ల సౌమ్య గుగులోత్ మిడ్‌ఫీల్డర్. 2021 నుంచి అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడుతోంది. భారత జట్టు విజయాలతో కీలకపాత్ర పోషిస్తోంది. 2024లో ఆలిండియా ఫుట్‌బాల్ సమాఖ్య ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది.

## భళా.. అమ్మాయిలు: ఆసీస్‌పై విక్టరీ


స్మృతి మంధాన ప్లేయర్‌ఆఫ్ ది మ్యాచ్

**అడిలైడ్:** ఆస్ట్రేలియా గడ్డపై భారత అమ్మాయిలు భళా అనిపించారు. అడిలైడ్‌లో జరిగిన మూడో టీ ట్వంటీ మ్యాచ్‌లో 17 పరుగులతో గెలుపొందింది. కంగారూలను దాని సొంతగడ్డపై ఓడించి మూడు టీ20ల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది.

ఆస్ట్రేలియా పర్యటనను విజయంతో ఆరంభించిన భారత జట్టు టీ20 సిరీస్‌లో పంజా విసిరింది. తొలి పోరులోనే ఆసీస్‌కు షాకిచ్చిన టీమిండియా.. రెండో మ్యాచ్‌ను చేజేతులా వదిలేసింది. అయితే.. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టింది. ఓపెనర్ స్మృతి మంధాన(82) అంతర్జాతీయ క్రికెట్‌లో 70వ అర్ధ శతకంతో రాణించింది. జెమీమా రోడ్రిగ్స్ (59) విధ్వంసంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 176 రన్స్ చేసింది.

భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కంగారూలను భారత బౌలర్లు పేకమేడలా కూల్చారు. అష్లే గార్డ్‌నర్ (57) అర్ధ శతకంతో రాణించినా మిగతా వారు విఫలమయ్యారు. శ్రీచరణి మూడు వికెట్లు, శ్రేయాంక పాటిల్ మూడు వికెట్లు, అరుందతి రెడ్డి రెండు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించారు. దీంతో ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 9 వికెట్లు 159 పరుగులే చేయగలిగింది. వన్డే వరల్డ్‌కప్ ఛాంపియన్‌గా భారత విమెన్ టీమ్ విదేశీ పర్యటనలో తొలి సిరీస్ గెలుపొందింది.

## 1.5 బిలియన్ డాలర్ల ఐపిఒకు ఎస్బీఐ ఫండ్స్

**ముంబయి, ఫిబ్రవరి 21:** దేశంలోనే అతిపెద్ద అసెట్‌మేనేజర్‌గా ఉన్న ఎస్‌బిఐ ఫండ్స్ ఐపిఒకు వస్తోంది. వచ్చేనెలలోనే స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద డిఆర్‌హెచ్‌పి దరఖాస్తు చేయున్నట్లు ఎస్‌బిఐ ఛైర్మన్ సిఎస్‌శెట్టి తెలిపారు. ఎంత మొత్తం మేర ఐపిఒకు రావాలన్నది చెప్పకపోయినా నిపుణుల అంచనాలు మాత్రం 1.5 బిలియన్ డాలర్లమేర నిధులు సేకరిస్తుందని అంచనావేసారు. దేశంలోనే ఒక అసెట్ మేనేజ్‌మెంట్‌కంపెనీ చేపట్టిన అతిపెద్ద ఐపిఒ గా చెపుతున్నారు ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఎఎంసి రూ.10వేల కోట్ల ఐపిఒను ఆఫర్‌ఫర్‌సేల్‌రూట్‌లో సేకరించింది. అయితే ఈ సేకరణలో ఐసిఐసిఐ ప్రత్యక్ష భాగస్వామ్యం లేదు. వచ్చే సెప్టెంబరు నాటికి పూర్తి స్థాయిలోఐపిఒకు వచ్చేందుకు సన్నాహాలుచేస్తునానమని అన్నారు. ఐబిఎ 78వ సర్వసభ్య సమావేశం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఎస్బిఐ నిర్వహణ ఆస్తులు రూ.12.5 లక్షలకోట్లుగా ఉన్నాయి. వీటిని ఎస్బిఐ, ఆముండి ఎస్ఎ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. గత ఏడాదే సంయుక్తంగా 10శాతం వాటాను ఐపిఒద్వారా విక్రయించాలని నిర్ణయించారు. అయితే ఇపుడు కేవలం ఆఫర్‌ఫర్‌సేల్‌రూటులో వస్తున్నారు. ఎస్‌బిఐ ఫండ్స్ విలువలు 15 బిలియన్ డాలర్లుగా అం చనా వేసారు. అదే ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ ఎఎం ప్రస్తుత విలువలు 16.7 బిలియన్ డాలర్లుగా తేల్చారు. ఐపిఒ మార్కెట్ బలహీనంగా ఉన్న కాలంలో గత ఏడాది 1.9 లక్షలకోట్లు రికార్డు ఆఫరింగ్స్ వచ్చాయి. బ్యాంకింగేతర సంస్థ ఆయే ఫైనాన్స్ డేటా అనలిటిక్స్ సంస్థ ఫ్రాక్టల్ అన లిటిక్స్‌కు కూడా డిమాండ్ అంతగా కనిపిం చలేదు. ఎస్‌బిఐ ఫండ్స్ కోటక్ మహీంద్ర కేపి టల్, యాక్సిస్ బ్యాంకు, ఎస్‌బిఐ కేపిటల్ మార్కె ట్లను లీడ్ మేనేజర్లుగా నియమిం చుకుంది. మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ అద్వయిజర్స్, ఐసిఐసిఐ సెక్యూరిటీస్, జెఎం ఫైనాన్షియల్, హెచ్‌ఎస్‌బిసి హోల్డింగ్స్ జెఫరీస్ ఫైనాన్షిల్‌గ్రూప్ బ్యాంక్ ఆఫ్ అమెరికాలు షేర్ల అమ్మకాన్ని పర్యవేక్షిస్తాయి.

## పక్షం రోజుల్లోనే రూ.33,487కోట్ల ఎఫ్‌పిఐల పెట్టుబడులు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు దలాల్‌స్ట్రీట్‌లో ఈనెల మొదటి పక్షంలో సుమారు రూ.33,487 కోట్లు పెట్టుబడులుపెట్టారు. 15 విభిన్న రంగాల్లో ఈ పెట్టుబడులున్నాయి. 2025 ఏప్రిల్ రెండో అర్ధభాగం తర్వాత ఇదే భారీస్థాయిలో పెట్టుబడులు వచ్చిన తొలిపక్షంగా చెపుతున్నారు. క్యాపిటల్ గూడ్స్, ఆర్థికసేవలు, ఆయిల్ గ్యాస్ కంపెనీల స్టాక్స్‌లో ఈ పెట్టుబడులున్నాయి భారీ యంత్రపరికరాల తయారీ రంగం అతిపెద్ద లబ్దిదారుగా నిలిచింది. సుమారు రూ.8032 కోట్లు కేవలం ఒక్క పక్షంరోజుల్లోనే సాధించగలిగింది. జనవరిలో 2761 కోట్లుమాత్రమేరాబట్టిన ఈ రంగం ఫిబ్రవరిలో మూడురెట్లు పెంచుకోగలిగింది. భెల్‌లో రూ.4470 కోట్ల వాటా విక్రయం కొంత ఊతం ఇచ్చిందని నిపుణులు అంచనా. ఇండో యుఎస్‌ట్రేడ్‌డీల్ పూర్తికావచ్చినతరుణంలో కేపిటల్‌గూడ్స్‌కు అటు కేంద్రంనుంచి ఇటు ఇన్వెస్టర్లనుంచి మద్దతు పెరుగుతోంది. ఇన్వెస్టర్లు ఇపుడు కేపిటల్‌గూడ్స్, టెక్స్‌టైల్స్, జెమ్స్‌అండ్‌జ్యూయెలరీ రంగాలవైపు దృష్టిపెడుతున్నట్లుకనిపిస్తోంది. ఆర్థికసేవల రంగానికి రూ.6175 కోట్లు వచ్చాయి. అదే జనవరిలో గణనీయంగా వచ్చాయి. 8592 కోట్లు విత్‌డ్రా అయిన జనవరి నెల తర్వాత ఈ రంగం ఫిబ్రవరిలో పెట్టుబడులు రాబట్టుకోగలిగింది. త్రైమాసిక ఫలితాలే ఊతం ఇచ్చాయని నిపుణులు అంచనా. ఆయిల్ అండ్ గ్యాస్ రంగంలోకూడా రూ.4678 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. ఇక ఎఫ్‌పిఐలు 8 కీలక రంగాల్లో రూ.13,800 కోట్లు విత్‌నరడాచేసుకోగా వాటిలో ఒక్క ఐటిరంగంలోనే రూ.10వేల కోట్లవరకూ ఉంది. 2025 సంవత్సరం మొత్తం ఎఫ్‌పిఐలు రూ.75 వేలకోట్లమేర పెట్టుబడులు వెనక్కితీసుకున్నారు. ఎఐ ఆధారిత ఆటోమేషన్ పెరగడమే ఇందుకుకారణం.

## సుప్రీం తీర్పుతో బులియన్ ధరలకు రెక్కలు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** అమెరికా సుప్రంకోర్టు చరిత్రాత్మక తీర్పుతో ట్రంప్ విధించిన సుంకాలన్నీ రద్దుకావడంతో బులియన్ మార్కెట్ ప్రకాశించింది. తీర్పు వెలువడిన వెనువెంటనే బులియన్ మార్కెట్‌లో ఒక్కసారిగా ధరలు పెరిగాయి. వెండిధరలు ఐదుశాం పెరిగి ఔన్స్ ఒక్కంటికి 82.38 డాలర్లుగా నడిచింది. అలాగే బంగారం కూడా 1.41శాతం ర్యాలీ తీసింది. ఔన్స్ ఒక్కంటికి ఐదువేల డాలర్ల మార్కును అధిగమించింది. తీర్పు వెలువడిన వెంటనే గ్లోబల్ మార్కెట్లు ఒక్కసారిగా ఊపందుకున్న సంగతి తెలిసిందే. అమెరికాలోని మేజర్ కంపెనీల సూచీలన్నీ పెరిగాయి. యూరోపియన్, ఆసియా షేర్లు కూడా ట్రేడింగ్ ప్రారంభంలోనే పెరిగాయి. స్పాట్ మార్కెట్‌లో బంగారంధరలు పదిగ్రా ములపైనా 1900 వరకూ పెరిగింది. గడచిన రెండురోజుల్లో రూ.3వేలకుపైగా పెరిగింది. శనివారం బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పదిగ్రాముల బంగారం రూ. 1,59,280గా నడిచింది. ముందురోజుతో పోలిస్తే రూ.1910కి పెరిగింది. 22 క్యారెట్ల బం గారం ధర కూడా రూ.1750 పెరిగి రూ.1,46లక్షలకు చేరింది. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్‌పదిగ్రాముల బంగారం రూ.1,60,150కి చేరితే ఢిల్లీలో రూ. 1,59,430గాను ముంబయి కోల్‌కత్తా నగరాల్లో రూ.1,59,280గాను కొనసాగింది. ముంబయిలో ప్రస్తుతం కిలో వెండి గరిష్టంగా రూ.2.57 లక్షలుగా కొనసాగుతోంది. చెన్నైలో మాత్రమే రూ.2.90 లక్షలుగా ఉంది. ఢిల్లీ కోల్‌కత్తా నగరాల్లో కూడా ముంబయి ధరలే కొనసాగాయి.

## ఎంఎఫ్ఎన్ హోదా ఇస్తే సుంకాలు 3.3శాతం మాత్రమే..




**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** అమెరికా సుప్రీం కోర్టు ఇచ్చినతీర్పును ఖాతరుచేయకుండా ప్లాన్ బి ఉందంటూ ప్రపంచదేశాలపై 10శాతం సుంకాలు విధించిన ట్రంప్ వైఖరితో భారత్ ఇకపై 18 శాతం కాకుండా 10శాతం మాత్రమే సుంకాలు చెల్లించేపరిస్థితి వచ్చింది. ఇప్పటికే భారత్‌కు అమెరికా మోస్ట్ ఫేవర్డ్ నేషన్ హోదాను ఇచ్చింది. దీనివల్ల భారత్‌నుంచి వెళ్లే ఎగుమతులపై అక్కడి దిగుమతి దారులకు సుంకాలు కేవలం 2.8 నుంచి 3.3శాతం మాత్రమే భరించాల్సి వచ్చేది. ఇపుడు ట్యారిఫ్ పుణ్యమా అంటూ 25 నుంచి 100శాతం విధించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఎట్టకేలకు సుప్రీం సుంకాలు చెల్లవని, రద్దుచేస్తూ తీర్పు చెప్పడంతో వెనువెంటనే ట్రంప్ మరో కార్యనిర్వాహక ఉత్తర్వును తెచ్చి ప్రపంచం మొత్తంగా 10శాతం సుంకాలు విధించారు. 24నుంచే అమలుకు వస్తాయని ప్రకటించారు. ఇపుడు సుప్రీం సుంకాల రద్దుతో రీఫండ్‌లకోసం దిగుమతి దారులు ఎగబడుతున్న తరుణంలో ట్రంప్‌నకు సుప్రీం షాక్ ఇచ్చింది. ఏప్రిల్‌నుంచే తాత్కాలిక ఇండో యుఎస్ డీల్ అమలుకు వస్తుందని కేంద్ర మంత్రి పియూష్‌గోయల్ కూడా ప్రకటించారు. ఈక్రమంలో అప్పటివరకూ 18 శాతం సుంకాలన్న అమెరికా ఇపుడు ట్రంప్ కొత్త ఉత్తర్వులతో భారత్‌నుంచి వెళ్లే ఎగుమతులపై అక్కడ దిగుమతిదారులు 10శాతం మాత్రమే సుంకాలు చెల్లించుకోవాల్సి ఉంటుంది.

## టిసిఎస్‌తో కలిసి 100 మెగావాట్ల ఓపెన్ ఎఐ డేటా సెంటర్




**ముంబయి,ఫిబ్రవరి 21:** కృత్రిమమేధ లీడర్‌గా కొనసాగుతున్న ఓపెన్ ఎఐ టాటాగ్రూప్‌తో కలిసి కృత్రిమమేధ మౌలికవనరులను భారత్‌లో పెంచుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే భారీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోతోంది. టిసిఎస్ సుమారు 100 మెగా వాట్ల డేటా సెంటర్‌ను నిర్మిస్తోంది. రానురాను ఈ సెంటర్ ఒక గిగావాట్ సామర్థ్యానికి చేరుతుంది. ఇందుకోసం 35 బిలియన్ డాలర్లు తొలుత అవసరం అవుతాయి. పూర్తయ్యేనాటికి 50 బిలియన్ డాలర్లవరకూ పెట్టుబడులు పెట్టేందుకు రెండు సంస్థలు నిర్ణయించాయి. ఓపెన్ ఎఐ, టిసిఎస్‌లు రెండూ కూడా సమీకృత ఎఐని అభివృద్ధిచేసి వాణిజ్యసంస్థల కార్యకలా పాలకు, కస్టమర్ పరిష్కారాలకు చేరువ చేసేందుకు నిర్ణయించాయి. అంతేకాకుండా ప్రస్తుతం ఏజెంటిక్ ఎఐ వ్యవస్థలను, టూల్స్‌ను వృద్ధిచేస్తున్నాయి.

మానవవనరులు తక్కువగా ఉండి కొన్ని నిర్దిష్టమైన పరిశ్రమలకు ఈ సేవలు అందించేందుకు రెండుసంస్థలు నిర్ణయించాయి. ఓపెన్‌ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్ మాన్ ప్రస్తుతం ఎఐ సదస్సుకోసం భారత్‌లోనే ఉన్నారు. వ్యూహాత్మకప్రాజెక్టులతోపాటు భారత సంస్థలతో జట్టుకట్టి పెట్టుబడులను కూడా కుమ్మరించేందుకు సిద్ధం అవుతోంది. ఇపుడు భారత్‌లో టిసిఎస్ ఓపెన్‌ఎఐ ఆధారిత ఆఫర్లు ప్రపంచ వ్యాప్తంగా చేరువచేయాలనిచూస్తోంది. ఎఐ శిక్షణ కార్యాచరణ భారతీయ యువతకు అందించేందుకు టాటాగ్రూప్‌పరిధిలో ముందు ఇవ్వాలనినిర్ణయించింది. ఇందుకోసం ఓపెన్ ఎఐ కూడా ఫండింగ్ సిద్ధంచేసుకుంటున్నది. తొలివిడ తలోనే 100 బిలియన్ డాలర్లు మించిపోవాలన్న లక్ష్యంతో పనిచేస్తోంది.

## ఐదేళ్లలో ఓపెన్ ఎఐ రాబడులు 280 బిలియన్ డాలర్లు

### సంస్థ వార్షిక అంచనా..




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** ఓపెన్ ఎఐ సంస్థ తన రాబడులు 2030 నాటికి 280 బిలియన్ డాలర్లకు చేరుతుందని ప్రకటించింది. ఎఐ సాఫ్ట్‌వేర్ విక్రయాలు భారీ ఎత్తున పెరగడం వినియోగ దారులు, బిజినెస్ సంస్థలు కూడా ఓపెన్ ఎఐకి ప్రాధాన్యతనివ్వడంతో రాబడులు గణనీయంగా పెరుగుతాయని చెపుతున్నారు. ఓపెన్ ఎఐ సిఎఫ్ఒ సారా ఫ్రయర్ ఇటీవలే తమ కంపెనీ వార్షిక రెవెన్యూ గత ఏడాది 20 బిలియన్ డాలర్లకు చేరిందని, అంతకుముందు ఏడాది కేవలం ఆరుబిలియన్ డాలర్లు మాత్రమే ఉందని చెప్పారు. ఇతర పోటీసంస్థల తరహా లోనే ఓపెన్ ఎఐ మరిన్ని కంపెనీలకు కస్టమర్లకు సేవ లందిస్తోంది. ఎఐ సేవలకు వారిని ఆకర్షితులను చేయడంద్వారా చిప్స్ కాస్ట్, డేటా సెంటర్ల నిర్వ హణ వ్యయం, మరింత ట్యాలెంట్‌హంట్ వ్యయ భారంనుంచి అధిగమించగలుగుతున్నట్లు కూడా చెపుతోంది. ఓపెన్ ఎఐ మౌలికవనరులపై 1.4 లక్షలకోట్ల డాలర్లు వ్యయం చేయనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇన్వెస్టర్లకు కూడా ఇదే చెపుతోంది. 2030నాటికి 600 బిలియన్ డాలర్లు వ్యయం చేస్తామని చెపుతోంది. తొలిదశ ఫండింగ్‌రౌండ్ కూడా పూర్తిచేసుకుంది. సుమారు 100 బిలియన్ డాలర్లు సమీకరించగలిగినట్లు గ్లోబల్ ఫండింగ్ సంస్థలు చెపుతున్నాయి. కంపెనీ మొత్తం విలువలు 850 బిలియన్ డాలర్లను అధిగమించవచ్చని కూడా తెలుస్తోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.